అనుదినం... జనస్వరం

నవతెలంగాణ

ఆదివారం 13 -01-2019

సమగ్ర తెలుగు దినపత్రిక



సంపుటి : 5 సంచిక : 16 | Published from Hyderabad, Rangareddy, Khammam, Karimnagar, Mahaboobnagar, Warangal | www.navatelangana.com | 12 + 16 పేజీలు + సోపతి వెల : 8.00

వచ్చే ఐదేండ్లలో సాగునీటికి 2లక్షల కోట్లు




క్షేత్రస్థాయిలో పర్యటించకుండానే అభిప్రాయానికి రావద్దు

- ఫైనాన్స్ కమిషన్‌కు సూచన
- కాంగ్రెస్, బీజేపీ విధానాలపట్ల ప్రజల్లో వ్యతిరేకత
- ఐదేండ్లలో గ్లోబల్ సిటీగా హైదరాబాద్ : సీఎం కేసీఆర్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

సాగునీటి రంగానికి సంబంధించి ప్రస్తుత ఆర్థిక సంవత్సరం సహా రానున్న ఐదేండ్ల కాలానికి కలిపి రూ.2 లక్షల కోట్లు ఖర్చు చేస్తామని ముఖ్యమంత్రి కేసీఆర్ వెల్లడించారు. ఈ రంగానికి ...9లో



భారీ కుట్ర?

అలోక్‌వర్మ తొలగింపు వెనుక...

దొంగను పట్టుకున్నాక వాడే... దొంగా... దొంగా అని అరిస్తే ఎలా ఉంటుంది? ఈ మాట సీబీఐ సంక్షోభానికి సరిగ్గా సరిపోతుంది. దొంగను వదిలేసిన మోడీ సర్కార్, ఆ దొంగను పట్టుకున్న అధికారిని శిక్షించింది. సీబీఐ సంక్షోభంలో జాతీయ మీడియా తాజా కథనం సంచలనం రేపుతోంది. ప్రధాన నిందితుడిగా ఉన్న రాకేశ్ ఆస్థానా కోసం మోడీ సర్కార్ అడ్డదారి తొక్కిందనీ, అక్రమాలకు పాల్పడిందనీ ఈ వార్తా కథనాల సారాంశం.


- రాకేశ్ ఆస్థానా కోసం సీవీసీ చౌదరీ రాయబారం
- కుదరదన్న అలోక్‌వర్మ
- తిరిగి అలోక్‌వర్మపైనే ఆస్థానా ఆరోపణలు
- ఆస్థానాకు బీజేపీ సర్కార్ పూర్తి అండదండలు



న్యూఢిల్లీ : వార్షిక రహస్య నివేదికలో రాకేశ్ ఆస్థానాపై చేసిన ఆరోపణల్ని వెనెక్కి తీసుకోవాలని అలోక్‌వర్మను సీవీసీ వత్తిడి చేసింది. సీవీసీని అడ్డుపెట్టుకొని మోడీ సర్కార్ జరిపిన రహస్య రాయబారం తాజాగా బట్టబయలైంది. దీనికి సంబంధించి శనివారం జాతీయ మీడియా కథనాలు ప్రకంపనలు సృష్టిస్తున్నాయి. దేశాన్ని కుదిపేసిన సీబీఐ సంక్షోభ ఘట్టంలో అత్యంత కీలకమైనది సీవీసీ విచారణ. సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి ఏకే.పట్నాయక్ పర్యవేక్షణలో ఈ విచారణ జరపాలని సుప్రీంకోర్టు ఆదేశించిన విషయం తెలిసిందే. అయితే ఈ విచారణకు సంబంధించి రిటైర్ట్ జస్టిస్ పట్నాయక్ సన్నిహితులు జాతీయ మీడియాకు కీలక సమాచారాన్ని అందజేశారు. అందులో ఏముందంటే.. రాకేశ్ ఆస్థానాపై తయారు చేసిన వార్షిక రహస్య నివేదిక (ఏసీఆర్)లో సీబీఐ చీఫ్ అలోక్‌వర్మ బలమైన ఆరోపణలు చేశారు. అయితే ఈ ఆరోపణల్ని ...9లో

అలోక్‌పై అవినీతి ఆధారాల్లేవు

సీవీసీ నివేదికలోని నిర్ధారణలు నావి కావు : జస్టిస్ పట్నాయక్ 9లో..



ప్రేమ జంట గ్రామ బహిష్కరణ

తక్కువ కులం వాన్ని పెండ్లి చేసుకుందని కుటుంబం వెలివేత

- మూడేండ్లు గడిచినా శాంతించని కులపెద్దలు
- బిక్కుబిక్కుమంటూ పట్టణంలో మకాం
- వికారాబాద్ జిల్లా సిద్ధులూర్‌లో ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఘటన



(ఫైల్) వివరాలు 9లో

స్వైన్‌ఫ్లూ పంజా

హైదరాబాద్‌లో 10 రోజులు.. 83 కేసులు

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

రాష్ట్రంలో స్వైన్ ఫ్లూ వైరస్ స్వైరవిహారం చేస్తున్నది. ఉష్ణోగ్రతలు తగ్గుముఖం పట్టి చలి తీవ్రత పెరగడంతో వ్యాధి వ్యాప్తి చెందుతున్నది. హైదరాబాద్‌లో కేవలం 10 రోజుల్లోనే 83 మందికి వ్యాధి సోకిందని వైద్యాధికారుల పరీక్షల్లో తేలింది. జనవరి 1 నుంచి 10 వరకు వరకు 483 మంది శాంపిళ్లను పరీక్షించగా వీరిలో 83 మందికి ఈ వ్యాధి సోకిందని వెల్లడైంది. నగరంలోని పలు ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఫ్లూతో పలువురు రోగులు చేరారు. సాధారణంగా నల్లకుంటలోని ఫీవర్ ఆస్పత్రికి రోజుకు సగటున 600 రోగులు అనారోగ్యంతో వస్తుంటారు. కానీ, చలి తీవ్రత పెరగడంతో రోజుకు 1000 మంది రోగులు ఆస్పత్రికి వస్తున్నారని వైద్యులు చెప్పారు. ఉష్ణోగ్రత తగ్గడం వల్ల వైరస్ విజృంభిస్తున్నదని వివరించారు. స్వైన్ ఫ్లూ వ్యాప్తి చెందుతున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వైద్యులు సూచించారు. ఒక పక్క రాష్ట్రంలో స్వైన్‌ఫ్లూ కేసుల సంఖ్య పెరుగుతుంటే తెలంగాణ వైద్య ఆరోగ్యశాఖ మాత్రం ప్రజల్లో అవగాహన కల్పించడంలేదనే విమర్శలున్నాయి. స్వైన్‌ఫ్లూ బాధితుని కుటుంబ సభ్యులను, సన్నిహితులను గుర్తించి, ముందస్తు చికిత్సనందించడం... మరొకరికి వ్యాప్తికాకుండా అడ్డుకోవడంలో వైద్య సిబ్బంది చురుకైన పాత్ర పోషించడంలేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కాగా అనధికారికంగా స్వైన్‌ఫ్లూ బాధితుల సంఖ్య రెట్టింపుస్థాయిలో ఉన్నదని పలువురు పెదవి విరుస్తున్నారు. ప్రయివేటు ఆస్పత్రుల్లో వ్యాధిగ్రస్తులు ఎక్కువ ...9లో



ఎనీ టైం నో వాటర్

నిర్వహణ లేదు.. నీరు సరఫరా కాదు

- వృథాగా మారిన వాటర్ ఏటీఎంలు
- గ్రేటర్‌లో 100 కియోస్కుల ఏర్పాటు
- విఫలమైన జీహెచ్ఎంసీ, వాటర్‌బోర్డు
- వేసవి సమీపిస్తుండటంతో బాగు చేయాలని నగరవాసుల వినతి



నవతెలంగాణ-సిటీబ్యూరో

హైదరాబాద్ మహానగర ప్రజలకు తక్కువ ధరకే స్వచ్ఛమైన తాగునీటిని అందించాలనే లక్ష్యంతో జీహెచ్ఎంసీ ఏర్పాటు చేసిన వాటర్ ఏటీఎంలు వృథాగా మారాయి. లక్ష్యం ఘనమైనా.. నిర్వహణ శూన్యమైంది. ట్యాంకులకు నీటి ...9లో

మార్కెట్‌లో రైతు మృతి

విశ్రాంతి భవనంలోకి అనుమతించని సిబ్బంది !

- చలి తీవ్రతకు తట్టుకోలేక..
- కేసముద్రం వ్యవసాయ మార్కెట్‌లో ఘటన



వివరాలు 9లో



కుదిరిన లోకల్ దోస్తీ

యూపీలో ఒక్కటైన ఎస్పీ, బీఎస్పీ

- బీజేపీకి చెక్ పెట్టేందుకే.. : మాయావతి



వివరాలు 2లో

యోగి.. ఎన్‌కౌంటర్ రాజ్

రెండేండ్లు.. 1,038 పోలీసు ఎన్‌కౌంటర్లు.. 32మంది హత్య

- యూపీలో రక్తపాతంపై యూఎన్ తీవ్ర ఆందోళన
- దర్యాప్తులో 'సుప్రీం' మార్గదర్శకాలు బీజేపీ సర్కార్ బేఖాతర్



వివరాలు 2లో



సంక్రాంతికి సొంతూర్లకు..

బస్టాండ్లు, రైల్వే స్టేషన్లలో కిక్కిరిసిన జనం

- సరిపడ బస్సులు, రైళ్లు లేక ప్రయాణికుల ఇక్కట్లు
- అదనపు చార్జీల పేరుతో దోపిడీ
- టోల్‌గేట్ల వద్ద కిలోమీటర్ల మేర ట్రాఫిక్‌జామ్
- హైవేలపై వాహనాల రద్దీతో ప్రమాదాలు

సంక్రాంతి పండగకు వరుసగా నాలుగురోజుల సెలవులు రావడంతో పట్నం వాసులు పల్లెబాట పట్టారు. శుక్రవారం రాత్రి నుంచే సొంతూర్లకు పయనం కట్టారు. దీంతో బస్టాండ్లు, రైల్వే స్టేషన్లు కిటకిటలాడుతున్నాయి. అక్కడ బస్సులు, రైళ్లల్లో సీట్లు దొరక్క అవస్థలు పడుతున్నారు. ఇదే అదనుగా ప్రయివేటు ట్రావెల్స్, ఆర్టీసీ అదనపు చార్జీలతో ప్రయాణికులను పీల్చిపిప్పి చేస్తున్నాయి. ఆంధ్రప్రదేశ్‌కు ఎక్కువగా జనం వెళ్తుండటంతో జాతీయ రహదారులు వాహనాల రద్దీతో కిటకిటలాడుతున్నాయి. అదే సమయంలో అతివేగం, పొగమంచు వల్ల ప్రమాదాలూ చోటు చేసుకుంటున్నాయి. టోల్‌గేట్ల వద్ద కిలోమీటర్ల మేర ట్రాఫిక్ జామ్ స్తంభించిపోవడంతో ప్రయాణికులు ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు. వివరాలు 9లో

ఆగని పెట్రో మోత

- పెట్రోలుపై 19 పైసలు, డీజిల్ 29 పైసలు వడ్డింపు

న్యూఢిల్లీ : పెట్రో ధరల బాదుడు బంద్ కావడం లేదు. రోజూ పైసల్లోనే పెరుగుతున్నా.. వరుస వడ్డింపులతో నెలపరంగా చూస్తే అది భారీ మొత్తంలో ఉంటున్నది. శుక్రవారం లీటర్ పెట్రోలుపై 19 పైసలు, లీటరు డీజిల్‌పై రూ.29 పైసలు పెరిగాయి. తాజా పెంపుతో ఢిల్లీలో లీటరు పెట్రోలు ధర రూ.69.26కు చేరుకున్నది. హైదరాబాద్‌లో పెట్రోలు లీటరుకు రూ.73.50, ముంబయిలో రూ.74.91గా ఉన్నది. ఢిల్లీలో డీజిల్ ధర లీటరుకు రూ.63.10 కాగా.. హైదరాబాద్‌లో రూ.68.61గా ఉన్నది.

ఐదో రోజుకు 'బెస్ట్' సమ్మె

- కార్మిక సంఘాలతో సీఎస్ చర్చలు విఫలం
- సమ్మె కొనసాగిస్తాం : కార్మిక సంఘాలు

ముంబయి: బృహన్‌ముంబయి ఎలక్ట్రిక్ సప్లై అండ్ ట్రాన్స్‌పోర్ట్(బెస్ట్) కార్మికుల సమ్మె ఐదో రోజుకు చేరుకుంది. సమ్మెను ఆపడానికి కార్మికులతో చర్చించాలని, అందుకోసం ఒక కమిటిని ఏర్పాటు చేయాలని బాంబే హైకోర్టు రాష్ట్ర ప్రభుత్వానికి శుక్రవారం ఆదేశాలు జారీచేసింది. ఈ నేపథ్యంలో మహరాష్ట్ర ప్రభుత్వ కార్యదర్శి డీకే జైన్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన కమిటి కార్మిక సంఘాలతో, యాజమాన్యంతో శనివారం చర్చలు జరిపాయి. ఈ చర్చలు విఫలమయ్యాయని కార్మిక నాయకులు తెలిపారు. దీనిపై కార్మిక సంఘాల నాయకులు మాట్లాడుతూ...తమ డిమాండ్లను ప్రభుత్వ కమిటీ ముందు ఉంచామన్నారు. తమ సమస్యలను పరిష్కరించే వరకు సమ్మె ఆపబోమని కమిటికి విన్నవించామని తెలిపారు. తమ డిమాండ్ల పట్ల ప్రభుత్వ కమిటీ నుంచి సానుకూల వైఖరి కనిపించలేదన్నారు. అందుకే సమ్మె కొనసాగిస్తామన్నారు. దీనిపై ప్రధాన కార్యదర్శి డీకే జైన్ మాట్లాడుతూ... కార్మికుల సమస్యలను కూలంకుషంగా విన్నామని, వీటిపై హైకోర్టుకు నివేదిక సమర్పిస్తామన్నారు. కాగా తమ డిమాండ్లను పరిష్కరించాలని 32వేలకు మందికి పైగా బెస్ట్ కార్మికులు మంగళవారం నుంచి సమ్మె చేస్తున్న సంగతి తెలిసిందే.

పరిశీలనలో నలుగురు పేర్లు

- నెలాఖరులోగా సీబీఐ చీఫ్ ఎంపిక!

న్యూఢిల్లీ : సీబీఐ చీఫ్ పదవి కోసం నలుగురు పేర్లతో తుది జాబితా రూపొందించినట్టు సమాచారం. 1984 బ్యాచ్ ఐపీఎస్ అధికారులైన ఎన్ఐఏ చీఫ్ వైసీ.మోడీ, బీఎస్ఎఫ్ చీఫ్ రజనీకాంత్ మిశ్రా, 'రా' ప్రత్యేక కార్యదర్శి వివేక్ జోహ్రీ, సీఆర్‌పీఎఫ్ చీఫ్ రాజేశ్ రంజన్ పేర్లతో కేంద్రం తుది జాబితా రూపొందించిందని సమాచారం. దీనిపై ప్రధాని నేతృత్వంలోని ఎంపిక కమిటీ సమావేశమై ఈ నెలాఖరులోగా నిర్ణయం తీసుకోనున్నది. ఈ నలుగురు అధికారులకు ఇంతకుముందు సీబీఐలో పనిచేసిన అనుభవం ఉందని సీబీఐలోని ఉన్నతాధికారి ఒకరు శనివారం మీడియాకు వెల్లడించారు. అలోక్‌వర్మ తొలగింపు అనంతరం సీబీఐ చీఫ్ ఎంపికపై మోడీ సర్కార్ వేగంగా కదులుతోందనీ, వివాదాన్ని వీలైనంత తొందరగా సద్దుమణిగేలా చేయాలని భావిస్తోందనీ వార్తలు వెలువడుతున్నాయి. 18 ఐపీఎస్ ఉన్నతాధికారుల పేర్లతో కూడిన జాబితాను కేంద్ర హోం శాఖ రూపొందించిందనీ, దీనిని సిబ్బంది, శిక్షణ, నియామకాల శాఖకు పంపారనీ తెలుస్తోంది.

జమ్ములో బాలికపై లైంగికదాడి

- ఆందోళనకు దిగిన స్థానికులు
- నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్



శ్రీనగర్: సంచార కుటుంబానికి చెందిన బాలికపై జమ్ములో జరిగిన లైంగికదాడి ఘటన స్థానికంగా దుమారం రేపింది. ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఈ ఘటనపై స్థానికులు ఆందోళనకు దిగారు. నిందితులకు కఠినంగా శిక్షించాలని డిమాండ్‌చేశారు. ఘనటకుసంబంధించి వివరాల్లోకి వెళితే.. మూడునెలల క్రితం పశువులను కాసుకుంటు బాలిక(12)బయటికి వెళ్లింది. అక్కడ ఐదుగురు యువకులు ఆమెపై అఘాయిత్యానికి చేశారు. ఈ విషయం ఎవరికైనా చెబితే తన కుటుంబీకులను చంపుతామని ఆమెను బెదిరించారు. దీంతో బాలిక ఘటన గురించి ఎవరికీ తెలుపలేదు. కాగా, ఇటీవల ఆ బాలిక కడుపునొప్పితో బాధపడుతుండటంతో ఆస్పత్రికి తీసుకెళ్ళగా అసలు విషయం బయటపడింది. దీంతో ఆమె తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదుచేశారు. దర్యాప్తు ప్రారంభించిన పోలీసులు నిందితులను అరెస్టు చేశారు. అనంతరం బాలికను ఆస్పత్రికి తరలించారు. కాగా ఈ ఘటన గురించి తెలియడంతో స్థానికులు ఆందోళన చేపట్టారు. నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్‌చేశారు.

సీఎం రాజీనామా చేయాలి

త్రిపురలో అమాయకజనంపై పోలీసు కాల్పులు

- బిప్లవ్ సర్కార్ ఆంక్షలతో బహిర్గతం కానీ ఖాకీల వీరంగం
- పోలీసు కాల్పులపై దర్యాప్తు జరపాలి : గిరిజన సంఘాల డిమాండ్


త్రిపుర సీఎం

అగర్తల: పౌరసత్వ (సవరణ) బిల్లుకు వ్యతిరేకంగా త్రిపురలో గిరిజనం ఆందోళనకు దిగారు. ఆ బిల్లు వల్ల తమకు అన్యాయం జరుగుతుందనే ఆందోళనతో గిరిపుత్రులు రోడ్డెక్కారు. వారిపై బిప్లవ్‌దేవ్ సర్కార్ వీరంగం సృష్టించింది. తుపాకులు ఎక్కుపెట్టింది. హింసాత్మకచర్యలకు ఒడిగట్టింది. హఠాత్తుగా పోలీసులు తెగబడ్డారు. ఈ దాడిలో గాయపడ్డ వారిని అంబులెన్స్‌లోకి తరలిస్తుండగా.. ఖాకీలు రెచ్చిపోయారు. గాయాల నొప్పులు భరించలేక తల్లడిల్లుతుంటే.. వారిని లాఠీలతో కుళ్లబొడిచారు. ఈ దౌర్జన్యకాండ ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఈ నెల 8న పోలీసులు కాల్పుల్లో ఆరుగురు యువకులకు గాయాలయ్యాయి. మొబైల్ డేటా, ఇంటర్నెట్ సేవలను త్రిపుర ప్రభుత్వం నిలిపివేయడంతో ఈ దురాగతం వెలుగులోకి రాలేదు. తాజాగా కాల్పుల వీడియో సోషల్ మీడియాలో వెలుగులోకి రావడంతో రాష్ట్ర వ్యాప్తంగా నిరసనలు మిన్నంటాయి. కాల్పులను ఖండిస్తూ, పౌరసత్వ (సవరణ) బిల్లుకు వ్యతిరేకంగా త్రిపురలోని గిరిజన గ్రూపులు శనివారం బంద్‌కు పిలుపునిచ్చాయి. గిరిజనులపై కాల్పులకు తెగబడిన బీజేపీ ముఖ్యమంత్రి రాజీనామా చేయాలనీ, పోలీసు కాల్పుల ఘటనపై హైకోర్టు ప్రస్తుత న్యాయమూర్తితో విచారణ జరిపించాలని బీజేపీ మిత్రపక్షమైన త్రిపుర ఇండిజినస్ నేషనలిస్ట్ పార్టీ (ఐఎన్‌పీటీ) నేతృత్వంలోని పార్టీలు డిమాండ్ చేశాయి. గాయపడిన యువకులకు రూ. 20 లక్షల పరిహారం, లేదా ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశాయి. 'పౌరసత్వ (సవరణ)బిల్లుకు వ్యతిరేకంగా శాంతియుతంగా, ప్రజాస్వామ్య పద్ధతిలో ఆందోళన చేస్తున్న అమాయక ప్రజలపై పోలీసులు కాల్పులు జరిపారు. ఈ ఘటనను నిరసిస్తూ మేం బంద్‌కు పిలుపునిచ్చాం' అని ఐఎన్‌పీటీ ప్రధాన కార్యదర్శి జగదీశ్ దేవ్ వర్మ అగర్తలలో మీడియాతో చెప్పారు. బంద్ నేపథ్యంలో త్రిపుర స్టేట్ రైఫిల్స్, సెంట్రల్ రిజర్వ్ పోలీస్ ఫోర్స్ (సీఆర్‌పీఎఫ్), అసోం రైఫిల్స్, త్రిపుర పోలీసు భద్రతా బలగాలను గిరిజన ప్రాంతాల్లో భారీగా మోహరించారు. మొబైల్ డేటా, ఇంటర్నెట్ సేవలపై నిషేధం ఇంకా కొనసాగుతున్నది. 'బీజేపీ నేతృత్వంలోని త్రిపుర ప్రభుత్వానికి ప్రజాస్వామ్య విలువలపై నమ్మకంలేదు. ఈశాన్య రాష్ట్ర ప్రజల మనోభావాలు, అభిప్రాయాలను అణగదొక్కాలనే ప్రయత్నాలను చేస్తున్నది. ఓటువేసిన వారిపైనే కాల్పులకు తెగబడటం ఇందుకు ఉదాహరణ. దీనిపై మేం పోరాడుతున్నాం. బిల్లును ఎట్టి పరిస్థితుల్లోనూ అమలుకానివ్వబోం' అని నార్త్‌ఈస్ట్ స్టూడెంట్స్ ఆర్గనైజేషన్ (ఎన్ఈఎస్ఓ) సలహాదారు సముజ్జల్ భట్టాచార్జీ చెప్పారు. బంద్‌కు పిలుపునిచ్చిన గిరిజన పార్టీలకు ప్రజల్లో ఎలాంటి పట్టూ లేదనీ, ఈ పార్టీలతోపాటు, సీపీఐ(ఎం) రాష్ట్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా కుట్రపన్నాయని బీజేపీ అధికార ప్రతినిధి నబెందు భట్టాచార్య ఆరోపించారు. కాగా బంద్‌కు కాంగ్రెస్ పార్టీ కూడా మద్దతు పలికింది. బీజేపీ నేతృత్వంలోని మణిపూర్ ప్రభుత్వం కూడా పౌరసత్వ బిల్లు నుంచి మినహాయింపు కోరింది. ఈశాన్యరాష్ట్రాల్లో ఎన్డీయే భాగస్వామ్యపక్షమైన అసోం గణ పరిషత్, మిజోరంలో పాలక మిజో నేషనల్ ఫ్రంట్, మేఘాలయలో బీజేపీ సంకీర్ణ ప్రభుత్వానికి నేతృత్వం వహిస్తున్న ఎన్‌పీపీ, నాగాలాండ్‌లో బీజేపీతో సంకీర్ణ ప్రభుత్వంలో చేతులుకలిపిన ఐపీఎఫ్‌టీ, ఎన్‌డీపీపీలు కూడా పౌరసత్వ (సవరణ) బిల్లును వ్యతిరేకిస్తున్నాయి. ఏజీపీ ఇప్పటికే ఎన్డీయేకు గుడ్‌బై చెప్పిన విషయం తెలిసిందే. గతంలో వామపక్షప్రభుత్వం ఉన్నపుడు ఇలాంటి హింసారాజకీయాన్ని ఎన్నడూ చూడలేదని స్థానికజనంలో చర్చ.

ఈబీసీ బిల్లుకు రాష్ట్రపతి ఆమోదం

న్యూఢిల్లీ: ఆర్థికంగా వెనుకబడిన అగ్రవర్ణ పేదలకు విద్య సంస్థలు, ఉద్యోగాల్లో జనరల్ కేటగిరీలో 10శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ కేంద్రప్రభుత్వం తీసుకొచ్చిన బిల్లుకు రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ ఆమోద ముద్ర వేశారు. రాష్ట్రపతి ఆమోదం తెలపగా, ప్రభుత్వం గెజిట్‌ను విడుదల చేయడంతో ఈబీసీ రిజర్వేషన్ల చట్టం అమల్లోకి వచ్చింది. రాజ్యాంగం (124వ సవరణ) బిల్లు 2019కు లోక్‌సభ మంగళవారం, రాజ్యసభలో బుధవారం ఆమోదం పొందిన విషయం తెలిసిందే. అగ్ర కులాల్లోని పేదలను గుర్తించేందుకు కేంద్రం కొన్ని మార్గదర్శకాలను రూపొందించింది. ఐదెకరాలకు మించి వ్యవసాయ భూమి ఉండకూడదు, కుటుంబ వార్షికాదాయం రూ. 8 లక్షల లోపు ఉండాలి. వెయ్యి చదరపు అడుగుల కంటే ఎక్కువ విస్తీర్ణంలో సొంతి ల్లు లేనివారు, మున్సిపాలిటీల్లో 100 గజాలు, మున్సిపాలిటీ కాని ప్రాంతా ల్లో 200 గజాలకు మించిన స్థలాలు లేనివారు అర్హులుగా ప్రకటించింది. అయితే ఆ బిల్లుకు సంబంధించి ప్రతిపక్షాలు పలు విమర్శలు చేశాయి. ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో బీజేపీ చేస్తున్న జిమ్మిక్కుగా అభివర్ణిం చాయి. స్వతంత్ర సంస్థలు ఇచ్చిన నివేదిక ప్రకారం.. గత 15 నెలల కాలం లో దేశంలో డిసెంబర్‌లో నిరుద్యోగిత పెరిగింది. ఇది వచ్చే ఎన్నికల్లో కీలక పాత్ర పోషించే అంశంగా విశ్లేషకులు అభిప్రాయ పడుతున్నారు. మరోవైపు ఈ బిల్లును సవాలుచేస్తూ సుప్రీంకోర్టులో ఓ పిటిషన్ కూడా దాఖలైంది. ఈ బిల్లుతో కోటా పరిమితి 50 శాతం దాటిపో తున్నదనీ, ఇది సుప్రీంకోర్టు ఆదేశాలకు విరుద్ధమని యూత్ ఫర్ ఈక్వాలిటీ అనే స్వచ్ఛంద సంస్థ సుప్రీంను ఆశ్రయించింది. కాగా ట్రిపుల్ తలాక్ ఆర్డినెన్స్‌కు కూడా రాష్ట్రపతి ఆమోదా ముద్ర వేసినట్టు తెలిసింది.

కుదిరిన లోకల్ దోస్తీ

యూపీలో ఒక్కటైన ఎస్పీ, బీఎస్పీ

- బీజేపీకి చెక్ పెట్టేందుకే.. : మాయావతి



లక్నో : ఉత్తరప్రదేశ్‌లో సమాజ్‌వాదీ పార్టీ(ఎస్పీ), బహుజన్ సమాజ్‌పార్టీ(బీఎస్పీ)లు ఒక్కటయ్యాయి. రాబోయే లోక్‌సభ ఎన్నికల్లో కలిసి బరిలోకి దిగనున్నట్టు రెండు పార్టీలు శనివారం సంయుక్తంగా ప్రకటించాయి. ఈ ఎన్నికల్లో రాష్ట్రంలోని మొత్తం 80 ఎంపీ సీట్లకు గానూ చెరో 38 స్థానాల్లో పోటీ చేయనున్నట్టు వెల్లడించాయి. మిగిలిన నాలుగు స్థానాలను కాంగ్రెస్, ఇతర పార్టీలకు వదిలేసినట్టు వివరించాయి. 25 ఏండ్ల కిందట ఎస్పీ, బీఎస్పీ కలిసి అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేయగా.. ఆ బంధం ఇప్పుడు మళ్లీ చిగురించింది. 1993 అసెంబ్లీ ఎన్నికల్లో ఎస్పీ, బీఎస్పీ కూటమి 176 స్థానాల్లో విజయం సాధించి.. ఇతర పార్టీల మద్దతుతో సంకీర్ణ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది. మరోవైపు.. అటు కేంద్రంలో, ఇటు రాష్ట్రంలో దుర్మార్గ పాలన సాగిస్తున్న బీజేపీకి చెక్ పెట్టేందుకే కూటమిగా ఏర్పడినట్టు బీఎస్పీ అధినేత్రి మాయావతి తెలిపారు. ఎస్పీ, బీఎస్పీ సంయుక్తంగా శనివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. తాజాగా కుదిరిన పొత్తు రెండు పార్టీల ప్రయోజనాల కోసం కాదన్నారు. 1993 నాటి స్ఫూర్తితో ఎన్నికల్లో కలిసి పోటీ చేయాలని నిర్ణయించుకున్నామని, ఈ పరిణామం బీజేపీకి తగిన సమాధానం చెప్పేందుకు దోహదపడుతుందని చెప్పారు. ప్రధాని మోడీ, బీజేపీ జాతీయాధ్యక్షుడు అమిత్ షాలకు ఈ సమావేశం నిద్రలేని రాత్రులను మిగుల్చుతుందని అన్నారు. రైతులు, నిరుద్యోగుల్లో బీజేపీపై తీవ్ర వ్యతిరేకత ఉన్నదని ఆమె తెలిపారు.

మరోవైపు.. ఎస్పీ, బీఎస్పీ కూటమిలో చేరితే రెండు స్థానాలే దక్కే అవకాశమున్న నేపథ్యంలో ఒంటరిగానే బరిలోకి దిగాలని కాంగ్రెస్ యోచిస్తున్నట్టు తెలుస్తున్నది. రాజస్థాన్, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్ అసెంబ్లీ ఎన్నికల్లో తిరుగులేని విజయం సాధించి జోరుమీదున్న కాంగ్రెస్‌కు రెండు స్థానాలు మాత్రమే కేటాయించడంపై అనేక అనుమానాలు తలెత్తుతున్నాయి. కాంగ్రెస్‌ను దూరం పెట్టేందుకే మాయావతి, ఎస్పీ అధినేత అఖిలేశ్ యాదవ్ తాజా వ్యూహం పన్నినట్టు గుసగుసలు వినిపిస్తున్నాయి. అంతేకాక.. మాయావతికి ప్రధాని అభ్యర్థిత్వంపై అడిగిన ప్రశ్నకు అఖిలేశ్ ఆసక్తికర సమాధానమిచ్చారు. ఉత్తరప్రదేశ్ అనేక మంది ప్రధానులను ఇచ్చిందని, రాష్ట్రం నుంచి మరో వ్యక్తి ప్రధాని అయితే సంతోషిస్తానని ఆయన అన్నారు.

పళని రాజీనామా చేయాలి

'కొడనాడు వరుస హత్యల'పై డీఎంకే డిమాండ్

చెన్నై: తమిళనాడు మాజీ ముఖ్యమంత్రి జయలలితకు చెందిన కొడనాడు ఎస్టేట్‌లో చోరీ యత్నం, తదనంతరం జరిగిన వరుస హత్యల విషయంలో ఆ రాష్ట్ర సీఎం పళనిస్వామి మెడకు ఉచ్చు బిగుస్తున్నది. ఈ కేసులో నిందితుడిగా ఉన్న సయాన్.. పళనిపై ఆరోపణలు చేస్తూ ఇచ్చిన ఇంటర్వ్యూను నారదా న్యూస్ చీఫ్‌ఎగ్జిక్యూటివ్ అధికారి మథ్యూ శామ్యూల్ గురువారం విడుదల చేశారు. ఈ వీడియో తమిళనాట సంచలనం సృష్టిస్తున్నది. దీంతో ఆయన రాజీనామాకు ప్రతిపక్ష డీఎంకే డిమాండ్ చేస్తున్నది. 'కొడనాడు ఎస్టేట్స్‌లో రూ.2000 కోట్లు, విలువైన పత్రాలున్నాయంటూ.. జయ మాజీ కారు డ్రైవరు కనకరాజ్ నాకు సమాచారం ఇచ్చారు. ఇందుకోసం తమిళనాడుకు చెందనివారిని నియమించుకోవాలని తెలిపాడు. దొంగిలించిన పత్రాలను పళనిస్వామికి అందజేయాలన్నాడు. ఆయన పళనిస్వామితో సన్నిహితంగా ఉండేవారు. సీఎంగా ప్రమాణస్వీకారం చేశాక పళనిని కనకరాజ్ కలిశారు' అని సయాన్ ఆరోపించారు. 'జయమరణానంతరం 2017, ఏప్రిల్‌లో పదిమంది వరకు ఎస్టేట్‌లో చొరబడి సెక్యూరిటీని బంధించాం. అనంతరం పత్రాలని దొంగిలించాం' అన్నాడు. అయితే చోరీలో సంబంధమున్న కనకరాజ్‌తో పాటు మరో నలుగురూ కొంత కాలానికి మృతి చెందారని కోయబంత్తూరు జైలు అధికారులు నారదా న్యూస్‌కు తెలిపారు. కాగా, సీఎం పదవికి పళనిస్వామి రాజీనామా చేయాలని డీఎంకే అధ్యక్షుడు స్టాలిన్ డిమాండ్ చేశారు. జయ మృతిపై కూడా సీబీఐ దర్యాప్తు చేయాలన్నారు. కాగా,వీడియో విడుదల చేసిన శామ్యూల్‌పై కేసు వేస్తామని అధికార ఏఐఏడీఎంకే తెలిపింది.

గల్ఫ్ కు తగ్గిన భారత కార్మికుల వలసలు

- ఐదేండ్లలో 62శాతం పడిపోయింది

ముంబయి: ఉపాధి కోసం గల్ఫ్‌దేశాలకు వెళ్లే భారతీయుల సంఖ్య ప్రతిఏడాదీ గణనీయంగా తగ్గుతున్నది. గత ఐదేండ్లలో వలసలు 62శాతం తగ్గడమే ఇందుకు నిదర్శనం. ఈ సమాచారం అంతా ఇ-మైగ్రేట్ ఇమిగ్రేషన్ క్లియరెన్స్ సమాచారం ఆధారంగా లభ్యమైంది. దీని ప్రకారం.. 2014లో యూఏఈ, సౌదీ అరేబియా, కువైట్, కతర్, ఒమన్, బహ్రైన్ వంటి గల్ఫ్‌దేశాలకు వలసవెళ్లిన భారతీయుల సంఖ్య 7,75,845 ఉండగా.. అది 2018 నాటికి 2,94,837కు పడిపోయింది. 2017తో(3,74,324) పోల్చుకుంటే.. గతేడాది (నవంబరు,30 వరకు)లో వలసల సంఖ్య 21శాతం తగ్గింది. ఇక 2018లో భారతీయులు యూఏఈకి అధికంగా వలసవెళ్లినప్పటికీ గతేడాదితో పోల్చుకుంటే అది 1.03 లక్షలకు తగ్గడం గమనార్హం. ఇక తర్వాతి స్థానాల్లో సౌదీ అరేబియా(65,000), కువైట్(52,000) ఉన్నాయి. అంతకముందు భారతీయులు అధికంగా వలసవెళ్లే దేశంగా సౌదీ ఉన్నప్పటికీ 2017 ఆ స్థానాన్ని యూఏఈ సొంతం చేసుకున్నది. 2014లో మొత్తం 3.30 లక్షల మంది సౌదీకి వలసవెళ్లగా.. 2018నాటికి అది ఏకంగా 80శాతం తగ్గి 65,542కు చేరకున్నది. ఇక కతర్‌కు 2017లో వలసవెళ్లిన భారతీయుల సంఖ్య 25వేలు ఉండగా 2018 నాటికి అది31శాతం పెరిగి 32,500కు చేరుకున్నది. కాగా, కతర్‌లో దాదాపు 6-7.5లక్షల మంది వలస వెళ్లిన భారత వలస కార్మికులున్నారని ఓ అధ్యయన సంస్థ తెలిపింది. ఇది ఆ దేశ జనాభా కంటే దాదాపు రెట్టింపు కావడం విశేషం. అయితే చమురు ధరల తిరోగమనంతో గల్ఫ్‌దేశాల ఆర్థిక పరిస్థితి మందగించడం, పబ్లిక్, ప్రయివేటు రంగాల్లో వారి దేశస్థులకే అక్కడి ప్రభుత్వాలు ప్రాధాన్యం ఇస్తుండటం వంటివి భారతీయుల వలసలు తగ్గడానికి కారణాలు అని విదేశాంగ మంత్రిత్వశాఖ (ఎంఈఏ) గతనెల లోక్‌సభ సమావేశాల్లో తెలిపిన విషయం విదితమే.

యోగి.. ఎన్‌కౌంటర్ రాజ్

రెండేండ్లలో 1,038ల పోలీసు ఎన్‌కౌంటర్లు.. 32మంది హత్య

- యూపీలో రక్తపాతంపై యూఎన్ తీవ్ర ఆందోళన
- దర్యాప్తులో 'సుప్రీం' మార్గదర్శకాలు బీజేపీ సర్కార్ బేఖాతర్



న్యూఢిల్లీ: ఉత్తరప్రదేశ్‌లో యోగి హయాంలో.. ఎన్‌కౌంటర్ల పాలన సాగుతోంది. గో అక్రమ రవాణా పేరిట జరిగే మూకదాడులకు తోడు.. పోలీసుల నకిలీ ఎన్‌కౌంటర్ హత్యలతో రాష్ట్రం నెత్తురోడుతున్నది. 2017లో రాష్ట్ర సీఎంగా యోగి ఆదిత్యానాథ్ బాధ్యతలు తీసుకున్న తర్వాత ఆరునెలల్లో 420 ఎన్‌కౌంటర్లు జరగ్గా.. అందులో 15మంది మరణించారు. 2018కల్లా యూపీ పోలీసులు 1,038 ఎన్‌కౌంటర్లు చేపట్టగా.. అందులో 32 మంది అసువులుబాశారు. గతేడాది రాష్ట్రంలో జరిగిన ఎన్‌కౌంటర్ హత్యలపై ఓ జాతీయ వార్తాసంస్థ దర్యాప్తు చేయగా.. దాదాపు 14 బాధిత కుటుంబాలు ఈ హత్యలు ముందస్తు ప్రణాళికతో జరిగినవేనని ఆరోపించడం గమనార్హం.

కాగా, ఈ ఎన్‌కౌంటర్ హత్యలపై ఐక్యరాజ్య సమితి(ఐరాస) హక్కుల విభాగం తీవ్ర ఆందోళనను వ్యక్త పరిచింది. ఈ ఘటనలపై హెచ్చరికగా భారత ప్రభుత్వానికి ఒక లేఖ రాసింది. ఇందులో యూపీ పోలీసులు 'చట్టాన్ని అతిక్రమించి' హత్య చేసిన 15 కేసులను ఆఫీస్ ఆఫ్ ద హైకమిషనర్ ఫర్ యునైటెడ్ నేషన్స్ హ్యూమన్ రైట్స్(ఓహెచ్‌సీహెచ్‌ఆర్) ఉటంకించింది. దీంతోపాటు నకిలీ ఎన్‌కౌంటర్‌గా అనుమానిస్తున్న 59 కేసులనూ పేర్కొంది. ఓహెచ్‌సీహెచ్‌ఆర్ లేవనెత్తిన కేసుల్లో అత్యధికంగా ముస్లిం బాధితులకు సంబంధించినవే ఉండటం గమనార్హం. ఈ దారుణ అకృత్యాలు జరుగుతున్న తీరుపైనా సంస్థ ఆందోళన వ్యక్తం చేసింది. 'ఒక్కొక్కరిని అపహరించి లేదా అరెస్టు చేసి తర్వాత హత్య చేస్తున్నారు. వారిని చిత్రహింసలు పెట్టి చంపేశారని సూచించేలా ఆ మృతదేహాలపై తీవ్ర గాయాలుంటున్నాయ'ని యూఎన్ నిపుణులు గుర్తించారు.

మణిపూర్‌లో ఎన్‌కౌంటర్ హత్యలు, వాటి దర్యాప్తును సుప్రీంకోర్టు గడువులో ముగించడంలో ప్రభుత్వం విఫలమవడంపై ఆరునెలల క్రితం ఓహెచ్‌సీహెచ్‌ఆర్ భారత ప్రభుత్వానికి లేఖ రాశారు. ఉద్దేశపూర్వకంగా దర్యాప్తులో జాప్యం చోటుచేసుకుంటున్నట్టు తెలుస్తున్నదని, దీన్ని ఖండిస్తున్నామని అందులో పేర్కొంది. అయితే ఆ లేఖకు ఇప్పటివరకూ సమాధానం లేదని తెలిపింది. ఎన్‌కౌంటర్ హత్యలకు.. ఆత్మరక్షణ కోసం కాల్పులు జరిపారని, ఎన్‌కౌంటర్‌లో మరణించారని సాధారణంగా పోలీసులు వివరణలు ఇస్తుంటారని, అయితే చాలా వరకు లాకప్ డెత్‌లే జరిగినట్టుగా లభించిన ఎవిడెన్స్‌లతో తేలుతున్నదని సంస్థ వివరించింది. హత్యకు ముందు కుటుంబ సభ్యుల నుంచి పోలీసులు డబ్బులు డిమాండ్ చేస్తున్నారని, కుటుంబీకులు, మానవ హక్కుల కార్యకర్తల ప్రాణరక్షణపైనా ఆందోళనను వ్యక్తం చేసింది. ఈ హత్యలపై వెంటనే సమగ్ర విచారణ జరపాలని సూచించింది.

మోడీ సర్కారుకు పట్టని 'సుప్రీం' మార్గదర్శకాలు :

ఎన్‌కౌంటర్ హత్యల దర్యాప్తును సుప్రీంకోర్టు మార్గదర్శకాలకు అనుగుణంగా భారత ప్రభుత్వం చేపట్టడం లేదని 2014లో పీపుల్స్ యూనియన్ ఆఫ్ సివిల్ లిబర్టీస్ వర్సెస్ మహారాష్ట్ర స్టేట్ కేసును ఉటంకిస్తూ ఓహెచ్‌సీహెచ్‌ఆర్ పేర్కొంది. ఈ హత్యల గురించి వెంటనే బాధిత కుటుంబీకులకు తెలుపాలని, పోస్టుమార్టం నివేదికను అందజేయాలని, స్వతంత్ర దర్యాప్తు సంస్థలకు కేసును బదిలీ చేయాలని సుప్రీంకోర్టు ఆదేశాలు జారీ చేసింది. అయితే ఈ మార్గదర్శకాలూ అమలు కావడం లేదని తాజాగా సంస్థ వివరించింది.

అసోంలో సెడిషన్ కేసు ముగ్గురికి బెయిలు

- పౌరసత్వ (సవరణ) బిల్లుపై వివాదాస్పద వ్యాఖ్యలు చేశారన్న అభియోగాలతో అరెస్టు

గువహతి: పౌరసత్వ (సవరణ) బిల్లుపై రెచ్చగొట్టేలా వ్యాఖ్యలు చేశారన్న అభియోగాలతో సెడిషన్ కేసులో అరెస్టయిన రైతు నేత అఖిల్ గొగోయ్, మేధావి, సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత హిరెన్ గొహెన్, జర్నలిస్టు మన్‌జిత్ మహంతాలకు శుక్రవారంనాడు బెయిలు లభించింది. హిరెన్ గొహెన్, అఖిల్ గొగోయ్‌లకు గౌహతి హైకోర్టు మధ్యంతర బెయిల్‌నివ్వగా, పాత్రికేయులు మన్‌జిత్ మహంతాకు సంపూర్ణ బెయిల్ లభించింది.

ఈ నెల 7న పౌరసత్వ సవరణ బిల్లు 2016కు వ్యతిరేకంగా గువహతిలో జరిగిన బహిరంగ ర్యాలీలో వీరు రెచ్చగొట్టేల ప్రసంగించారన్న అభియోగాలున్నాయి. దేశ సమగ్రతకు భంగంకలిగేలా స్వతంత్ర అసోంను సమర్థిస్తూ ఉపన్యాసాలు చేశారన్న ఆరోపణలతో రాష్ట్ర పోలీసులు వారిపై సుమోటోగా కేసు నమోదు చేశారు. కాగా, పౌరసత్వ (సవరణ) బిల్లుపై రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు కొనసాగుతున్నాయి.

పౌరసత్వ బిల్లును వ్యతిరేకిస్తున్నాం : మిజోరం బీజేపీ

మోడీ సర్కారు ప్రతిపాదించిన పౌరసత్వ బిల్లును మిజోరం బీజేపీ వ్యతిరేకిస్తున్నది. ఈ బిల్లుతో రాష్ట్ర ప్రజలకు తీవ్రనష్టం వాటిల్లుతుందని, వేలమంది విదేశీయులకు పౌరసత్వం లభించే ప్రమాదముందని తెలిపింది. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు జాన్ వి లూనా మాట్లాడుతూ.. ఈ బిల్లును మోడీ ప్రభుత్వమే ప్రవేశపెట్టినప్పటికీ.. పార్టీ రాష్ట్ర విభాగం ఈ బిల్లును వ్యతిరేకిస్తున్నదని తెలిపారు.

సుప్రీంకోర్టు న్యాయమూర్తులుగా... ఇద్దరి పేర్లను సిఫారసు చేసిన కొలీజియం

న్యూఢిల్లీ: కర్నాటక హైకోర్టు చీఫ్ జస్టిస్ దినేశ్ మహేశ్వరి, ఢిల్లీ హైకోర్టు జడ్జి సంజీవ్‌ఖన్నాలను సుప్రీంకోర్టు జడ్జిలుగా నియమించాల్సిందిగా కొలీజియం సిఫారసు చేసింది. చీఫ్ జస్టిస్ రంజన్‌గొగోయ్ నేతృత్వంలోని సుప్రీంకోర్టు కొలీజియం వీరిద్దరికీ పదోన్నతులు కల్పించాల్సిందిగా కేంద్ర న్యాయశాఖకు ప్రతిపాదించింది. వీరిలో జస్టిస్ దినేశ్ మహేశ్వరిపై సుప్రీంకోర్టు మాజీ జడ్జి జస్టిస్ చలమేశ్వర్ తీవ్ర ఆరోపణలు చేయడం గమనార్హం. కర్నాటకలోని ఓ జిల్లా జడ్జిపై లైంగిక వేధింపుల ఆరోపణలు రాగా, జస్టిస్ దినేశ్ మహేశ్వరి ఆయనపై దర్యాప్తునకు ఆదేశించడాన్ని జస్టిస్ చలమేశ్వర్ తప్పు పట్టారు.

ఆ జిల్లా జడ్జిని హైకోర్టు జడ్జిగా రెండుసార్లు సుప్రీంకోర్టు కొలీజియం సిఫారసు చేసిన నేపథ్యంలో జస్టిస్ చలమేశ్వర్ చొరవ తీసుకున్నారు. ఆ జిల్లా జడ్జిపై సుప్రీంకోర్టు ఆదేశాలమేరకు జరిగిన దర్యాప్తులో ఆరోపణల్లో నిజం లేదని తేలడం గమనార్హం. కార్యనిర్వాహక వ్యవస్థ ప్రభావంతో జడ్జిలు వ్యవహరించకూడదంటూ జస్టిస్ చలమేశ్వర్ ఆ సందర్భంగా సూచించారు. న్యాయవ్యవస్థ స్వతంత్రత కోసం గళం విప్పిన వారిలో జస్టిస్ చలమేశ్వర్ కీలక వ్యక్తి అన్నది తెలిసిందే.

కొలీజియం సిఫారసు చేసినవారిలో మరొకరైన జస్టిస్ సంజీవ్‌ఖన్నా జస్టిస్ హెచ్‌ఆర్ ఖన్నాకు సోదరుడు. ఇందిరాగాంధీ ప్రధానిగా ఉన్నపుడు కేంద్ర ప్రభుత్వ ఒత్తిడికి తలొగ్గని న్యాయమూర్తిగా హెచ్‌ఆర్ ఖన్నాకు పేరున్నది. దేశంలో అత్యవసర పరిస్థితి విధించినపుడు ఐదుగురు సభ్యుల రాజ్యాంగ ధర్మాసనంలో మెజారిటీ తీర్పును వ్యతిరేకిస్తూ పౌరహక్కులకు అనుకూలంగా ఒంటరిగా అసమ్మతి తీర్పును వెల్లడించిన ఘనత హెచ్‌ఆర్ ఖన్నాకున్నది. ఆ తర్వాత సీనియారిటీ ప్రకారం రావాల్సిన సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ పదవి హెచ్‌ఆర్ ఖన్నాకు రాకుండా ఇందిరాగాంధీ తన అధికారాన్ని ఉపయోగించారన్న విమర్శలున్నాయి.

నెరవేరని ఆశ


(ఫైల్)

గ్రామీణ వైద్య సేవల్లో కీలకం...అయినా వేతనం లేదు

- కేవలం ప్రోత్సాహకాలకే సర్కార్ పరిమితం
- వాటినీ నాలుగు నెలలుగా చెల్లించని వైనం
- ఎన్నికలు, జనగణన ప్రక్రియలోనూ వీరి భాగస్వామ్యం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు, గర్భిణీలను గుర్తించడం.. సర్కారు దవాఖానల్లో ప్రసూతీలుం.. ఆరేండ్లలోపు చిన్నారులకు టీకాలు, ప్రతిష్టాత్మక కంటివెలుగు, త్వరలో ప్రారంభం కానున్న చెవి, ముక్కు, గొంతు, దంత పరీక్షలు.. ఇలా ఒకటేమిటి ఆరోగ్యశాఖలో ప్రతి విభాగంలో ఏ పథకమైనా ఊరూరుకి తిరిగి పనిచేసేది వారే. ఎన్నికలు, రేషన్‌కార్డులు, ఇంటింటి సర్వేలు నిర్వహించడంలో వారి పాత్ర మరువలేనిది. గ్రామీణ ఉపాధి, పేదరిక నిర్మూలన, ఐసీడీఎస్‌లలో వారి సేవలు అమోఘం. ఒక్కమాటలో చెప్పాలంటే వారి పాత్రలేనిదే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పథకాలు అడుగు ముందుకు పడవు. అలాంటి పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లేది వాలంటరీ అండ్ కమ్యూనిటీ హెల్త్ వర్కర్స్. (ఆశాలు). ఇలాంటి కీలక విధులు నిర్వహిస్తున్న ఆశాలకు ప్రభుత్వం నుంచి ఎలాంటి గుర్తింపు లభించడంలేదంటే నమ్మాల్సిందే.

నెరవేరని సీఎం హామీ

రెండేండ్ల క్రితం ముఖ్యమంత్రి కేసీఆర్ ఆశా వర్కర్లకు నెలకు రూ.6 వేల వేతనం చెల్లిస్తామని ప్రకటించారు. నేటికీ అది అమలైన దాఖలాలు లేవు. పారితోషికాలతోనే సరిపెడుతున్నారు. గత ఎన్నికల సందర్భంగా పాలకులు 7,500 వేతనంగా ఇస్తామని హామీఇచ్చారు. వేతనం సంగతి దేవుడెరుగు. కనీసం పారితోషికాలు కూడా చెల్లించని దయనీయ పరిస్థితి నెలకొన్నది. గత సెప్టెంబర్ నుంచి ఇప్పటి వరకు నాలుగు నెలలపాటు ఒక్క రూపాయి కూడా ఆశాలకు ఇవ్వలేదని తెలంగాణ వాలంటరీ అండ్ కమ్యూనిటీ హెల్త్ వర్కర్స్ (ఆశా) యూనియన్ ఆందోళన వ్యక్తం చేసింది. దసరా, దీపావళి పండగలు జరుపుకోలేకపోయిన ఆశాలకు కనీసం సంక్రాంతి పండగ నేపథ్యంలోనైనా పెండింగ్ బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేస్తున్నది. ఇలా ఉండగా, గ్రామీణ వైద్య సేవల్లో కీలక పాత్ర పోషిస్తున్న 'ఆశావర్కర్లకు తీరని అన్యాయం జరుగుతున్నదని పలు జాతీయ సంస్థలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. నర్సింగ్ వంటి కోర్సుల్లో వారికి వెయిటేజీ ఇచ్చి ఆదుకోవాలని, తద్వారా వారి అనుభవాన్ని ఉపయోగించుకోవాలని 'ఇండిపెండెంట్ కమిషన్ ఆన్ డెవలప్‌మెంట్ అండ్ హెల్త్ ఇన్ ఇండియా' సిఫార్సు చేస్తూ 'రోడ్ మ్యాప్ టూ ఇండియాస్ హెల్త్' అనే నివేదికను కేంద్రానికి అందజేసిన సంగతి తెలిసిందే. కొన్ని ప్రభుత్వాలు ప్రోత్సాహకాలు కూడా సకాలంలో ఇవ్వకుండా ఆలస్యం చేస్తున్నాయని వెల్లడించింది.

పారితోషికాలతో చాకిరి

సాధారణంగా ప్రతి శాఖలో ప్రభుత్వం కార్మికులకు కనీస వేతనం ఇవ్వకున్నా... జీతం రూపంలో ఎంతో కొంత చెల్లిస్తున్నది. కానీ ఆశాలకు అలాంటి పరిస్థితి లేదు. రోజంతా పల్లెల్లో సేవలందిస్తున్నా పారితోషికంతో సరిపెడుతూ వారితో చాకిరీ చేయిస్తున్నదని విమర్శలు వినిపిస్తున్నాయి. గర్భిణీలను గుర్తిస్తే రూ.400, సర్కారు దవాఖానల్లో ప్రసవాలు చేయిస్తే రూ.500, ఫ్యామిలీ ప్లానింగ్‌కు రూ.600 ఇలా పారితోషికాలు చెల్లిస్తున్నది. ఒక వేళ సదరు రోగి ఏదైన ప్రయివేటు దవాఖానలో ప్రసవిస్తే ఆ వచ్చే నగదు కూడా రాదు. ఈ లెక్కన వారికి పని, ప్రాంతం బట్టి నెలకు రూ.3,000 నుంచి రూ.5,000 వరకు సర్కారు చెల్లిస్తున్నది. చుక్కలనంటుతున్న ధరలతో ఈ మొత్తం ఏ పాటికని ఆశాలు ప్రశ్నిస్తున్నారు. మరోవైపు, 'ఆశా వర్కర్లు ఎన్‌హెచ్‌ఎం పరిధిలోకి వస్తారని నిర్ణయం తీసుకునే అధికారం తమకు లేదని సర్కారు గతంలో అనేక సందర్భాల్లో ప్రకటించింది. ఆశాలు 104, 108, ఆరోగ్యశ్రీ పథకాలకు సహకరిస్తున్నారు. గర్భిణీలకు ఐరన్ మాత్రలు.. ఆహారపు సలహాలు ఇచ్చి సర్కారు దవాఖానల్లో కాన్పులు చేయిస్తున్నారు. హెచ్ఐవీ రోగులకు అవసరమైన సేవలు చేస్తున్నారు. కుష్టు, టీబీ రోగులకు మందులు పంపిణీ చేస్తున్నారు. ఇంటింటికీ తిరిగి ప్రజలకు వచ్చే వ్యాధులను గుర్తిస్తున్నారు. అవసరమైతే ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల (పీహెచ్‌సీ)కు తీసుకెళ్తున్నారు. అక్కడ వైద్యం లభించకుంటే పై దవాఖానలకు రిఫర్ చేస్తున్నారు. ఇవన్నీ రాష్ట్రానికి సంబంధించినవే కావడం గమనార్హం.

106 రోజుల సమ్మె..

రాష్ట్రంలో 106 రోజుల సమ్మె సందర్భంగా ఆశాలకిచ్చిన హామీలను రాష్ట్ర ప్రభుత్వం కేంద్రం దృష్టికి తీసుకెళ్లింది. స్పందించిన కేంద్రం ఆశాల సౌకర్యాల విషయంలో రాష్ట్ర ప్రభుత్వాలే బాధ్యత వహించాలంటూ 2016 జనవరిలో సర్క్యూలర్ నెం. జెడ్-15015/56/2016-ఎన్‌ఆర్‌హెచ్‌ఎం-1 జారీ చేసింది. దీంతో రాష్ట్ర ప్రభుత్వం కూడా వేతనం చెల్లిస్తామని ప్రకటించింది. అమలులో అతీగతీలేదు. ఇలా ఉండగా, పశ్చిమబెంగాల్, రాజస్థాన్, కర్ణాటక, కేరళ, హర్యానా ప్రభుత్వాలు కేంద్రం చెల్లించే పారితోషికాలకు అదనంగా రూ.2000 నుంచి రూ.3000 వేతనం చెల్లిస్తున్నాయి. ధనిక రాష్ట్రంలో ఎందుకు చెల్లించడంలేదని ఆశాలు ప్రశ్నిస్తున్నారు. పారితోషికం, ఇతరత్రా ఖర్చుల కోసం ఎన్‌హెచ్‌ఎం రూ.30 కోట్లు కేటాయిస్తుండగా, అందులో 25 శాతం రాష్ట్రం వాటా, 75 శాతం కేంద్రం తన వాటాగా భరిస్తున్నది. 2006లో జాతీయ ఆరోగ్య మిషన్ (ఎన్‌హెచ్‌ఎం) మార్గదర్శకాల ప్రకారం రాష్ట్రంలో నియమితులైన 26 వేల మంది ఆశ వర్కర్లు తమను కార్మికులుగా గుర్తించాలని, కనీస వేతనం ఇవ్వాలని, అర్హులకు ఏఎన్ఎం నియామకాల్లో ప్రాధాన్యత కల్పించాలని డిమాండ్ చేస్తూ 106 రోజులపాటు సమ్మె చేసిన సంగతి తెలిసిందే.

పెండింగ్ పారితోషికాలు చెల్లించాలి : జయలక్ష్మి



నాలుగు నెలల పారితోషికాలు వెంటనే చెల్లించాలని ఆశా యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు పి.జయలక్ష్మి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పండగల సందర్భంగా పారితోషికాలు రాకపోవడం, అవి కూడా నెలల తరబడి పెండింగ్‌లో ఉండటంతో ఆశా వర్కర్లు ఆర్థిక ఇబ్బందులకు గురవుతున్నారని అన్నారు. వెంటనే బడ్జెట్ విడుదల చేసి పెరిగిన పారితోషికాలతో కలిపి పెండింగ్ పారితోషికాలను చెల్లించాలన్నారు. ఇతర రాష్ట్రాల్లో మాదిరి వారికి వేతనం చెల్లించాలని తెలిపారు. పారితోషికం విధానాన్ని రద్దు చేయాలని సూచించారు. టీబీ, కుష్టు, కంటి వెలుగు వంటి పథకాలకు వారితో ఉచితంగా సేవలు చేయించుకుంటున్నదని..చేసిన ప్రతి పనికి పారితోషికాలు చెల్లించాలని అన్నారు.

తెలంగాణలో ధాన్య సేకరణ విధానం భేష్

కేంద్ర ఆహార ప్రజాపంపిణీ కార్యదర్శి రవికాంత్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో ధాన్య సేకరణ విధానం చాలా బాగుందని కేంద్ర ఆహార ప్రజా పంపిణీ కార్యదర్శి రవికాంత్ అన్నారు. రైతులకు కనీస మద్దతుధర లభించేలా వారికి అందుబాటులో ప్రతి ఐదు కిలో మీటర్లకు ఒక కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేయడం ప్రశంసనీయమన్నారు. తెలంగాణలో ప్రజాపంపిణీ, ధాన్య సేకరణ విధానాన్ని పరిశీలించేందుకు రాష్ట్ర పర్యటనకు వచ్చిన రవికాంత్ శనివారం పౌరసరఫరాల భవన్‌లో భారత ఆహార సంస్థ (ఎఫ్‌సీఐ) పౌరసరఫరాల శాఖ అధికారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఖమ్మం, కొత్తగూడెం, సిద్ధిపేట, మంచిర్యాల, భూపాలపల్లి జిల్లాల్లోని ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం విక్రయిస్తున్న రైతులతో వీడియోకాల్ ద్వారా మాట్లాడారు. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం విక్రయాలు, రేషన్‌షాపుల్లో లబ్ధిదారులు ఐరిస్ ద్వారా సరుకులు తీసుకుంటున్న తీరును ప్రత్యేక్షంగా పరిశీలించి లబ్ధిదారులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన రైతులతో మాట్లాడుతూ గత ఏడాది కంటే ధాన్యం దిగుబడి ఎందుకు ఎక్కువగా వచ్చింది, కనీస మద్ధతుధర లభిస్తుందా? కొనుగోలు కేంద్రాలు అందుబాటులో ఉన్నాయా, ధాన్యం విక్రయించిన తర్వాత ఎన్ని రోజులకు డబ్బులు మీ ఖాతాల్లోకి వస్తున్నాయి, ధాన్యం విక్రయల్లో ఏమైన సమస్యలు ఎదురవుతున్నాయా వంటి అంశాల గురించి రైతులను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న విధానాల వల్ల రైతులకు కనీస మద్దతు ధర లభించడంతో పాటు, మధ్యవర్తుల ప్రమేయం లేకుండా ధాన్యం డబ్బులు సకాలంలో రైతుల ఖాతాలో జమ కావడం, ఐరిస్, బయోమెట్రిక్, రేషన్ పోర్టబిలిటీ వంటివి ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా ఉన్నాయని ఈ సందర్భంగా రవికాంత్ వాఖ్యానించారు. గత ఏడాది ఖరీఫ్ కంటే ఈ ఏడాది ఖరీఫ్‌లో తెలంగాణ పౌరసరఫరాలశాఖ 208 శాతం అధికంగా ధాన్యాన్ని కొనుగోలుకు గల కారణాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం కొత్తగా చేపట్టిన ప్రాజెక్టులు, సకాలంలో వర్షాలు, 24 గంటలు కరెంట్, రైతు బంధు వంటి పథకాలురాష్ట్రంలో ధాన్యం దిగుబడికి ప్రధాన కారణాలని, గత ఏడాది 16 లక్షల మెట్రిక్ టన్నులు కొనుగోలు చేయగా ఈ ఏడాది ఈ ఇప్పటి వరకు 38 లక్షల మెంట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేయడం జరిగిందని ఈ సందర్భంగా కమిషనర్ అకున్‌సబర్వాల్ వివరించారు. కేంద్ర ప్రభుత్వం నుంచి రాష్ట్రానికి రావాల్సిన వివిధ రకాల బకాయిలు, అలాగే మార్కెట్ రుసుం, ఆర్‌డిసెస్ కమిషన్ ఇతర అంశాలకు సంబంధించి ఎఫ్‌సిఐ నుంచి రావాల్సిన బకాయిలను తర్వతగతిన విడుదలయ్యేలా చూడాలి కోరారు. పోర్టబిలిటీ విధానాన్ని కూడా లబ్ధిదారులు భారీ ఎత్తున ఉపయోగించుకుంటున్నారని, గడిచిన పది నెలల్లో ఒక కోటి 13 లక్షల, 74 వేల 658 పోర్టబిలిటీ లావాదేవీలు జరిగాయని కమిషనర్ రవికాంత్ దృష్టికి తీసుకెళ్లారు.



వసతి గృహాల బకాయిలను విడుదల చేయండి

- సీఎంకు ఆర్ కృష్ణయ్య లేఖ

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

రాష్ట్రంలోని బీసీ వసతి గృహాల నిర్వహణ బకాయిలను వెంటనే విడుదల చేయాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు ఆర్ కృష్ణయ్య డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం ఆయన ముఖ్యమంత్రి కె చంద్రశేఖర్‌రావుకు లేఖ రాశారు. "బీసీ హాస్టళ్ళకు చెల్లించాల్సిన బకాయిలను గత ఏడు నెలలుగా ఆర్థిక శాఖ ఫ్రీజింగ్‌లో పెట్టడం వల్ల బిల్లులు పాస్ కావడం లేదు. దీంతో రాష్ట్రంలోని 700 హాస్టళ్ల విద్యుత్తు బిల్లులు, మెస్ బిల్లులు, విద్యార్థుల కాస్మోటిక్ చార్జీలు, ఇతర పెండింగ్‌లో ఉన్నాయి. వసతి గృహాలకు చెల్లించాల్సిన బిల్లులను ప్రతి నెల సక్రమంగా చెల్లించేందుకు 2009లో గ్రీన్ చానల్‌లో పెట్టినా అమలుకు నోచుకోవడం లేదు. ప్రధానంగా విద్యుత్తు బిల్లులు చెల్లించకపోవడం వల్ల హాస్టళ్లకు విద్యుత్తు సరఫరా నిలిపివేస్తున్నారు.

పరీక్షల సమయంలో విద్యుత్ లేకపోవడం వల్ల విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గత ఆరు నెలలుగా విద్యార్థులకు కాస్మోటిక్ చార్జీలు కూడా చెల్లించడం లేదు. 10 నెలలుగా ట్యూటర్లకు చెల్లించాల్సిన బిల్లులు కూడా విడుదల చేయలేదు. విద్యార్థుల సంఖ్య లేదన్న సాకుతో రాష్ట్ర వ్యాప్తంగా దాదాపు 69 పాఠశాల బీసీ హాస్టళ్లను సాకుతో మూసివేశారు. ఈ సమస్యలన్నింటినీ పరిష్కరించాలని" లేఖలో పేర్కొన్నారు.

తక్కళ్లపల్లిలో ప్రపంచ బ్యాంకు బృందం

నవతెలంగాణ-పాలకుర్తి



ప్రపంచ బ్యాంకుకు చెందిన ఇద్దరు సభ్యులు పెద్దపల్లి జిల్లా పాలకుర్తి మండలం ఈసాల తక్కళ్లపల్లిలో శనివారం పర్యటించారు. గ్రామంలో పారిశుధ్యం నిర్వహణపై సమీక్షించారు. గ్రామస్తులు వారికి బతుకమ్మలతో స్వాగతం పలికారు. సభ్యులు ఇంటింటికీ తిరుగుతూ వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణంపై ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను సందర్శించారు. వీరి రాక సందర్భంగా అధికారులు పెద్దఎత్తున గ్రామంలో పారిశుధ్య పనులను చేపట్టారు. వారం రోజుల నుంచి యుద్ధ ప్రాతిపదికన మురుగు కాలువల పూడికతీత, ముళ్ల పొదల తొలగింపుతో పాటు ప్రభుత్వ కార్యాలయాలను ముస్తాబు చేశారు. రోడ్డుకు ఇరువైపులా రాకపోకలకు అనువుగా ఉండేందుకు చెట్లనూ తొలగించారు. వారి వెంట ఏపీవో రమేష్, స్పెషల్ ఆఫీసర్ జయప్రకాష్‌రెడ్డి, జేఈ రాజేశం, ఇతర అధికారులు సమ్మయ్య, నర్సమ్మ ఉన్నారు.

అబద్ధాల్లో మోడీ గిన్నిస్ రికార్డు

సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

అబద్ధాలు చెప్పడంలో ప్రధాన మంత్రి నరేంద్రమోడీ గిన్నిస్ రికార్డుల్లోకి ఎక్కగలరని సీపీఐ జాతీయ కార్యదర్శి కె నారాయణ ఎద్దేవా చేశారు. ఈ మేరకు ఆయన శనివారం ఓ ప్రకటన విడుదల చేశారు. రాఫెల్ ఒప్పందంలో మధ్య దళాల్లేరని బీజేపీ గొప్పలు చెప్తోందని తెలిపారు. ప్రధాన మంత్రి మోడీ స్వయంగా మధ్య దళారీగా వ్యవహరించినపుడు మధ్యవర్తులతో పనేముందని ఎద్దేవా చేశారు. పది శాతం అగ్రవర్ణ పేదలకు పది శాతం రిజర్వేషన్ ఇచ్చామని గొప్పలకు పోతోందని పేర్కొన్నారు. 33 శాతం మహిళా రిజర్వేషన్ బిల్లు ఎందుకు పెండింగ్‌లో పెట్టారని ప్రశ్నించారు. మహిళా రిజర్వేషన్ బిల్లు ఆమోదింపచేయడంలో, శబరిమలలో స్త్రీలకు సమాన హక్కుల కల్పనకు బీజేపీ వ్యతిరేకిగా మారిపోయిందని తెలిపారు. పౌరసత్వ గుర్తింపు అంశంలో స్వయాన ప్రభుత్వమే మత విభజనకు పురికొల్పిందని పేర్కొన్నారు. అమిత్‌షా ఉపన్యాసం వింటే ఎన్నికలకు ముందే అయోధ్యలో రామాలయం కట్టి తీరుతామని ప్రకటించారని తెలిపారు.

ప్రాంతీయ భాషల్లో ఎడ్‌టెక్ యాప్ మ్యాడ్‌గై ల్యాబ్స్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ప్రభుత్వ ఉద్యోగాలకు సన్నద్ధమయ్యేందుకు ప్రాంతీయ భాషల్లో ఎడ్‌టెక్ యాప్ మ్యాడ్‌గై ల్యాబ్స్ తోడ్పడనుంది. ఈ మేరకు మ్యాడ్‌గై ల్యాబ్స్ వ్యవస్థాపకులు, సీఈవో అలోక్ కతియార్ శనివారం ఓ ప్రకటన విడుదల చేశారు. తెలంగాణ పంచాయతీ కార్యదర్శి, టీఎస్‌పీఎస్సీ బిల్ కలెక్టర్, వీఆర్వో పోస్టులతోపాటు ఏపీ పంచాయతీ కార్యదర్శి వంటి ఎన్నో ప్రభుత్వ ఉద్యోగాలకు సన్నద్ధమయ్యే వారికి ఈ యాప్ తోడ్పడుతుందని తెలిపారు. ఇంగ్లీషు, హిందీ, మరాఠీ, తెలుగు, కన్నడలతో సహా ఆరు భాషల్లో సేవలను అందిస్తోందని పేర్కొన్నారు. మాక్‌టెస్టులు, ఈ లెర్నింగ్ కోర్సులను ఈ యాప్ అందిస్తుందని తెలిపారు. మ్యాడ్‌గై యాప్‌తో అనేక ప్రభుత్వ ఉద్యోగాలకు విద్యార్థులు ఏకకాలంలో సన్నద్ధం కావచ్చని సూచించారు.

ఆ ముగ్గురు ఎమ్మెల్సీలపై వేటు..?

- టీఆర్ఎస్ ఫిర్యాదుపై ముగిసిన వాదనలు
- నిర్ణయాన్ని రిజర్వ్ చేసిన మండలి చైర్మెన్ స్వామిగౌడ్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

టీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరిన ముగ్గురు ఎమ్మెల్సీలపై వేటుకు రంగం సిద్ధమవుతున్నది. అధికార పార్టీ నేతలు ఇచ్చిన ఫిర్యాదుతో చేపట్టిన విచారణ ముగిసింది. ఇరు పక్షాల వాదనలు విన్న శాసన మండలి చైర్మెన్ స్వామిగౌడ్ తన నిర్ణయాన్ని రిజర్వ్ చేశారు. అసెంబ్లీ ఎన్నికలకు ముందు ఎమ్మెల్సీలు రాములు నాయక్, భూపతిరెడ్డి, యాదవరెడ్డిలు టీఆర్ఎస్‌ను వీడి కాంగ్రెస్ పార్టీలో చేరిన సంగతి విదితమే. పార్టీ ఫిరాయింపుల చట్టం ప్రకారం వారిపై అనర్హత వేటు వేయాలంటూ టీఆర్ఎస్ నేతలు శాసన మండలి చైర్మన్‌కు ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో విచారణ చేపట్టిన మండలి చైర్మెన్ ముగ్గురు ఎమ్మెల్సీలకు నోటీసులు జారీ చేశారు. శుక్రవారం రాములు నాయక్ తరపున అడ్వకేట్ హాజరై వాదనలు వినిపించగా, శనివారం భూపతిరెడ్డి, యాదవరెడ్డి తరపు అడ్వకేట్‌లు హాజరై వాదనలు వినిపించారు. ఇరువర్గాల వాదనలు విన్న చైర్మెన్ తన నిర్ణయాన్ని రిజర్వ్ చేశారు.

కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు..: మండలి విప్ పల్లా రాజేశ్వరరెడ్డి



మాట్లాడుతున్న పల్లా రాజేశ్వరరెడ్డి

టీఆర్ఎస్ గుర్తుపై గెలిచి.. కాంగ్రెస్ కండువాలు కప్పుకున్న ఎమ్మెల్సీలు ఆయా పదవులకు అనర్హులని శాసనమండలి విప్ పల్లా రాజేశ్వరరెడ్డి అన్నారు. శనివారం శాసనమండలి ప్రాంగణంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ఎన్నికలకు ముందు కాంగ్రెస్‌లో చేరిన నలుగురు ఎమ్మెల్సీలపై అనర్హత వేటు వేయాలంటూ కౌన్సిల్ చైర్మెన్‌కు ఇప్పటికే ఫిర్యాదు చేశామని తెలిపారు. ఈ అంశంపై నెలరోజుల నుంచి విచారణ కొనసాగుతున్నదని చెప్పారు. సభ్యులు సమయం అడిగితే చైర్మెన్ అందుకు అంగీకరించారని తెలిపారు. శుక్రవారం వారు వ్యక్తిగతంగా విచారణకు హాజరయ్యారని చెప్పారు. రాములు నాయక్ అడ్వకేట్ కూడా శుక్రవారం వచ్చి.. వాదనలను వినిపించారని తెలిపారు. అందుకే చైర్మెన్ తన నిర్ణయాన్ని రిజర్వ్ చేశారని చెప్పారు. మిగతా వారికి సంబంధించి శనివారం కూడా విచారణ నిర్వహించారని తెలిపారు. తమ పార్టీ తరపున అడ్వకేట్ కూడా వాదనలు వినిపించారని వివరించారు. ముగ్గురు ఎమ్మెల్సీలకు సంబంధించిన సాక్ష్యాలు కూడా చైర్మెన్‌కు అందజేశామని తెలిపారు.

18 నుంచి అంతర్జాతీయ యువజన సదస్సు

ముఖ్య అతిథిగా అన్నా హజారే

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

తెలంగాణ జాగృతి ఆధ్వర్యాన ఈనెల 18 నుంచి 20 వరకు అంతర్జాతీయ యువజన నాయకత్వ సదస్సును నిర్వహించనున్నారు. హైదరాబాద్ నోవాటెల్ హోటల్‌లో ఈ సదస్సు జరగనుంది. 19న నిర్వహించబోయే ప్రారంభ సమావేశానికి అన్నా హజారే ముఖ్య అతిథిగా హాజరవుతారు. నిజామాబాద్ ఎంపీ, తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత కీలకోపన్యాసం చేస్తారు. ఈనెల 20న సాయంత్రం జరిగే ముగింపు సమావేశానికి గవర్నర్ ఈఎస్ఎల్ నరసింహన్ ముఖ్య అతిథిగా హాజరవుతారు. కవిత శనివారం రాజ్‌భవన్‌కు వెళ్లి.. గవర్నర్‌ను ఆహ్వానించారు. మొదటి రోజు యువత- అభివృద్ధి అనే అంశంపై ప్రముఖ జర్నలిస్ట్ శేఖర్ గుప్తా చర్చా గోష్టిని నిర్వహిస్తారు. ఇదే సమయంలో వేర్వేరు అంశాలపై చర్చా గోష్టులను నిర్వహించనున్నారు. ప్రపంచ ప్రగతిలో యువత పాత్రపైనా యువ నాయకులు మాట్లాడతారు. రెండో రోజు నైపుణ్య శిక్షణ, సమతులాభివృద్ధిలో యువత, మహిళల పాత్ర, కార్పొరేటు, ప్రభుత్వాల భాగస్వామ్యంపై చర్చిస్తారు. ఆయా రంగాల్లో అంతర్జాతీయ నిపుణులుగా ఉన్న వారు వీటిలో పాల్గొంటారు. గాంధేయ మార్గంలో సుస్థిర అభివృద్ధి, నూతన ఆవిష్కరణలు అంశంపై సదస్సులో చర్చిస్తామని కవిత ఈ సందర్భంగా తెలిపారు.103 దేశాల నుంచి 550 మంది ప్రతినిధులు సదస్సుకు హాజరవుతున్నారని తెలిపారు. 16 దేశాల నుంచి 70 మంది వక్తలు, 40 మంది ప్రత్యేక ఆహ్వానితులు హాజరవుతారని ఆమె చెప్పారు.

ఐక్యరాజ్య సమితి నిర్దేశించిన 17 లక్ష్యాలు..

1. పేదరిక నిర్మూలన, 2. ఆహార సమృద్ధి, 3) ఆరోగ్యం, 4) నాణ్యమైన విద్య, 5) లింగ సమానత్వం, 6. మంచి నీరు-పరిశుభ్రత, 7. పర్యావరణ అనుకూల విద్యుత్, 8. గౌరవప్రదమైన పని, ఆర్థికాభివృద్ధి, 9. పరిశ్రమలు, మౌలిక వసతులు, నూతన ఆవిష్కరణలు, 10. అన్ని రంగాల్లో సమానత్వం, 11.పర్యావరణ అనుకూల నగరాలు, గ్రామాలు, 12. బాధ్యతాయుతమైన వనరుల వినియోగం, 13.వాతావరణంలో మార్పులు-మానవాళి బాధ్యత, 14. సముద్ర జీవుల సంరక్షణ, 15. భూచరాల జీవనానికి అనుకూల వాతావరణానికి కృషి, 16. శాంతి, న్యాయం దిశగా పటిష్ట వ్యవస్థల ఏర్పాటు, 17. ఈ లక్ష్యాల కోసం వ్యవస్థలు, దేశాల పరస్పర సహకారం

నిరుద్యోగ యువతకు ఉచిత వసతి, శిక్షణ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలోని నిరుద్యోగ యువతీ, యువకులకు ఉచిత భోజన వసతితోపాటు శిక్షణ అనంతరం ఉపాధి కల్పిస్తామని స్వామి రామానంద తీర్థ గ్రామీణ సంస్థ ప్రకటించింది. ఈ మేరకు సంస్థ డైరెక్టర్ ఎన్ కిషోర్‌రెడ్డి శనివారం ఓ ప్రకటన విడుదల చేశారు. మేధా ఛారిటబుల్ ట్రస్ట్ సహకారంతో స్వామి రామానంద తీర్థ గ్రామీణ సంస్థ ఉపాధి ఆధారిత సాంకేతిక శిక్షణా కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని తెలిపారు. ఆసక్తి ఉన్న అభ్యర్థుల నుంచి ఆహ్వానిస్తున్నామని పేర్కొన్నారు. ఎలక్ట్రిషియన్, సోలార్ ఎలక్ట్రిక్ సిస్టమ్ ఇన్‌స్టాలర్, సర్వీస్ ప్రొవైడర్ (ఆర్నెళ్ల కోర్సు), సెల్ఫ్ ఎంప్లాయిడ్ టైలర్, జర్దోజి, ఎంబ్రాయిడరీ వర్క్ (ఆర్నెళ్ల కోర్సు)లకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. 18 నుంచి 35 ఏండ్ల మధ్య ఉండాలనీ, చదువు మధ్యలో ఉన్న వారు అర్హులు కాదనీ, శిక్షణ అనంతరం ఉద్యోగం చేసేందుకు సిద్ధంగా ఉండాలని తెలిపారు. ఈనెల 21న ఉదయం 10 గంటలకు తమ సంస్థలో హాజరుకావాలని కోరారు. ఇతర వివరాలకు 9133908000, 9133908222, 9948466111 నెంబర్లను సంప్రదించాలని సూచించారు.

సంపాదకీయం

ఆరోహణకైనా, అవరోహణకైనా వివేకం అవసరం - సినారె

ప్రయాణం

ధనురాశి నుంచి మకరరాశిలోకి సూర్యుడి ప్రయాణంతో హేమంతం వికసిస్తుంది. ఈ ప్రక్రియలో మేనుపై నులివెచ్చని కిరణాలు పడి ఒంటికి నూతన సత్తువ వస్తుంది. ఆ సూర్యరశ్మితో శరీరమూ పులకరిస్తుంది. ప్రకృతిలో కలిగే ఈ మార్పుల వలే జీవిత గమనంలో కూడా చీకటి నుంచి వెలుగులోకి, ఓటమి నుంచి గెలుపులోకి, బాల్యం నుంచి యవ్వనంలోకి ప్రయాణం అనివార్యమవుతుంది. అందుకే 'ఉప్పెనలో తలవొగ్గక నిలువుగ ఉబికొచ్చేదే జీవితం.. ఓటమిలో నిట్టూర్చక రివ్వున ఉరికొచ్చేదే జీవితం' అంటారు సినారే.

'ప్రయాణం అంటేనే అదో వింత సరదా. మనసులోన పొంగిపొరలే జ్ఞాపకాల వరద' అని ఓ కవి నిర్వచిస్తాడు. ఈ ప్రయాణంలో ఏవేవో జ్ఞాపకాలు మనసును అలా తాకి గాలి స్పర్శకి అలా జారిపోతుంటాయి.

విద్యార్థులైనా, ఉద్యోగులైనా, వ్యాపారులైనా ఎవ్వరైనా తను నివసించే ప్రాంతం నుంచి చేరవల్సిన చోటుకి రోజూ ప్రయాణించాల్సిందే. ఉరుకులు పరుగులే వారి నిత్యకృత్యంగా మారిపోతున్నాయి. రైళ్లల్లో, బస్సుల్లో, ఇతర వాహనాల్లో అత్యధిక సమయం గడిపేస్తున్న పరిస్థితి. ఈ వేగంలో ఎన్నో వ్యయప్రయాసలకోర్చి చివరకు గమ్యం చేరుకుంటారు. అందుకే ప్రయాణం ఒక్కోసారి శ్రమతో కూడుకున్నదే. శ్రమలేకుండా అది సాధ్యపడదు. అయితే అందులో అవసరమైన ప్రయాణాలెన్ని? అక్కరకు రానివెన్ని? అని ఎవరికి వారు ప్రశ్నించుకోవాలి. నేడు ప్రతి మనిషికి ప్రయాణం ఓ అనివార్యమైన అవసరం. ఎందుకంటే ప్రతి ప్రయాణానికీ ఓ ప్రయోజనం ఉంటుంది. అనవసరపు ప్రయాణాలు మన ఆలోచనాశక్తిని తగ్గిస్తాయి. తరచూ అలా ప్రయాణించడం వల్ల మనోశరీరాలూ త్వరగా అలసిపోతాయి. యాదృశ్చికంగానే అతిగా నిద్రించేందుకు ప్రేరేపిస్తాయి. దీంతో ఆ వ్యక్తిలో సృజనాత్మకత, విశ్లేషణాత్మకత, ఆలోచనాశక్తి, నైపుణ్యత సన్నగిల్లుతుంది. మరోవైపు సామాన్యులకు ప్రయాణాలు అదనపు భారం. అందుకే వీలైనంత తక్కువగా ప్రయాణాలుండాలి. మనసుతో చెలిమి చేస్తే ప్రయాణాలను కొంతమేర తగ్గించుకోగలం. అలా ఆదా చేసిన సమయాన్నీ ఇతర కార్యాచరణకు వినియోగించుకోగలం. అవకాశమే ఉంటే పనిచేసే ప్రాంతానికైనా, విద్యాలయానికైనా సమీపంలో నివసిస్తూ ఈ ప్రయాణ ప్రహసనానికి దూరంగా ఉండటం శ్రేయస్కరం. కానీ ఆధునిక మనిషికి ప్రతి నిమిషం పరుగెడితేనే ప్రాణం నిలుస్తుంది. ఆ పరుగుకూ, ప్రయాణానికీ ఓ ప్రయోజనం ఉంటుంది. ఉండాలి కూడా. ఇది గ్రహించగల్గితే ప్రతి ప్రయాణం లక్ష్యాలను సాధించడమే కాదు.. బతుకునూ పండిస్తుంది.



ఎవరైనా తన ప్రయాణ సమయంలో సౌహార్ధం ఉండాలనుకుంటారు. గంటలకొద్దీ ప్రయాణంలో కాస్తయినా కాలక్షేపం కోరుకుంటారు. లేదా తనతో మనసు విప్పి మాట్లాడేవారు ఉంటే బాగుండనుకుని ఉబలాటపడుతుంటారు. అందుకే ప్రయాణ సమయంలో ఎదురయ్యే వ్యక్తులు చిరకాలం మంచి మిత్రులుగా ఉండిపోతుంటారు. తనతో ప్రయాణించేది కొన్నిగంటలే అయినా జీవితాంతం అది గుర్తుండిపోతుంది. 'ప్రయాణం అంటేనే అదో వింత సరదా. మనసులోన పొంగిపొరలే జ్ఞాపకాల వరద' అని ఓ కవి నిర్వచిస్తాడు. ఈ ప్రయాణంలో ఏవేవో జ్ఞాపకాలు మనసును అలా తాకి గాలి స్పర్శకి అలా జారిపోతుంటాయి.

ఎదుటివారి స్నేహపూర్వక సంభాషణలు, రకరకాల మనస్తత్వాలూ, మంచీచెడూ ఎన్నో పరస్పర విరుద్ధ లక్షణాలు అనుభవంలోకి వస్తుంటాయి. దేశ, రాష్ట్ర రాజకీయ పరిస్థితులు, ప్రభుత్వాలపై ప్రజల అభిప్రాయాలు వగైరా అమూల్య ప్రశ్నలకు ప్రయాణం సమాధానమివ్వగలదు. ఇలా ప్రయాణికుల మధ్య జరిగే చర్చోపచర్చలు ఇద్దరి మధ్య అనూహ్య పరిచయానికి బాటలు వేస్తుంది. తీరా గమ్యం చేరాక చెరోదారిన వెళ్లిపోయినా ఆ స్నేహబంధం సామాజిక మాధ్యమాల్లోనో, ఫోన్ల ద్వారానో కొనసాగుతూ ఉంటుంది. ఆ జర్నీలో మిగిలే జ్ఞాపకాల దొంతరలు సదా వారిని పలకరిస్తూనే ఉంటాయి. స్నేహాన్నీ, గతానుభవాన్నీ తట్టిలేపుతుంటాయి. ఒకవిధంగా మనతో కదిలే దృశ్యం మనకు తెలీకుండానే ప్రయాణాన్ని అలంకరిస్తుంది. పల్లెలు, పట్టణాలు, స్టేషన్లు గుర్తుండకపోయినా ప్రయాణం ఇచ్చిన అనుభూతి మాత్రమే నిలిచిపోతుంది. అందుకే ప్రయాణానికి అనుభూతే ప్రాణం. అయితే ప్రయాణ లక్ష్యం గమ్యం ఒక్కటే కాదు ఓ ఆశయం కూడా అయ్యుండాలి.

కొన్ని ప్రయాణాలు జీవితంలో మరువలేని మధురానుభూతులను పంచుతాయి. మరికొన్ని దు:ఖాన్నీ, ఇంకొన్ని విషాదాన్నీ మిగులుస్తాయి. అందుకే జీవిత ప్రయాణం సుదూరం. సులువైంది కాదు. ఎప్పటికప్పుడు కొత్త సమస్యలు వస్తూ ఉంటాయి. పోతుంటాయి. కానీ ఒంటరి ప్రయాణంలోనే మనల్ని మనం బాగా అర్థం చేసుకోగలం. ఆ ప్రయాణంలో రేకెత్తే ఆలోచనలు, గత జ్ఞాపకాలు భవిష్యత్‌కు దిక్సూచిగా మారుతాయి. మనకు తోడెవ్వరూ లేరనీ, ఇక ఈ ప్రయాణంలో ఎంత అలుపొననీ మదనపడకుండా లక్ష్యంవైపే ఆలోచించాలి. సైనికుడు తన యుద్ధ ప్రయాణంలో ఎటువైపు నుంచి ప్రమాదం పొంచి ఉంటుందోనని తుపాకీతో సిద్ధంగా ఉంటాడు. ఎప్పటికప్పుడు తన దృష్టిని శత్రు సంహారంపైనే సారిస్తుంటాడు. గగనతలంలో ఉన్న పైలెట్ వాతావరణ పరిస్థితులు మారుతున్నా మేఘాలను చీల్చుకుంటూ విమానాన్ని ముందుకు నడుపుతుంటాడు. వందల మంది ప్రాణాలను సురక్షితంగా గమ్యాలకు చేరవేస్తాడు. అలాగే నిజజీవితంలో ఎప్పటికప్పుడు కొత్త సమస్యలు, సంఘర్షణలు ఎదురవుతూనే ఉంటాయి. ఎప్పటికప్పుడు ఎత్తుపల్లాలను సరిచేసుకుంటూ జీవన ప్రయాణ పద్ధతి మార్చుకుని.. నూతన సంవత్సరాన ఉత్సాహభరితంగా.. ఎంతో ఉల్లాసంగా ప్రయాణిద్దాం. అలా ముందుకు కదులుదాం..!

రైతు కేంద్ర రాజకీయం!



కోప్ర

నాటి ప్రధాని లాల్ బహుదూర్ శాస్త్రి 1965లో ఇచ్చిన 'జై జవాన్ – జై కిసాన్' నినాదం తరువాత మళ్లీ ఇప్పుడే అంత బలంగా రైతు నామస్మరణ వినిపిస్తోంది. రైతన్నలు దేశ జనాభాలో అత్యధికంగా 52 శాతం ఉన్నప్పటికీ సంఘటితశక్తిగా మారక పోవడంతో వారిని పట్టించుకోవాల్సిన అవసరం నేతలకు లేకుండా పోయింది. తమ ఎన్నికల జయాపజయాలను ప్రభావితం చేయలేని సమూహాలను పట్టించుకోవాల్సిన అవసరం లేదనుకున్న నేతలు తమ కడుపుకింత అన్నం పెట్టే రైతన్నలు లక్షలాదిగా ఆత్మహత్యల పాలవుతున్నా చోద్యం చూస్తూ కాలమెల్లబుచ్చారు. 2014 ఎన్నికల సమయంలో స్వామినాథన్ కమిటీ నివేదికను అమలు చేస్తామని ప్రధాని మోడీ హామీ ఇచ్చినప్పటికీ అధికారం చేజిక్కిన అనంతరం తన వాగ్దానాన్ని అటకెక్కించేశారు. తమకు ఇష్టులైన బడాబాబులకు ఏకంగా 3.5 లక్షల కోట్ల రుణమాఫీ చేసిన మోడీ రైతులపై శీతకన్నేశారు. రైతు సమస్యలను పక్కనపెట్టి విలాసవంతమైన విదేశీ పర్యటనలకు వేల కోట్లు తగలేశారు. వేల కోట్ల ప్రజల సొమ్ము దోచుకున్న దొంగలు దేశం విడిచి పారిపోయేందుకు మార్గం సుగమం చేయడం, ప్రపంచ మార్కెట్ చమురు ధరలు తగ్గినా ఇక్కడ తగ్గించకుండా మరింతగా పెంచి ప్రజల జేబులు కొల్లగొట్టడం, పెద్దనోట్లరద్దు, జీఎస్‌టీలతో జనజీవితాలతో చెలగాటమాడడంలో నిమగ్నమయ్యారు. ప్రజలు అసలు సమస్యలపై దృష్టిపెట్టకుండా భావోద్వేగాలను వ్యాప్తిచేసి తమ రాజకీయ పబ్బం గడుపుకోవడంలో తలమునకలయ్యారు. ఈ నేపథ్యంలో రైతు జీవితం దినదినగండంగా మారిపోయింది. చావోరేవో తేల్చుకోక తప్పని స్థితిలోకి నెట్టివేయబడ్డ రైతన్నలు ఆందోళన బాటపట్టారు. మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్ లాంటి బీజేపీ పాలిత రాష్ట్రాలే పోరాట వేదికలయ్యాయి. బీజేపీ పాలిత మహారాష్ట్ర రైతాంగం ఆల్ ఇండియా కిసాన్ సభ (ఏఐకేఎస్) సారథ్యంలో నాసిక్ నుంచి ముంబయి వరకూ 2018 మార్చిలో 50వేలమందితో చేపట్టిన చారిత్రాత్మక మహా పాదయాత్ర దేశ రైతాంగానికి దిశానిర్దేశం చేసింది. 2018 అక్టోబర్ 2 గాంధీ జయంతి రోజున ఉత్తరప్రదేశ్‌లోని హరిద్వార్ నుంచి దేశ రాజధాని ఢిల్లీకి 30వేలమంది రైతులు నిర్వహించిన కిసాన్ ముక్తి మార్చ్ దేశ వ్యాప్త రైతు ఉద్యమాలకు గొప్ప ఊపునిచ్చింది. అక్టోబర్2న హర్యానా, పంజాబ్ రైతులు మధ్యాహ్నం భోజనం తీసుకోకుండా ఢిల్లీలో కదం తొక్కుతున్న రైతు సోదరులకు గొప్ప సంఘీభావం ప్రకటించారు. ఈ ప్రేరణతో, 207 రైతు సంఘాలతో జాతీయ స్థాయిలో 'ఆల్ ఇండియా కిసాన్ సంఘర్ష్ సమన్వయ సమితి' ఏర్పడి నవంబర్ 29న మహారాష్ట్ర, తమిళనాడు, కర్నాటక, కేరళ, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, పంజాబ్, హార్యానా దేశం నలుమూలల నుంచి 'కిసాన్ ముక్తి మార్చ్' పేరుతో ఢిల్లీలో జరిపిన రైతాంగ ప్రదర్శన అన్నదాతల శక్తి ఏమిటో నేతలకు తెలిపింది. ఆ వెనువెంటనే డిశెంబర్‌లో జరిగిన ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు రైతు చైతన్యం రాజకీయ శక్తిగా రూపాంతరం చెందిన వైనాన్ని చాటి చెప్పాయి. రైతు వ్యతిరేక నిర్ణయాల కారణంగా తమకు కంచుకోటలైన ఛత్తీస్‌గఢ్, రాజస్థాన్, మధ్యప్రదేశ్‌లలో బీజేపీ అధికారం కోల్పోయింది. ఆ మేరకు కాంగ్రెస్ పార్టీ లాభపడి అధికారాన్ని చేజిక్కించుకోగలిగింది.

అంకిత భావం, ప్రజానుకూల దృక్పథమే ఇందుకు కారణం. ఈ అనుభవాలన్నిటి దృష్ట్యా వామపక్షాలు బలపడకుండా, వామపక్షాలు పాలకపక్షాలుగా మారకుండా రైతుల కడగండ్లు తీరవన్నది సత్యం వామపక్షాలు తమ సొంత పునాదిని పటిష్టపరచుకుని, ప్రజా పునాదిని విస్కృతపరచుకునేందుకు వేగిరపడాలి. అందుకు సమాజంలోని సకల ప్రజానుకూల శక్తులూ తోడ్పడాలి. అప్పుడు మాత్రమే అన్నదాతలతో సహా అన్నార్తులందరికీ విముక్తి.!

రైతన్న విషయంలో కాంగ్రెస్ పార్టీది కూడా కపట ప్రేమే తప్ప తల్లిప్రేమ కాదు. నిజానికి తన హయాంలోనే నవంబర్ 18, 2004న స్వామినాథన్ కమిషన్‌ను ఏర్పాటు చేసిన కాంగ్రెస్ పార్టీ 2005లో కమిటీ సిఫార్సులు అందినప్పటికీ తాను అధికారంలో ఉన్న 10 సంవత్సరాలలో ఆ సిఫార్సులను అమలు చేసేందుకు పూనుకోలేదు. ఉపాధి హామీ పథకానికి ఇచ్చిన ప్రాధాన్యత కూడా రైతన్నలు ఆత్మగౌరవానికీ, ఆకలి తీర్చేందుకు చర్యలకు ఇవ్వలేదు. తరువాత అధికారంలోకి వచ్చిన బీజేపీ కాంగ్రెస్ పార్టీ అవలంబించిన రైతు వ్యతిరేక చర్యలనే కొనసాగించింది. దీంతో రైతు బతుకు పెనం మీది నుంచి పొయ్యిలో పడ్డట్టుగా తయారయ్యింది. నిజానికి, జీవన్మరణ సమస్యలు చుట్టుముట్టితే తప్ప రైతన్నలు రోడ్డెక్కరు. పాలకులను దేబిరించడం కూడా తమ ఆత్మగౌరవానికి భంగకరంగా భావించే ఆత్మగౌరవ పిపాశి అన్నదాత. కావునే, దేశంలోని మిగిలిన అన్ని వర్గాల ప్రజలూ నిత్యం ఏదో ఒక చోట ఏ దో ఒక రూపంలో ఆందోళనలు కొనసాగిస్తున్నా, తాను అర్ధాకలితో ఉన్నప్పటికీ రైతన్న రోడ్డెక్కడం అరుదు. రైతన్న రోడ్డెక్కడమంటే అది పాలకుల వైఫల్యాలకు, రైతు వ్యతిరేక చర్యలకూ పరాకాష్ట.

చైతన్యాన్ని, సంఘటితత్వాన్నీ ప్రదర్శించకుంటే ఏ సమూహ సమస్యలనైనా పాలకులు పట్టించుకోరన్నది పరమసత్యం. ఇది స్వాతంత్ర్యం వచ్చిన నాటి నుంచీ సాగుతున్న దురాగతం. రైతన్నలు ఎక్కడికక్కడ వ్యక్తిగతంగా తమ నిరసనలు తెలుపుతున్నప్పటికీ సంఘటితంగా ప్రశ్నిస్తున్న ఇతర వర్గాలలాగా పాలకులను ప్రభావితం చేయలేకపోతున్నారు. పాలకులు తమను పట్టించుకోవడం లేదన్న నైరాశ్యంతో భవిష్యత్ అంధకార బంధురమై ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. దేశానికి అన్నం పెట్టే రైతన్న తనకే అన్నం దొరకడం అసాధ్యమని నిర్ణయించుకుని ఆత్మహత్యలు చేసుకోవడం కన్నా పాలకులకు పరువుతక్కువ ఏముంది? అయినా మన పాలకులకు పరువెక్కడుంది? మానవత్వమే లేని వారికి పరువెక్కడుంటుంది– పదవీ కాంక్ష తప్ప!

దేశంలోని 17 రాష్ట్రాలలో రైతుల సగటు వార్షిక ఆదాయం కేవలం 20 వేలుగా ఉంది. సన్నకారు, చిన్నకారు రైతులు వడ్డీ వ్యాపారులనుంచి తీసుకున్న అప్పులే అధికం. గ్రామాలలో వడ్డీ వ్యాపారుల వడ్డీలు రైతన్నల నడ్డివిరిచేలా ఉంటాయన్నది జగమెరిగిన సత్యం. పంటలు చేతికి రాక, వచ్చినా సరైన గిట్టుబాటు ధరలేక దిగాలు పడిన రైతన్నలపై వడ్డీ వ్యాపారుల వేధింపులు సామాజికంగా వారిని తీవ్ర అవమానాల పాల్జేసి ఆత్మహత్యలకు ఉసిగొల్పుతున్నాయి. అన్నిటికన్నా ఆత్మగౌరవమే మిన్నని భావించే రైతన్నలు తమ జీవితాలను అర్థాంతరంగా ముగిస్తున్నారు. ఆ రైతు కుటుంబాలు దిక్కులేక దారుణంగా చితికిపోతున్నాయి. ఈ నేపథ్యంలోనే ఇపుడు రైతు కుటుంబాలు



రోడ్డెక్కుతున్నాయి. దేశ రాజధాని ఢిల్లీలో తమిళనాడు రైతులు రోజుల తరబడి చేసిన ఆందోళనలు, వారి దయనీయస్థితిని ప్రపంచానికి చాటేందుకు అనుసరించిన ఆందోళనా రూపాలు మనిషన్నవాడిని కన్నీరు పెట్టించకమానవు. అయినా మన పాలకుల పాషాణ హృదయాలు కరుగవు.

పెట్టుబడిదారీ అనుకూల పాలకులు బరితెగించి మరీ తమ మిత్రులకు ప్రజల సొమ్ము దోచిపెడుతున్నారు. దేశంలోని 528 మంది కార్పొరేట్ రుణగ్రహీతల వద్ద రూ. 10 లక్షల కోట్లకు పైగా నిరర్థక ఆస్తులు నమోదుకాగా, వీరిలో 95మంది ఒక్కొక్కరు వెయ్యి కోట్ల రూపాయలు చెల్లించాల్సి ఉంది. ఇన్ని కోట్ల రుణాలనూ పాలకులు ఒక్క కలంపోటుతో రద్దు చేసేస్తున్నారు. పాలక పార్టీలన్నీ ఒకే తాను ముక్కలుగా ప్రవర్తిస్తున్నాయి. తాము ప్రతిపక్షంలో ఉన్నప్పుడు పాలకపక్ష ఆర్థిక దోపిడీనీ ప్రశ్నిస్తున్నట్టు, తిరిగి తాము అధికారంలోకి వస్తే ఆ దోపిడీని అరికట్టి ప్రజలకు న్యాయం చేస్తామన్నట్టూ ఫోజులు కొట్టి ఓట్లు రాల్చుకుంటున్నాయే తప్ప ఏమాత్రం చిత్తశుద్ధి ప్రదర్శించడం లేదు. ప్రజలకు కూడా మరో ప్రత్యామ్నాయం అందుబాటులో లేకపోవడంతో మళ్లీమళ్లీ పాలక పార్టీల చేతుల్లో మోసపోక తప్పడం లేదు. ఇందుకు గత ఎన్నికల్లో నల్లడబ్బు తిరిగి తెచ్చి ప్రతి ఒక్కరికీ 15 లక్షలు పంచుతానన్న మోడీ హామీనే మచ్చుతునక. డబ్బు పంచడం అటుంచి పేదవాడి జేబులను దోపిడీ దొంగలా లూటీ చేసిన తీరును మనం భరిస్తూ ఉన్నాం. ఇప్పుడు కాంగ్రెస్ అధినేత రాహుల్‌తో పాటు, కేసీఆర్, చంద్రబాబు, మమత, నవీన్‌పట్నాయక్ లాంటి నేతలంతా చేస్తున్న రైతు అనుకూల వాగ్దానాలు కూడా ఇలాంటివే.

'పెట్టుబడి – గిట్టుబాటు' ఇవి రెండే రైతు జీవితంలో కీలకాంశాలు. ఇందులో పెట్టుబడికన్నా గిట్టుబాటుదే అధిక ప్రాధాన్యత. కావునే, స్వామినాథన్‌తో సహా ఎందరో వ్యవసాయ శాస్త్రవేత్తలు రైతు జీవితాలకు భద్రత గిట్టుబాటు ధరతోనే సాధ్యమని తెగేసి చెప్పారు. ఒక్క ఎకరానికి 20 నుంచి 40 వేల వరకూ పెట్టుబడి అవసరమవుతున్న స్థితిలో అనేక పార్టీలు, ప్రభుత్వాలు అందిస్తామని హామీ ఇస్తున్న రూ.10 వేల లోపు పెట్టుబడి సాయం రైతన్నలను కష్టాల నుంచి గట్టెక్కించలేదు. కాగా, పంట కొనుగోలుకు వినియోగదారుడు చెల్లిస్తున్న దాంట్లో కేవలం 20 శాతం మాత్రమే రైతులకు చేరుతూ, మిగిలినదంతా దళారులు దోచుకుతింటున్న నేపథ్యంలో పాలకులకు రైతుల పట్ల ఏ మాత్రం బాధ్యత ఉన్నా గిట్టుబాటు ధర కల్పించడం పెద్ద కష్టమేమీ కాదు. ప్రభుత్వాలకు నష్టమేమీ రాదు. కావాల్సినదల్లా నిజాయితీ. రైతులను కూడా సాటి మనుషులుగా చూసే దృక్పథం. మన పాలకులకు ఇవి లేకే రైతన్నల బతుకులు నరకప్రాయమవుతున్నాయి. ఆత్మహత్యల పాలబడుతున్నాయి. వామపక్షాల పాలనలో ఉన్న 34 సంవత్సరాలలో బెంగాల్‌లో ఒక్క రైతు కూడా ఆత్మహత్య చేసుకోలేదు. అలాగే, వామపక్షాల పాలన ఉన్నంత వరకూ త్రిపురలో కూడా రైతు ఆత్మహత్యలు జరుగలేదు. ఇప్పుడు కేరళలో కూడా ఏ రైతూ బతుకు దుర్భరమై తనువు చాలించడం లేదు. ప్రజల పట్ల వామపక్షాల అంకిత భావం, ప్రజానుకూల దృక్పథమే ఇందుకు కారణం. ఈ అనుభవాలన్నిటి దృష్ట్యా వామపక్షాలు బలపడకుండా, వామపక్షాలు పాలకపక్షాలుగా మారకుండా రైతుల కడగండ్లు తీరవన్నది సత్యం వామపక్షాలు తమ సొంత పునాదిని పటిష్టపరచుకుని, ప్రజా పునాదిని విస్కృతపరచుకునేందుకు వేగిరపడాలి. అందుకు సమాజంలోని సకల ప్రజానుకూల శక్తులూ తోడ్పడాలి. అప్పుడు మాత్రమే అన్నదాతలతో సహా అన్నార్తులందరికీ విముక్తి.!

సెల్: 6301289321

రిపోర్టర్స్ డైరీ

పండగొచ్చింది..

అవును పండగొచ్చింది. సంక్రాంతి రాకతో పల్లెలు కొత్త శోభను సంతరించుకున్నాయి. ముత్యాల ముగ్గులు.. రంగు రంగుల రంగ వల్లులు.. డూడూ బసవన్నల ఆటలు.. పిల్లల పతంగులు.. వెరసి జనాల మోములో సంతోషం పెల్లుబుకుతున్నది. ఇదంతా ఒక ఎత్తయితే..ఇప్పుడు పట్నవాసుల సంగతి మరోలా ఉంది. ఒకవైపు పండక్కి ఊరెళ్లాలన్న ఉబలాటం.. మరోవైపు రైల్వే, బస్ ఛార్జీల మోతతో వెళ్లాలా.. వద్దా..? అన్న పితలాటకం. పోనీ ధైర్యం చేసి వెళదామన్నా... బస్సులు, రైళ్లలో కిక్కిరిసిపోతున్న జనాలు. రోడ్లపైన ఒకటే రద్దీ. ఆటోలు, క్యాబ్‌ల ఛార్జీలు తడిసి మోపెడవుతున్నాయి. వీటి సంగతి ఇలా ఉంటే టోల్ గేట్ల వద్ద ఐదారు కిలోమీటర్ల మేర పేరుకుపోతున్న వాహనాలు. అవెప్పుడు కదులుతాయో.. తామెప్పుడు ఊళ్లకు చేరతామో తెలియక సతమతమై పోతున్నారు. ఇదిలా ఉంటే ప్రయివేటు బస్సులు, ఇతర వాహనాల్లోని ఛార్జీల గురించి మాట్లాడుకుంటేనే భయమేస్తున్నది. వంద, రెండొందలు కాదు.. ఏకంగా ఒక్కొక్కరికి ఐదొందలు, వెయ్యి రూపాయల చొప్పున ఛార్జీలను వసూలు చేస్తున్నారు సదరు ప్రయివేటు ట్రావెల్స్. ప్రజా రవాణా వ్యవస్థ అంటూ ట్యాగ్‌లైన్ తగిలించుకున్న ఆర్టీసీ వారి డబుల్ ఛార్జీల ధమాకాతో జనాల జేబులకు చిల్లులు పడుతున్నాయి. అదేమంటే పండగ కోసమని ఊర్లకు బస్సులేస్తే.. వెళ్లేటప్పుడు అవి ఫుల్లవుతున్నాయి. కానీ వచ్చేటప్పుడు మాత్రం బండి ఖాళీగా వస్తున్నది. దీంతో డీజిల్ ఖర్చులు కూడా రావటం లేదు. అందుకే జనాల నుంచి అప్ అండ్ డౌన్ ఛార్జీలను వసూలు చేస్తున్నామంటూ సెలవిస్తు న్నారు అధికారులు. సో... మొత్తం మీద ప్రతి పండగ లాగే ఈ సంక్రాంతికి అటు ఆర్టీసీ, రైల్వేకు, ఇటు ప్రయివేటు ట్రావెల్స్‌కు నిజంగానే పండగొచ్చింది...

–బి.వి.యన్.పద్మరాజు

ఆపరేషన్ ఆకర్ష్

నవ్విపోదురుగాక నాకేటి సిగ్గు అనే తరహాలో టీఆర్ఎస్ సర్కారు ఆపరేషన్ ఆకర్ష్‌ను ఇంకా కొనసాగిస్తున్నదనే ముచ్చట తెలంగాణ భవన్‌లో కోడై కూస్తున్నది. 'నువ్వు రా...నీతోపాటు ఆయన్ను కూడా తీసుకురా..' అంటూ కండిషన్లు పెడుతున్నారట ఆ అపరేషన్ నిర్వాహకులు. మంత్రి పదవులు ఆఫర్లు ఇస్తున్నారట కొందరికి. మరికొందరికి కార్పొరేషన్లు, ఇంకొందరికి నిధులు ఇస్తామని అంటున్నారు. రాక పోతే నియోజకవర్గ నిధులు ఆపేస్తామని బెదిరిస్తున్న వైనం ఉన్నదని చెబుతున్నవారూ లేకపోలేదు. దీంతో రాజకీయ విశ్లేషకులు ఔరా ! అంటూ ముక్కున వేలేసుకుంటున్నారు. అధికారపార్టీలోనూ దీనిపై చర్చ జరుగు తున్నది. పార్టీలో ఉన్నోళ్లకు పదవులు ఇవ్వకుండా, బయట నుంచి వచ్చిన వారికి తొలి ప్రాధాన్యత ఇవ్వడాన్ని సహించలేని పరిస్థితి నెలకొందట. అయినా అధినేత ముందు కక్కాలేక, మింగాలేక మూసుకుం టున్నారట! హతవిధి !!

– బి.బసవపున్నయ్య

నవ్వుతున్న పల్లె తల్లి

పంచాయతీ ఎన్నికల కోలాహలాన్ని చూసి పల్లెతల్లి పక్కున నవ్వుతున్నది. తనకు ప్రగతి వెలుగులు చూపడానికి నేతలు పడుతున్న ఆరాటాన్ని చూసి "ఔరా" అనుకుంటున్నది. ఎన్నడూ లేని విధంగా తనమీద చూపిస్తున్న ప్రేమను చూసి నిజంగా నన్ను అభివృద్ధి చేసేందుకు ఇంతమంది పోటీ పడుతు న్నారా? అని ఆలోచిస్తున్నది. తల్లడిల్లుతున్న పల్లెను చూసి ఊరడించడానికి నేతలు కడుతున్న "క్యూ" లైన్లను చూసి మురిసిపోతున్నది. పల్లె అందాల దృశ్యాలకు పూర్వవైభవం తీసుకువస్తారని ఆశిస్తున్నది. "అమ్మా పల్లె తల్లీ ఈ ప్రేమంతా నీ మీద కాదమ్మ.. మా పొట్టలు నింపుకునేందుకే. నీవు అత్యాశ పడకు" అంటూ నేతలు తలవంచుకుని సమాధానం చేపుతుంటే పల్లె తల్లి సిగ్గుతో తలదించుకోవాల్సిన పరిస్థితి. ఇది పంచాయతీ ఎన్నికల దుస్థితి.


– టి..సంజయ్‌కుమార్

బీకామ్ ఫిజిక్స్ కరెక్టే

గప్పట్ల ఎమ్మెల్యే జలీల్‌ఖాన్ సారు..డిగ్రీలో బీకామ్ కోర్సుదీస్కోని మ్యాథమెటిక్స్, ఫిజిక్స్ చదివినంటే మీడియోళ్లు రచ్చరచ్చజేసింద్రు. ఎహె బీకామ్‌లో ఆప్షన్ సబ్జెక్ట్‌గా ఫిజిక్స్ ఉంటదని జలీల్‌ఖాన్ సార్ బల్లగుద్దిమరీ చెబితే.. అంతా ఎచ్చిడెచ్చిడి జేసింద్రు. ఇగ ఆనం సారైతే ప్రెస్‌మీట్ బెట్టి మరీ 'ఇదేందయ్య..? ఇదేందయ్య..? వార్నీయమ్మ గిదెప్పుడు విన్లే' అని జలీల్‌సార్‌ను ఆగంబట్టిచ్చిండు. గా జలీల్‌ఖాన్ సార్‌ని ఎందుకు చిన్నబుచ్చాలను కున్నరేమో? గా సార్ మాట నచ్చిందేమో? అరె బీకామ్‌ల ఫిజిక్స్ ఎందుకు ఉండొద్దు అన్న సందేహం వచ్చిందో ఏమోగానీ మన పెద్దోల్లు బీకామ్‌ల కూడా ఫిజిక్స్ చదువుకోవచ్చని ఇగ గ్రీన్‌సిగ్నల్ ఇచ్చేసింద్రు. గప్పుడు జలీల్‌ఖాన్ సార్ ఎంత మొత్తుకున్నా ఎవ్వలూ ఇనకపాయే. బీకామ్ మ్యాథ్స్‌లో వందకు వంద మార్కులొచ్చినయంటే ఎవ్వలు గిట్ల నమ్మకపాయే. గిప్పుడు గా సార్ చెప్పినట్టే డిగ్రీ ఏ సబ్జెక్టునైనా ఎంచుకుని చదువుకోవచ్చు.

– అచ్చిన ప్రశాంత్

పండ్గదినాన గూడ పాత పాట



తెలిదేవర భానుమూర్తి

రేగిపండు బెట్టుకోని నారదుడు నెత్తిమీదికెల్లి తానం జేసిండు. కొప్పేసుకుండు. మొకానికి పోడర్ బూస్కుండు. తంబూరు దీస్కుండు. ఒకపారి టింగ్‌టింగ్ మన్నడు. చిర్తలు దీస్కుండు. గవ్విటిని ఒకపారి కొట్టి జూస్కుండు. గీపారి యాడికి బోవాలె. యాడికి బోతె బాగుంటదని జెరసోపు సోంచాయించిండు. యాడికో ఎందుకు ఎప్పటి లెక్క యాద్గిరి గుట్టకు బోతె బాగుంటదనుకున్నడు. అనుకోని చిర్తలు గొట్టుకుంట నారాయన; నారాయన అన్కుంట మొగులు మీదికెల్లి ఎల్లిండు. గాయిన యాద్గిరి గుట్ట దిక్కు రాబట్టిండు. గని నడ్మల నర్కం దిక్కు బోతున్న యముని దున్నపోతు గాయినను గల్సింది.

"యాడికి బోతున్నవు నారదా?" అని దున్న పోతు అడిగింది.

"యాద్గిరి గుట్టకు బోతున్న" అని నారదుడు అన్నడు.

" ఎందుకు బోతున్నవు"

"నర్సిమ్మ సామితోని ముచ్చట బెట్టెతందుకు"

"గాయినతోని ముచ్చట బెడ్తె ఏమొస్తది"

" తెలంగానల ఏమైతున్నదో ఎర్కైతది"

"గీయింత దాన్కి గాయిన కాడ్కి బోవుడెందుకు? తెలంగాన ఏమైతున్నదో నేను నీకు జెప్త గద"

" నీ కెట్ల ఎర్క?" అని నారదుడు అడిగిండు.

"అందరి కన్న ముందుగాలనే నేను తెలంగానల తిర్గి వొస్తున్న" అని తల్కాయ దిప్పుకుంట దున్నపోతు అన్నది.

" గట్లయితె జెప్పు"

"సంక్రాంతి పండ్గకు శానమంది ఊర్లలకు బోయె బట్కె పట్నమంత కాలి అయ్యింది. సడక్ల మీద ట్రాపిక్ లేదు. ఇంతకువుందు గల్లిల పోరగాల్లు కిరికిట్ ఆడెటోల్లు. గిప్పుడు సడక్ మీదనే కిరికిట్ ఆడబట్టింద్రు. కిరికిట్ల మనదేసం ఆస్ట్రేలియను ఆల్ల దేసంలనే ఓడగొట్టింది. దాంతోని పట్నం పోరగాల్లకు జోష్ వొచ్చింది. పట్నం పోరలు జోష్ల కొస్తె హోష్ల ఉండరు. మోసమ్ హై టండి టండా కెలోరె గిల్లి దండా అన్కుంట కొందరు పోరలు సడక్ మీదనే గిల్లి దండ ఆడబట్టింద్రు. ఆడోల్లు ఇండ్ల ముంగట ముగ్గులు ఎయ్యబట్టింద్రు. పంచాయితి ఎలచ్చన్లు అయితున్నయి. గంతే గాకుంట లోకసబ ఎలచ్చన్లు గూడ దగ్గర్ల ఉన్నయి. ఇగ దాంతోని అన్ని పార్టీలు ముగ్గులు ఏపియ్యబట్టినయి. టిఆర్ఎస్ గులాబి రంగుతోని మోటర్ ముగ్గు ఏపియ్యబట్టింది. కాంగ్రెస్ చెయ్యి ముగ్గు ఏపిస్తె తెలుగుదేసం సైకిల్ ముగ్గు ఏపిచ్చింది. టిజెఎస్ అగ్గిపెట్టె ముగ్గు ఏపిచ్చింది. జెనంను ముగ్గుల దించెతందుకు పార్టీలన్నీ ఒక్క తీర్గ కోషిస్ జెయ్యబట్టినయి. రతం ముగ్గు; సుక్కల ముగ్గులు గూడ ఏపియ్యబట్టినయి. అత్తరబుత్తరగ ముగ్గులెస్తే మంచిగుండదని ముగ్గు లేసుట్ల అన్ని పార్టీలు కొంతమందికి ట్రేనింగ్ ఇప్పిచ్చినయి. ట్రేనింగ్ దీస్కునోల్లు ఇల్లిల్లు దిరుక్కుంట ఆకిట్ల ముగ్గులెయ్యబట్టింద్రు.



హరిదాసులకు గుడ్క అన్ని పార్టీలు ట్రేనింగ్ ఇచ్చినయి. గాల్లు పాతపాటలే గాకుంట కొత్త పాటలు నేర్పిచ్చినయి. జయజయ చెంద్రసేకర జయ తారక రామ జయజయ తెలం గాన జయ కవిత అను కుంట టిఆర్ఎస్ హరి దాసులు ఇల్లిల్లు దిరుక్కుంట పాడ బట్టింద్రు. జయ ఇందిరమ్మ జయ సోనియమ్మ జయ రాహుల్ గాంది అను కుంట కాంగ్రెస్ హరి దాసులు బాడితె ఎన్టీ ఆర్‌కు జైబోలో చెంద్రబాబుకు జై బోలో సైకిలెన్క చలోచలో అని తెలుగుదేసం హరిదాసులు పాట బట్టింద్రు. అయోధ్య రామునికి జయమంగళం; ప్రతాని మోదికి జయ మంగళం; గాయిన ఇచ్చిన రిజర్వేసన్లకు శుబ మంగళం అన్కుంట బిజెపి హరిదాసులు ఇల్లిల్లు దిరుక్కుంట పాటలు పాడ బట్టింద్రు. పండ్గకు పది దినాల ముందుగాలే అన్ని పార్టీలు గంగిరెద్దులోల్లను బిల్సినయి. గాల్లకు బిర్యాని బెట్టినయి. తలా వెయ్యి రూపాలిచ్చినయి. గంగిరెద్దుల మీద బొంతలే గాకుంట పార్టి జెండలు గూడ గప్పాలని జెప్పినయి. అయ్యగారికి దండం బెట్టు అమ్మగారికి దండం బెట్టు అని పాడుడే గాకుంట అయ్యగారిని ఓటు అడుగు అమ్మగారిని ఓటు అడుగు అని పాడుకుంట గంగిరెద్దు మీద ఉన్న పార్టి జెండ సూపియ్యాలని జెప్పినయి. సన్నాయి ఊదుకుంట ఓట్ల బిచ్చమడ్గాలని జెప్పినయి" అని దున్నపోతు అన్నది.

"గీ లీడర్లు పండ్గను గూడ ఇడుస్త లేరు. పండ్గ దినాన సుత పాత పాటే పాడ్తున్నరు. ఇయ్యాల గంగిరెద్దులను ఆడిస్తున్నయి రేపొద్దుగాల మమ్ములను గంగిరెద్దులను జేసి ఆడిస్తరు అని జెనం అనుకుంట లేరా?" అని నారదుడు అడిగిండు. అనుకుంటున్నరు. పప్పుల దరలు బెర్గినయి నూనెల దరలు బెర్గినయి. చికెన్; కోడి గుడ్ల దరలు మొగులు మీద గూసున్నయి. సకినాలు ఎట్ల జేస్కోవాలె. మురుకులు; నూల ముద్దలు; బచ్చాలు ఎట్ల జేస్కోవాలె అని జెనం ఫికర్ బడ బట్టింద్రు. ఒక్క దినం మేసానికి మూతిమీసాలు గొర్గిచ్చుకునుడు ఎందుకని కొందరు పలారాలు జేస్కోకుంట ఊకున్నరు. కొన్ని పంచాయితిలకు పోటి లేకుంట కొందరు సర్పంచులయ్యింద్రు. గాల్లు జెనాలకు పలారాలు బంచింద్రు. పంచాయితి ఎలచ్చన్ల ఓట్ల కోసం కొందరు కోల్లను గోసి కోడి మాంసం బంచితె; ఇంకొందరు కోడి గుడ్లు పంచబట్టింద్రు. కొన్ని సర్పంచ్ కుర్సిలను హర్రాజ్ ఎయ్యబట్టింద్రు. హర్రాజ్ ఎవరెక్వ లచ్చులు బాడితె గాల్లకు సర్పంచ్ కుర్సి ఇయ్యబట్టింద్రు. అసెంబ్లి ఎలచ్చన్ల ఎమ్మెల్యే కుర్సిలను హర్రాజ్ ఏస్తె బాగుండె గదా అని ఓడిపోయినోల్లు అనుకున్నరు. ఎంపి కుర్సిలకు పోటీ జెద్దామనుకున్నోల్లు గూడ పండ్గ ముంగట జెనంను పలారాలు బంచింద్రు. లష్కర్ , పరేడ్ మైదాన్ల పతంగులు ఎక్కియ్యబట్టింద్రు. గులాబి రంగు మాంజతోని టిఆర్ఎస్ లీడర్లు పతంగులు ఎక్కియబట్టిండు. గా పతంగుల మీద కెసిఆర్ ఫోట్వ ఉన్నది. కాంగ్రెస్ లీడర్లు గాల్ల పక్కపంటే ఉన్న తెలుగుదేసం లీడర్లు పతంగులు ఎక్కిస్తె ఒక్కటే రెక్క మిగిలిన తామరపువ్వు బొమ్మతో ఉన్న పతంగులను బిజెపి లీడర్లు ఎక్కియ్యబట్టింద్రు. టిఆర్ఎస్ పతంగులు కాంగ్రెస్, తెలుగుదేసం, బిజెపి పతంగులను సఫా జెయ్యబట్టినయి. ఉత్తమ్‌కుమార్, కుంతియా జెయ్యబట్కె కాంగ్రెస్ పతంగులు సఫా అయితున్నయి అని సర్వే సత్యనారాయన అన్నడు. అనుడే గాకుంట గాల్ల పతంగులకే పేంచి ఎయ్యబట్టిండు. గిట్ల పేంచి ఏసుడు మంచిది గాదన్న కాంగ్రెస్ లీడర్ మీదికి గాయిన చెర్క ఇసిరేసిండు. దాంతోని గాయినను పరేడ్ మైదాన్ల కెల్లి ఎల్లగొట్టింద్రు. మల్ల గలుస్త " అన్కుంట దున్నపోతు నర్కం దిక్కు బోయింది. నారాయన; నారాయన అన్కుంట నారదుడు వైకుంటం బోయిండు.

తోక : పొద్దుమీకింది. ఎప్పటి లెక్కనే చౌరస్త కాడ ఉన్న పాన్‌డబ్బ కాడ్కి బోయిన. గాడ పాన్లు దినుకుంట మా దోస్తులు ముచ్చట బెడ్తున్నరు.

"ఉత్తరాకండ్‌ల గుడిల దేవుని బొమ్మలకు సలి గొట్టకుంట రగ్గులు గప్పుతున్నరు. గుల్లె హీటర్లు బెడ్తున్నరు" అని సత్నారి అన్నడు.

"బిసి హాస్టలల్ల పోరగాల్లు సలికి వొన్కుతుంటె సర్కార్ దుప్పట్లు ఇస్తలేదు. పోరగాల్ల కన్న దేవుని బొమ్మలు ఎక్వాయె గదా" అని యాద్గిరి అన్నడు.

సెల్: 9959150491

తల్లిదండ్రుల కలల కొనసాగింపుగా పిల్లలున్న రోజులివి. కానీ.. కూతురు కలను నిజం చేయాలనుకున్నది ఈ తల్లి. పేరు శశిరేఖ. కూతురు కోసం ఎంతో కష్టపడింది. తల్లి శ్రమను ఊరికే పోనీయలేదు ఆ కూతురు. దేశం గర్వించదగ్గ యువతిగా ఎదిగింది. ఆమె లెఫ్టినెంట్ భావన కస్తూరి. జనవరి 26న జరగనున్న రిపబ్లిక్ డే పరేడ్‌లో ఆర్మీ కాంటింజెట్‌కు నాయకత్వం వహించనున్న అధికారి. ఆర్మీ సర్వీసెస్ కార్ప్స్ కాంటింజెంట్ ఇరవై మూడేళ్ల తర్వాత ఇప్పుడు ఈ పరేడ్‌లో పాల్గొంటున్నది. దానికి ఓ మహిళా అధికారి సారథ్యం వహించడం ఆర్మీ చరిత్రలోనే ప్రప్రథమం. ఆ తెలంగాణ ముద్దుబిడ్డ గురించి... తల్లి పంచుకున్న వివరాలు మానవికోసం!



తల్లిగా గర్వపడుతున్నా...



మాది హైదరాబాద్‌లోని దిల్‌సుఖ్‌నగర్. నేను స్టెనోగ్రాఫర్‌గా చేస్తున్నా. పాప మూడో ఏటనే నేను భర్తతో విడిపోయాను. అలాగని భావనకు ఏ లోటూ రానీయలేదు. మా తల్లిదండ్రులు, చెల్లి సహకారం ఉంది. భావన నాలుగో తరగతి వరకు స్థానిక స్కూల్‌లో చదివింది. తరువాత ప్లస్ టూ వరకు సెంట్ జార్జెస్ గ్రామర్ స్కూల్లో చదివింది. స్కూల్లో టాపర్. ఆ తరువాత అరోరా డిగ్రీ కాలేజీలో చేరింది. తను స్పోర్ట్స్‌లో కూడా యాక్టివ్‌గా ఉండేది. ఫుట్‌బాల్, వాలీబాల్ బాగా ఆడేది. యోగాలో నాలుగేండ్లు తనే స్టేట్ ఛాంపియన్. ఆమెలోని టాలెంట్‌ను డిగ్రీ కాలేజీలో ఎన్‌సీసీ హెడ్ గుర్తించారు. ఆయనే భావనను మోటివేట్ చేసి... ఎన్ఎస్‌సీలో చేర్పించారు. అదే ఆమె జీవితంలో మలుపు అనుకుంటా.

ఎన్‌సీసీలో చేరి...

2009లో ఎన్‌సీసీలో చేరింది. మరుసటి ఏడాది... 2010లో ఢిల్లీ రిపబ్లిక్ డే పరేడ్‌కు ఎంపికయ్యింది. ఎన్‌సీసీ క్యాడెట్స్‌కు ప్రాతినిధ్యం వహించింది. అక్కడ ఆర్మీ వాళ్ల క్రమశిక్షణ, జీవన విధానం చూసి బాగా ఇన్‌స్పైర్ అయ్యింది. తిరిగి హైదరాబాద్ రాగానే... 'అమ్మా నేను ఎలాగయినా ఆర్మీలో చేరాల్సిందే!' అని చెప్పింది. మామూలుగా చెబుతుందేమోననుకున్నా కానీ... తను సీరియస్‌గానే తీసుకుంది. దాంతో 'నీకు ఏది ఇష్టం అయితే అది చేయి' అని చెప్పాను. 'డ్యాన్స్, మ్యూజిక్ ఇంత టాలెంట్ ఉంది. ఆర్మీకి పంపడం ఎందుకు?' అన్నారు బంధువులు, చుట్టుపక్కల వాళ్లు. కానీ తను మాత్రం నిర్ణయాన్ని మార్చుకోలేదు. డిగ్రీ ఫైనల్ ఇయర్‌లో ఉన్నప్పుడే ఎన్‌సీసీ ద్వారా డైరెక్టు ఇంటర్వ్యూ ఇచ్చింది. వేకేన్సీ పొజిషన్ లేకపోవడంతో రాలేదు. అయినా నిరాశపడలేదు. డిగ్రీ అయ్యాక... ఉస్మానియా యూనివర్సిటీలో ఎమ్మెస్సీ మైక్రోబయాలజీలో చేరింది. ఎమ్మెస్సీలో ఉన్నప్పుడు కూడా మూడుసార్లు ప్రయత్నించింది. అన్నింట్లో అర్హత సాధించినా.. వేకెన్సీలేక మళ్లీ ఆగిపోయింది. అయినా ఆర్మీ పట్ల ఆమెకున్న ఇష్టం మాత్రం తగ్గలేదు.

కార్గిల్‌లో ఫస్ట్ పోస్టింగ్...

పీజీ అయిపోయిన తరువాత ప్రయత్నిస్తే... ఆలిండియా ఫోర్త్ ర్యాంక్ వచ్చింది. ఆర్మీ సర్వీసెస్ కార్ప్స్‌కి ఎంపికయ్యింది. చెన్నైలో 11నెలలపాటు కఠిన శిక్షణ. ట్రైనింగ్‌లో సైతం టాప్‌ఫైవ్‌లో ఉన్నది. హార్స్ రైడింగ్, రాకెట్ లాంచర్ ఫైరింగ్‌లో అబ్బాయిలతో సమానంగా రాణించాం. ఇది ఆనందంగా ఉంది. శిక్షణ పూర్తికాగానే మొదట కార్గిల్ లో పోస్టింగ్ ఇచ్చారు. మేం అందరం భయపడ్డాం. తను మాత్రం అస్సలు వెనుకడుగు వేయలేదు. 'చాలా బాగుంటుంది. మీరు కంగారుపడాల్సిన పనిలేదు' అని మాకు భరోసా ఇచ్చింది. రెండున్నరేండ్ల పాటు అక్కడ పనిచేసింది.



మొట్టమొదటి మహిళ...

భావనది కర్ణాటక రెజిమెంటల్. 23 ఏండ్ల తరువాత... రిపబ్లిక్ డే పరేడ్‌కు ఎఎస్‌సీ సమన్వయం చేస్తున్నది. వాళ్ల ఆఫీసర్‌గా భావనను ఎంపిక చేశారు. జనవరి 26న రిపబ్లిక్ డేనాడు కాంటింజెంట్‌ను లీడ్ చేస్తున్నది. ఎఎస్‌సీ కాంటింజెంట్‌ను లీడ్ చేస్తున్న మొట్టమొదటి మహిళా అధికారి భావన. ఈ పరేడ్‌లో పాల్గొనడానికి, లీడ్ చేయడానికి పురుషులే చాలా కష్టపడ్తారు. యేడాది పాటు ప్రాక్టీస్ చేస్తారు. దాన్ని ఛాలెంజింగ్‌గా తీసుకున్నది భావన. ఆరునెలల నుంచి ప్రాక్టీస్ చేస్తున్నది. ఆమెతో పాటు మరో ఇద్దరు పురుష అధికారులు కాంటిజెంట్ కమాండర్స్‌గా ప్రాక్టీస్ చేస్తున్నారు. ఆర్మీ కాంటిజెంట్‌కు సారథ్యం వహించే అవకాశం మహిళా అధికారికి వచ్చింది అంటే ఆర్మీలో మహిళల పట్ల అమోదనీయత వచ్చినట్లే. ఇది శుభ పరిణామం.

స్టబర్న్ లేడీ...

ఎంతోమంది మహిళలు దేశానికి సేవ చేస్తున్నారు. అందులో మా అమ్మాయి కూడా ఉన్నందుకు... రిపబ్లిక్‌డే పరేడ్‌లో కంటింజెంట్‌ను లీడ్ చేస్తున్న మొట్టమొదటి ఆఫీసర్‌గా చరిత్ర సృష్టిస్తున్నందుకు చాలా గర్వంగా ఉంది. చిన్నప్పటినుంచే తను స్వతంత్రత ఉన్న అమ్మాయి. ఇంట్లో, స్కూల్లో అందరితో కలుపుగోలుగా ఉండేది. ఆర్మీలోకి వెళ్లాలన్నది తన హఠాత్ నిర్ణయం. తల్లిగా తల్లిగా నేను ప్రోత్సహించాలి. నిరుత్సాహపరచకూడదు. తను కూడా అంతే... చాలా స్టబర్న్ లేడీ. అనుకున్నది అంటే.. ఎంతటి కష్టమైనా పడతది. ఎన్ని అడ్డంకులొచ్చినా లెక్క చేయదు. ఈ స్థాయికి వచ్చిందంటే... తన పట్టుదల, పనిపట్ల తనకున్న అంకితభావమే కారణం. 'ఏదో ఒకటి చేయాలి. నన్ను నేను నిరూపించుకోవాలి' అనే మనస్తత్వం. చిన్నప్పటినుంచి ఏదైనా చేయాలనుకుంటే చేస్తది.



అన్నింట్లో టాపరే...

భావన మూడేండ్ల వయసులోనే డ్యాన్స్ నేర్చుకోవడం మొదలుపెట్టింది. డ్యాన్స్‌లో సర్టిఫికెట్ కోర్సు పూర్తి చేసింది. స్థానికంగానే కాదు... దుబాయ్, సింగపూర్, మలేషియాల్లో సైతం ప్రదర్శనలు ఇచ్చింది. డ్యాన్స్‌కి హెచ్ఆర్‌డీ స్కాలర్‌షిప్‌ను కూడా అందుకున్నది. భావనకి సంగీతం అన్నా చాలా ఇష్టం. ఎనిమిదో ఏట సంగీత సాధన ప్రారంభించింది. ప్రస్తుతం సంగీతాన్ని కొనసాగిస్తున్నది. అధికారిక కార్యక్రమాలున్నా కచ్చితంగా పాడుతుంది. చదువులు స్పోర్ట్స్ మాత్రమే కాదు... భావన అన్నింట్లో టాపరే.

పుస్తకాలకు కాస్త విరామం...

పిల్లలకు స్కూళ్లు.. కాలేజీల నుంచి కొంత విరామం దొరికింది. పిల్లలు చదువు మూడ్‌లో నుంచి బయటకు వచ్చేస్తారు. పేరెంట్స్ చదువు మూడ్‌లోకి వెళ్లిపోవడానికి ఇదే సరైన సమయం అంటున్నారు నిపుణులు. పిల్లల చదువుకోసం సెలవుల్లో పెద్దలు ఎలాంటి సూచనలు పాటించాలో తెలుసుకుందాం.

సెలవులు అంటేనే ఆటవిడుపు. ఆటలకు పనిచెప్పే సమయమిది. సెలవుల్లోనూ పిల్లలను చదువుకోసం ఒత్తిడి చేయకుండా సున్నితంగానే వ్యవహరించాలని మానసిక నిపుణులు సూచిస్తున్నారు. ముఖ్యంగా పుస్తకాలను పట్టించి చదవండి అని చెప్పకుండా.. ఆటలు ఆడిన తర్వాత ఫ్రెష్‌గా ఓ బుక్ చదివించాలి. చిల్డ్రన్ లవ్ పర్సెప్షన్‌లో భాగంగా మనసుతో చదివేలా టెక్నిక్స్ నేర్పించాలి. స్టడీరూమ్‌లో బొమ్మలు.. ఆటవస్తువులు కాకుండా పుస్తకాలు ఉండేలా చూసుకోవాలంటున్నారు.



చదవాలి.. ర్యాంకులు తెచ్చుకోవాలి అని కాకుండా సృజనాత్మకరీతిలో చదవాలని పిల్లలను ప్రేరేపించాలి. ఈ విషయంలో పిల్లలకు పేరెంట్స్ రోల్‌మోడల్స్‌గా వ్యవహరించాలని నిపుణులు సూచిస్తున్నారు. రెగ్యులర్ పాఠాలు కాకుండా క్రియేటివిటీ ప్రతిబింబించేలా ప్రోత్సహించాలి. దీంట్లో భాగంగా పదజాలం పెంపొందించేందుకు కృషి చేయాలంటున్నారు. సెలవులు అనగానే రోజంతా ఆటలే కాదు. లైబ్రరీకి వెళ్లడం వల్ల అంతకంటే ఎక్కువ ప్రయోజనం ఉంటుంది. మరీ ముఖ్యంగా ఎవరికైనా బర్త్‌డే గిఫ్ట్‌లు.. ఇతర బహుమతులు ఇచ్చే సంప్రదాయానికి ఫుల్‌స్టాప్ పెట్టి పుస్తకాలను గిఫ్ట్‌లు ఇచ్చేలా కొత్త అలవాటు నేర్పించాలని వాళ్లు సూచిస్తున్నారు.

ఇట్లచేద్దాం

అద్దాలపై మరకలు అసహ్యంగా కనిపిస్తాయి. వాటిని సులభంగా వదిలించాలంటే కొంచెం టూత్ పేస్ట్‌రాసి, పేపర్‌తో కానీ, బట్టతో కానీ తుడవాలి. ఇలా చేస్తే అద్దాలు మెరుస్తుంటాయి.









పురికొసతో మొదలు...

ఇంట్లో ఇప్పుడు ఎక్కడ చూసినా ప్లాస్టిక్. కానీ ఒకప్పటి పురికొస... గోనెపట్టా... ఎంత సహజమైనవో కదా! వాటితో చేసిన అలంకరణ వస్తువులు కూడా అంతే సహజంగా ఉంటాయి. వీటిని కేవలం ఇంట్లో అందంగా అమర్చుకోవడానికే కాదు... అభిరుచిని కాస్తా వ్యాపారంగానూ మలుచుకోవచ్చు. అందుకు ఉదాహరణలు ఇవి. వీటిని చూసి.. మరికొన్ని కొత్తవాటిని మొదలుపెట్టండి!

కురుల మెరుపు కోసం...

చలికాలంలో తల భాగంలో తేమ తగ్గిపోవడంతో జుట్టు పొడిబారడం, వెంట్రుకలు చిక్కులు పడడం వంటి సమస్యలు ఎదురవుతాయి. చలికాలంలోనూ మెరిసే కురులతో మురిసిపోవాలంటే కొన్ని చిట్కాలు పాటించాలి. ఏ రకమైన జుట్టు ఉన్నవారికైనా ఈ చిట్కాలు చక్కగా పనిచేస్తాయి.



ఆయిల్: ఆలివ్ నూనె జుట్టుకు తేమను అందించి, కుదుళ్లకు పోషణనిస్తుంది. వెంట్రుకలను ఆరోగ్యంగా ఉంచుతుంది. ఆలివ్ నూనెను కొద్దిగా వేడి చేసి, మాడుకు నెమ్మదిగా మర్దన చేసుకోవాలి. తల భాగానికి రక్తప్రసరణ బాగా జరుగుతుంది. వెంట్రుకలు రాలిపోవడం తగ్గిపోతుంది.

కండిషనింగ్: చలికాలంలో వారంలో ఒకసారైనా డీప్ కండిషనింగ్ చేసుకోవాలి. జుట్టుకు నూనె రాసుకున్న తర్వాత కండిషనింగ్ చేసుకోవాలి. దీంతో వెంట్రుకలకు తేమతో పాటు పోషణ కూడా అందుతుంది. కురులు సుకుమారంగా మారతాయి.

జుట్టును ఆరబెట్టడం: వెంట్రు కలను సహజంగానే ఆరబెట్టుకోవాలి. జుట్టు తడిగా ఉన్నప్పుడు ముడి వేసుకోవడం వల్ల జుట్టు కొసలు చిట్లిపోవడం, చుండ్రు సమస్యలు తలెత్తుతాయి. టవల్‌తో కేశాలను గట్టిగా రుద్దకూడదు.

కొబ్బరి నూనె, నిమ్మరసం: టేబుల్‌స్పూను వేడి కొబ్బరినూనెలో కొద్దిగా నిమ్మరసం వేయాలి. ఈ మిశ్రమంలో ముంచిన కాటన్ బాల్‌తో మసాజ్ చేసుకోవాలి. 30 నిమిషాల తర్వాత నీళ్లతో కడిగేయాలి.

నో హాట్‌బాత్: తల భాగం తేమగా ఉండాలంటే వేడి నీటి స్నానం చేయకూడదు. వేడినీళ్లతో స్నానం చేయడం వల్ల తల భాగంలోని సహజ నూనెలు తొలగిపోయి, వెంట్రుకలు పొడిబారతాయి. ❄

ఆకలి తగ్గిందా..!



– జీర్ణక్రియను వేగవంతం చేయడంలో నిమ్మరసం భలేగా పని చేస్తుంది. శరీరంలోని వ్యర్థాలను తొలిగించి ఆకలి పుట్టేలా చేస్తుంది. ఆకలి మందగించినపుడు గ్లాసు నీళ్లలో కాస్త నిమ్మరసం పిండి, అందులో కొద్దిగా తేనె కలిపి తీసుకోండి. కాసేపటికి ఆకలి బాగా వేస్తుంది.

– పోషక విలువలు మెండుగా ఉన్నా ఖర్జూరాలకు ఆకలి పుట్టించే గుణం కూడా ఎక్కువే. దీన్ని రసంలా చేసి కూడా తీసుకోవచ్చు. ప్రతి రోజూ నాలుగైదు ఖర్జూరాలు తింటే ఆకలి లేమి తీరిపోతుంది.

– వికారం, అజీర్తికి అల్లం మంచి ఔషధంగా పనిచేస్తుంది. ప్రతి రోజూ నాలుగైదు అల్లం ముక్కలను దవడకు పెట్టుకుని నమిలి, ఆ రసాన్ని మింగుతూ ఉండాలి. దీనివల్ల క్రమంగా జీర్ణవ్యవస్థ పనితీరు మెరుగవుతుంది. ఆకలి కూడా వేస్తుంది.

– పొట్టలో గ్యాస్‌ను బయటకు తోసేయడంలో మెంతులు బాగా పని చేస్తాయి. దీంతో ఆకలి పెరుగుతుంది. ప్రతి రోజూ మెంతిపొడిని తేనెతో కలిపి తగిన మోతాదులో తీసుకుంటే ఆకలి పుడుతుంది.

– ద్రాక్షలో విటమిన్–సి ఉంటుంది. అది జీర్ణక్రియను సాఫీగా సాగేలా చేస్తుంది. భోజనం చేశాక కొన్ని ద్రాక్షపళ్లు తినండి. తీసుకున్న ఆహారం తొందరగా అరుగుతుంది.

రంగ వల్లులు



కె.శారద
దురాజ్‌పల్లి,
సుర్యాపేట



పి.రమాదేవి
తుంగతుర్తి
నల్లగొండ

సీపీఐ(ఎం) కేంద్ర కమిటీ మాజీ సభ్యులు మోహర్ సింగ్ మృతి

- పొలిట్ బ్యూరో సంతాపం



న్యూఢిల్లీ : సీపీఐ(ఎం) కేంద్ర కమిటీ మాజీ సభ్యులు, ఆ పార్టీ హిమాచల్ ప్రదేశ్ మాజీ కార్యదర్శి మోహర్ సింగ్ శుక్రవారం మృతి చెందారు. ఆయన వయస్సు 68 ఏండ్లు మోహర్ సింగ్ మృతిపై పార్టీ పొలిట్ బ్యూరో సంతాపం వ్యక్తం చేసింది. విద్యార్థి కార్యకర్తగా రాజకీయ జీవితాన్ని ప్రారంభించిన మోహర్ సింగ్ హిమాచల్ ప్రదేశ్‌లో ప్రజా ఉద్యమాలను నిర్మించారని పొలిట్ బ్యూరో ఒక ప్రకటనలో గుర్తు చేసింది. హిమాచల్ ప్రదేశ్ రాష్ట్ర కమిటీ కార్యదర్శిగా 1991 నుంచి 2004 వరకూ మోహర్ సింగ్ కొనసాగారు. రాష్ట్రంలో ప్రముఖ నేతల్లో ఒకరుగా గుర్తింపు తెచ్చుకున్న ఆయన రాష్ట్రంలో పార్టీ విస్తరణలో కీలక పాత్ర పోషించారు. 1974లో పార్టీలో చేరిన మోహర్ సింగ్ 1977లో హోల్‌టైమర్‌గా మారారు. పార్టీ కేంద్ర కమిటీలో 1998 నుంచి 2005 వరకూ సభ్యులుగా ఉన్నారు. మోహర్ సింగ్ మృతితో ఒక విలువైన నాయకుడ్ని పార్టీ కోల్పోయిందని పొలిట్ బ్యూరో విచారం వ్యక్తం చేసింది. ఆయన కుటుంబ సభ్యులకు హృదయపూర్వక సానుభూతి తెలిపింది.

'పనిచేయని' ప్రభుత్వాన్ని కోరుకుంటున్నాయి

- ప్రతిపక్షాలపై మోడీ వ్యాఖ్యలు

న్యూఢిల్లీ : కేంద్రంలో పనిచేయని ప్రభుత్వాన్ని ప్రతిపక్ష పార్టీలు కోరుకుంటున్నాయని, బీజేపీ మాత్రం సంపూర్ణ అభివృద్ధి కోసం పనిచేసే ప్రభుత్వాన్ని కోరుకుంటుందని ప్రధాని నరేంద్ర మోడీ ఆరోపించారు. రెండు రోజుల బీజేపీ జాతీయ సమావేశాల్లో మోడీ మాట్లాడుతూ కాంగ్రెస్‌ను వ్యతిరేకిస్తూ ఏర్పడ్డ పార్టీలన్నీ ఇప్పుడు కాంగ్రెస్‌తో చేతులు కలుపుతున్నాయని అన్నారు. పనిచేయని ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయాలని ప్రతిపక్షపార్టీలన్నీ ఒక తాటిపైకి వస్తున్నాయని, బీజేపీ యేతర కూటమి ఒక విఫల ప్రయోగమని మోడీ వ్యాఖ్యానించారు. దేశ చరిత్రలో మొదటిసారిగా ఐదేండ్ల తమ ప్రభుత్వపాలనలో ఒక్క అవినీతి ఆరోపణ కూడా లేదని చెప్పారు. తాను గుజరాత్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు కేంద్రంలో యూపీఏ ప్రభుత్వం ఎన్ని వేధింపులకు పాల్పడినా, అమిత్‌షాను అరెస్టు చేసినా సీబీఐపై నిషేధం విధించలేదని, కానీ ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్, పశ్చిమ బెంగాల్, ఛత్తీస్‌ఘర్ ప్రభుత్వాలు సీబీఐపై నిషేధం విధించాయని మోడీ చెప్పారు. పేదరికం కారణంగా యువత అవకాశాలు కోల్పోకూడదనే అగ్రవర్ణాల్లోని పేదలకు 10 రిజర్వేషన్ల బిల్లును తీసుకుని వచ్చినట్లు మోడీ తెలిపారు.

సెలవుల్లోనూ ఎన్నికల విధులు

రాష్ట్ర ఎన్నికల కమిషనర్ నాగిరెడ్డి

- ఏర్పాట్లపై జిల్లా అధికారులతో సమీక్ష



అధికారులతో సమీక్షిస్తున్న నాగిరెడ్డి

నవతెలంగాణ- సిద్దిపేట ప్రతినిధి

సెలవుల దినాల్లోనూ ఎన్నికల విధులు నిర్వహించాలని రాష్ట్ర ఎన్నికల కమిషన్ నాగిరెడ్డి అధికారులకు సూచించారు. గ్రామ పంచాయతీ ఎన్నికల షెడ్యూల్ విడుదల కావడం, రెండో విడత ఎన్నికల నామినేషన్ ప్రక్రియ ప్రారంభమైన సందర్భంగా శనివారం సిద్దిపేట కలెక్టరేట్‌లో కలెక్టర్ కష్ణ భాస్కర్, పోలీస్ కమిషనర్ జోయల్ డేవిస్, జాయింట్ కలెక్టర్ పద్మాకర్, డీఆర్వో చంద్రశేఖర్‌తో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ పంచాయతీ ఎన్నికల ఏర్పాట్లను కలెక్టర్ కష్ణ భాస్కర్ వివరించారు. అనంతరం కలెక్టర్ కృష్ణభాస్కర్‌ను కమిషనర్ అభినందించారు. ప్రణాళిక ప్రకారం జిల్లాలో జరుగుతున్న ఎన్నికల ఏర్పాట్లపై నాగిరెడ్డి సంతృప్తి వ్యక్తం చేస్తూ ఇదే విధంగా ముందుకెళ్తూ ఎన్నికలు సజావుగా జరిగేలా చూడాలని జిల్లా యంత్రాంగానికి సూచించారు. ఎన్నికల సమయంలో సంక్రాంతి పండుగ రావడం వల్ల ఎలాంటి ఇబ్బందులు రాకుండా ప్రక్రియ కొనసాగేందుకు పలు ఆదేశాలు జారీ చేశారు. ప్రిసైడింగ్, అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులకు ప్రత్యేక శిక్షణ ఇవ్వాలని చెప్పారు. జిల్లాలో ఎన్నికలకు బ్యాలెట్ పేపర్స్ సరఫరా చేయడానికి, పోలింగ్ కేంద్రాల ఏర్పాటుకు తీసుకుంటున్న చర్యలు, పోలింగ్ పర్సన్స్, ఎన్నికల సామాగ్రి, అబ్జర్వర్స్, మోడల్ కోడ్ అఫ్ కండక్ట్, వాహన సదుపాయాలు, కౌంటింగ్‌కి సంబంధించిన ఏర్పాట్లపై రూపొందించిన ప్రణాళికను కలెక్టర్ కష్ణభాస్కర్ వివరించారు. కార్యక్రమంలో డీఈఓ రవికాంతరావు, బీసీ, ఎస్సీ వెల్ఫేర్ అధికారులు సరోజ, చరణ్‌దాస్, జిల్లా వ్యవసాయాధికారి శ్రవణ్‌కుమార్, సంబంధిత జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ఘనంగా టీఆర్ఎస్ ఎన్నారై సెల్ వార్షికోత్సవం..



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

టీఆర్ఎస్ ఎన్నారై సెల్ ఎనిమిదో వార్షికోత్సవం శనివారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ఆ పార్టీ ఎంపీ కల్వకుంట్ల కవిత ముఖ్య అతిథిగా హాజరయ్యారు. యూకే, యూఎస్‌లతో మొదలైన టీఆర్ఎస్ ఎన్నారై శాఖలు ఇప్పుడు 33 దేశాలకు విస్తరించాయని ఆమె ఈ సందర్భంగా చెప్పారు. రానున్న రోజుల్లో 100 శాఖలను ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఈ ప్రక్రియలో ఎన్నారై టీఆర్ఎస్ కో-ఆర్డినేటర్ మహేశ్ బిగాలతోపాటు ఇతర దేశాల్లో ఉన్న పార్టీ కార్యకర్తలు క్రియాశీలక పాత్ర పోషిస్తున్నారని చెప్పారు. ఉద్యమ సమయంలో ప్రొఫెసర్ జయశంకర్.. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు ఆవశ్యకతను ఎన్ఆర్ఐలకు వివరించారని తెలిపారు. ఆయన సూచనలతో విదేశాల్లో ఉండే తెలంగాణ బిడ్డలు వివిధ పేర్లతో సంఘాలు ఏర్పాటు చేశారని చెప్పారు. ఆ సమయంలో రకరకాల అవమానాలు, అవహేళనలను వారు ఎదుర్కొన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆ తర్వాత ఎంతో పట్టుదలతో పోరాడి తెలంగాణ సాధించుకున్నాం.. టీఆర్ఎస్ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసుకున్నామని చెప్పారు. కేసీఆర్ నాయకత్వంలో రెండోసారి కూడా అధికారాన్ని కైవసం చేసుకున్నామని తెలిపారు. మున్ముందు కూడా ఇదే స్ఫూర్తితో పని చేయాలని ఆమె పిలుపునిచ్చారు.

ప్రభుత్వ నిర్బంధాన్ని తిప్పికొట్టాలి

ప్రజాస్వామ్యవాదులకు టీడీఎఫ్ పిలుపు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ప్రజాఉద్యమాలపై ప్రభుత్వం నిర్బంధాన్ని ప్రయోగిస్తుందని, ఆ ప్రయత్నాలు తిప్పికొట్టాలని తెలంగాణ ప్రజాస్వామిక వేదిక (టీడీఎఫ్) ప్రజాస్వామ్యవాదులకు పిలుపునిచ్చింది. ఈమేరకు శనివారం ప్రజాస్వామిక వేదిక నేతలు అచ్యుతారామారావు, సంధ్య, చిక్కుడు ప్రభాకర్, కోట శ్రీనివాస్,నల్లమాస కృష్ణ తదితరులు ఒక ప్రకటన విడుదల చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై గళమెత్తున్న రచయితలు, ఉపన్యాసకులు, ఉద్యమకారులపై తప్పుడు కేసులు ప్రయోగిస్తుందన్నాయని పేర్కొన్నారు. ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలపై దశలవారీగా ఆందోళనలు నిర్వహిస్తామని చెప్పారు.

కేంద్ర ప్రభుత్వ విధానాలతో ఆదివాసీలకు తీవ్రనష్టం


త్రిపుర ఎంపీ జితేంద్ర చౌదరి



జంగారెడ్డిగూడెం: కేంద్ర ప్రభుత్వం అవలంభిస్తున్న విధానాల వల్ల ఆదివాసీ, గిరిజన తెగలకు తీవ్రనష్టం వాటిల్లుతోందని ఆదివాసీ అధికార్ రాష్ట్రమంచ్ జాతీయ కన్వీనర్, త్రిపుర ఎంపీ జితేంద్ర చౌదరి విమర్శించారు. పశ్చిమగోదావరి జిల్లా బుట్టాయగూడెం మండల కేంద్రంలో నిర్మించిన ఆదివాసీ విజ్ఞానకేంద్రాన్ని ఆయన శనివారం ప్రారంభించారు. గిరిజన సంఘ కార్యాలయాన్ని ఏపీ గిరిజన సంఘం రాష్ట్ర నాయకులు మంతెన సీతారాం, ఉచిత వైద్యశిబిరాన్ని సీఐటీయూ రాష్ట్ర నాయకులు చింతకాయల బాబూరావు ప్రారంభించారు. మాజీ ఎంపీ మిడియం బాబూరావు గిరిజన సంఘం పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో జితేంద్రచౌదరి మాట్లాడుతూ దేశంలో ఆదివాసీల జీవనం, సంస్కృతి, ఆచారాల పరిరక్షణలో కేంద్రం తీవ్ర నిర్లక్ష్యం కనబరుస్తోందని విమర్శించారు. గిరిజన, ఆదివాసీలున్న కొద్ది రాష్ట్రాల్లోనే వారి అభివృద్ధికి, సంక్షేమానికి ప్రత్యేక నిధులున్నా, వాటిని వినియోగించడంలో కేంద్రంతోపాటు రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లిప్తంగా వ్యవహరిస్తున్నాయన్నారు. ఆదివాసీల భాష, సంస్కృతి అభివృద్ధి జరిగితే వారి జీవన విధానం మారుతుందన్నారు. ఆదివాసీల అభివృద్ధిలో విద్య, వైద్యంతోపాటు సంప్రదాయాల పరిరక్షణ ముఖ్యమన్నారు. త్రిపుర రాష్ట్రం దేశంలోనే అతితక్కువ జనాభా కలిగి, వైశాల్యం తక్కువ ఉన్నా గత ఎల్‌డీఎఫ్ ప్రభుత్వ హయాంలో ఆదివాసీల విద్య, వైద్యంపై ప్రత్యేక దృష్టి సారించారన్నారు. త్రిపురలో త్రిపురి తెగవారు అత్యధికంగా ఉన్నారన్నారు. బ్రిటీషు వారికంటే ముందు 1300 సంవత్సరాలు పాలించిన రాజులు, జమీందారులకు వ్యతిరేకంగా భాషాభివృద్ధి కోసం జనవిముక్తి పరిషత్ ఆధ్వర్యాన ఆందోళనలు జరిగాయన్నారు. అన్ని రాష్ట్రాల్లో ఐదో షెడ్యూలు అమలవుతుంటే త్రిపుర రాష్ట్రంలో ఆరో షెడ్యూలు అమలవుతుందన్నారు. ఈ ఆరో షెడ్యూల్ వల్ల ఆదివాసీల భూపరిరక్షణ, స్వయంపాలన జరుగుతుందన్నారు. ఆదివాసీలలో ఉన్న మూఢ నమ్మకాలను పోగొట్టేలా, విద్య, వైద్యం విషయంలో వెనుకబాటు లేకుండా ఎల్‌డీఎఫ్ ప్రభుత్వం శ్రద్ధ తీసుకుందని చెప్పారు. త్రిపురలో వీహెచ్‌పీ, భజరంగదళ్, వనవాసీ కల్యాణ పరిషత్ పేరుతో ఆర్ఎస్ఎస్, బీజేపీ ఆదివాసీల మనుగడకు ముప్పు తెస్తున్నాయన్నారు. ఆదివాసీలకు సబ్‌ప్లాన్ నిధులు జనాభా ప్రాతిపదికన అమలు చేయాల్సి ఉండగా, ప్రభుత్వాలు సక్రమంగా వినియోగించడం లేదని చెప్పారు. దేశవ్యాప్తంగా ఆదివాసీల మనుగడను దెబ్బతీసేలా ఉన్న ప్రభుత్వాల విధానాలపై ఆందోళనలతోపాటు, విద్య, వైద్యం, ఉపాధి వంటి సామాజిక కార్యక్రమాల్లో ఆదివాసీ విజ్ఞానకేంద్రం మరింత అభివృద్ధి కావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి తెల్లం రామకృష్ణ, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి ఎ.రవి, పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

పిడుగురాళ్లలో జనం పరుగులు

- స్వల్పంగా భూ ప్రకంపనలతో బెంబేలు
- రెండుగంటల వ్యవధిలో నాలుగుసార్లు



గుంటూరు: గుంటూరు జిల్లా పిడుగురాళ్ల పట్టణంలో స్వల్ప భూ ప్రకంపనలతో ప్రజలు బెంబేలెత్తిపోయారు. పలు ప్రాంతాల ప్రజలు భయాందోళనకు గురై ఇండ్ల నుండి బయటకు పరుగులు తీశారు. రెండు గంటల వ్యవధిలోనే నాలుగు సార్లు ప్రకంపనలు రావడంతో ప్రజలు కలవరపాటుకు గురయ్యారు. విషయం తెలుసుకున్న స్థానిక మున్సిపల్ కమిషనర్ కాసు శివరామిరెడ్డి, సీఐ వీరేంద్రబాబు, తహశీల్దార్ కె.రవిబాబు, పోలీసులు లెనిన్‌నగర్, స్వర్ణ పిచ్చయ్య కాలనీలను సందర్శించి ప్రజలకు భయపడాల్సిందేమీ లేదని ధైర్యం చెప్పారు. మధ్యాహ్నం 3.30 గంటలకు ఒకసారి, 3.55 గంటలకు రెండోసారి, 4.29 గంటలకు మూడోసారి, 4.55 గంటలకు నాల్గోసారి స్వల్ప తీవ్రతతో భూమి కంపించిందని తెలిపారు. ప్రకంపనల కాల వ్యవధి మూడు నుంచి తొమ్మిది సెకన్ల పాటే ఉందన్నారు. అయితే కంపనల తీవ్రత పెరిగితే అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఇప్పటికీ స్థానికులు ఇళ్లల్లో భయంభయంగానే గడుపుతున్నారు. క్వారీ పేలుళ్లే ఇందుకు కారణమని కొందరంటున్నా అధికారులు దీన్ని కొట్టిపారేస్తున్నారు.

జగన్‌పై దాడి కేసు నిందితుడిని హైదరాబాద్‌కు తరలించిన ఎన్ఐఎ

అమరావతి : ప్రతిపక్షనేత జగన్‌పై దాడి చేసిన నిందితుడు శ్రీనివాస్‌ను ఎన్ఐఎ అధికారులు శనివారం విజయవాడ సబ్ జైలు నుంచి హైదరాబాద్‌కు తరలించారు. ఇంతకు ముందు నిందితుడికి స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్య పరీక్షలు నిర్వహించారు. తరలింపు సందర్భంగా సబ్ జైలు వద్ద స్పెషల్ పార్టీ పోలీసులు బందోబస్తు నిర్వహించారు. నిందితుడు శ్రీనివాసరావును ఎక్కడికి తీసుకెళ్లారో సమాచారమివ్వాలని విజయవాడ సెషన్స్ కోర్టులో న్యాయవాధి సలీం పిటీషన్ దాఖలు చేశారు. మెట్రోపాలిటన్ కోర్టు పిటిషన్‌ను విచారణకు స్వీకరించింది. నిందితుడి తరపు న్యాయవాదికి సమాచారమివ్వాలని ఎన్ఐఎకు కోర్టు ఆదేశాలు జారీ చేసింది. న్యాయవాదుల సమక్షంలో విచారణ జరపాలని కోర్టు పునరుద్ఘాటించింది. వారం రోజులపాటు విచారించిన అనంతరం తిరిగి విజయవాడ జైలుకు రిమాండ్ ఖైదీగా నిందితుడు శ్రీనివాస్‌ను హాజరుపరచనున్నారు.

పదవుల కోసం పాట్లు

కాంగ్రెస్‌లో రాజకీయ వేడి

- 16న సీఎల్పీ భేటీ
- ఆ రెండింటికి తీవ్ర పోటీ
- లోక్‌సభ టికెట్ల కోసం పైరవీలు
- తెరపైకి పీసీసీ నేత మార్పు




నవతెలంగాణబ్యూరో -హైదరాబాద్

కాంగ్రెస్ పార్టీలో మళ్లీ పదవుల వేడి రాజుకుంది. అధికారిక పదవులు, పార్టీ పదవులు, పార్లమెంటు టికెట్ల కోసం పడరాని పాట్లు పడుతున్నారు. కొంత మంది అధిష్టానం పెద్దలతో మంతనాలు జరుపుతున్నారు. మరికొంత మంది పైరవీలు మొదలు పెట్టారు. సీఎల్పీ, పీఏసీ చైర్మెన్ పదవుల కోసం కొందరు, పార్లమెంటు సీట్ల కోసం మరికొంత మంది ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నారు. శాసనసభలో కీలకమైన పదవుల కోసం నేతల మధ్య పోటీ తీవ్రంగా నెలకొంది. ఈ నెల 17న అసెంబ్లీ సమావేశాలు ప్రారంభమవుతుండటంతో ఆ లోపు సీఎల్పీ నేత, ప్రజా పద్దుల సంఘం చైర్మెన్ (పీఏసీ) ఎంపిక ప్రక్రియను పూర్తి చేయాల్సి ఉంది. అందుకు కాంగ్రెస్ అధిష్టానం కసరత్తు ప్రారంభించింది. సీఎల్పీ నేత, పీఏసీ చైర్మెన్ పదవులకు అభ్యర్థుల ఎంపిక బాధ్యతను ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్‌కు అప్పగించినట్టు తెలిసింది. శాసనసభ సమావేశాలకు ముందు ఈ నెల 16న కాంగ్రెస్ శాసనసభాపక్ష సమావేశం జరగనుంది. ఈ సమావేశంలో శాసన సభాపక్ష నేత, ప్రజాపద్దుల కమిటీ చైర్మెన్‌ను ఎంపిక చేయాలని కాంగ్రెస్ అధిష్టానం ఆదేశించినట్టు తెలిసింది. సీఎల్పీ సమావేశం దగ్గర పడుతుండటంతో ఆ రెండు కీలక పదవులను దక్కించుకోవడానికి నేతలు ఎవరికి వారు పైరవీలు కోసం చేస్తున్నారు. సీఎల్పీ నేత పదవి కోసం మల్లు భట్టి విక్రమార్క, దుద్దిళ్ల శ్రీధర్ బాబు, గండ్ర వెంకటరమణారెడ్డి, తూర్పు జయప్రకాశ్‌రెడ్డి గట్టి ప్రయత్నాలు చేస్తు న్నట్టు తెలుస్తోంది. ఆ పదవి దక్కకపోయినా ప్రజాపద్దుల కమిటీ చైర్మెన్‌గా అవకా శం ఇవ్వాలని శ్రీధర్‌బాబు అధిష్టానాన్ని అడిగినట్టు గాంధీ భవన్ వర్గాలు తెలిపా యి. పీఏసీ చైర్మెన్ పదవి కోసం మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి కూడా పోటీ పడుతున్నట్టు ఆ వర్గాలు చెప్పాయి. ఓటమికి బాధ్యత వహించి పీసీసీ పదవికి రాజీనామా చేయాలని కొందరు పార్టీ నేతలు డిమాండ్ చేస్తుండటంతో ఉత్తమ్ ఆ పదవి నుంచి తప్పుకుంటే సీఎల్పీ నేతగా ఉత్తమ్ అవుతారనే ప్రచారం జరుగుతున్నది.

పార్లమెంటుపై యువత ఆసక్తి

ముందస్తు ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేతలంతా మట్టికరిచారు. దీంతో ఓడిపోయిన నేతలకు టికెట్లు ఇవ్వకూడదన్న చర్చ మొదలైంది. అందులో కాంగ్రెస్ యువ నేతలు బలంగా కోరుతున్నారు. సీనియర్లకు ఇవ్వకపోతే పోటీ చేస్తామని ఆసక్తికనబరుస్తున్నారు. యువతను ప్రోత్సహించినట్టవుతుందని, కొత్త వారికి టికెట్లు ఇచ్చినట్టవుతుందని చెబుతున్నారు. లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులను ఫిబ్రవరిలోనే ప్రకటించే యోచనలో కాంగ్రెస్ అధిష్ఠానం ఉండటంతో రాష్ట్రంలోని సీనియర్ నేతలతోపాటు యువనేతలు సైతం ప్రయత్నాలు చేస్తున్నారు. మరోవైపు పీసీసీ అధ్యక్ష పదవి నుంచి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తప్పుకొంటే ఆ బాధ్యతలు చేపట్టేందుకు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి సిద్ధంగా ఉన్నట్టు సమాచారం. రాష్ట్రంలోని 17 స్థానాలకు పోటీ చేసే అభ్యర్థులను ఫిబ్రవరిలోనే కాంగ్రెస్ అధిష్టానం ప్రకటించే అవకాశం ఉండటంతో పార్టీలోని సీనియర్లు, యువ నేతలంతా టికెట్లు దక్కించుకోవడానికి ప్రయత్నాలు చేస్తున్నారు. ఖమ్మం, మహబూబాబాద్, నల్లగొండ, భువనగిరి టికెట్ల కోసం ఎక్కువగా పోటీ పడుతున్నట్టు పార్టీ వర్గాలు అంటున్నాయి. ఖమ్మం ఎంపీ స్థానం కోసం కాంగ్రెస్ సీనియర్ నేత రేణుకా చౌదరి పావులు కదుపుతున్నారు. పొత్తుల్లో భాగంగా తమకు ఇవ్వాలని టీడీపీ కోరుతున్నట్టు తెలుస్తోంది. ఎస్టీ రిజర్వు నియోజకవర్గమైన మహబూబాబాద్ సీటుకోసం ఎక్కువమంది ఆశావాహులు పోటీ పడుతున్నారు. కేంద్ర మాజీ మంత్రి రవీంద్రనాయక్, ఎమ్మెల్సీ రాములునాయక్‌లతోపాటు ద్వితీయ శ్రేణి నేతలు కూడా కొందరు ఆశిస్తున్నట్టు తెలిసింది. భువనగిరి సీటు తమకేనని కొంత కాలంగా పీసీసీ కోశాధికారి గూడూరు నారాయణరెడ్డితోపాటు ఏఐసీసీ కార్య దర్శి మధుయాష్కీ గట్టిగా ప్రయత్నాలు చేస్తున్నారు. ఇటీవల అసెంబ్లీ ఎన్నిక ల్లో ఓటమిపాలైన మాజీ మంత్రులు కోమటిరెడ్డి వెంకటరెడ్డి, కె జానారెడ్డి నల్ల గొండ లోక్‌సభ సీటు కావాలని కోరుతున్నట్టు సమాచారం. పెద్దపల్లి నుంచి డాక్టర్ సత్యనారాయణ, ఆదిలాబాద్ నుంచి నరేష్‌జాదవ్, నాగర్‌కర్నూల్ నుం చి మల్లు రవి లేదా సంపత్‌కుమార్, సతీష్‌మాదిగ పేర్లు వినిపిస్తున్నాయి.

కేరళలో 11 నవలల్ని అనువదించిన భవన నిర్మాణ కార్మికుడు




తిరువనంతపురం: కేరళలో భవన నిర్మాణ కార్మికుడు (సుతారికి సహాయకుడు) 11 నవలల్ని తమిళం నుంచి మలయాళంలోకి అనువదించి రికార్డు సృష్టించారు. కన్నూర్ జిల్లాకు చెందిన మహ్మద్‌షఫీ(56) ఉదయం పనికి వెళ్తూ రాత్రివేళ అనువాదం చేసేవారు. గత పదేండ్లలో 11 నవలలు, 4 కథా సంపుటాలను షఫీ అనువదించారు. షఫీ తండ్రి చేపల వ్యాపారి. పదో తరగతి ఫెయిల్ కావడంతో చదువు మధ్యలోనే మానేసిన షఫీ సాహిత్యం పట్ల అనురక్తితో రెండు భాషల్లోనూ ప్రావీణ్యత సాధించడం అందరినీ ఆశ్చర్యపరుస్తోంది.

అసెంబ్లీ ఎన్నికలపై అనుమానం ఉన్నది

ఎన్నికల అధికారిపై రాష్ట్రపతికి ఫిర్యాదు చేస్తాం

- కాంగ్రెస్‌లో విలీనం ప్రసక్తే లేదు: తెలంగాణ జనసమితి అధ్యక్షులు కోదండరామ్



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో ఎన్నికల అధికారిపై కోదండరామ్ అనుమానం వ్యక్తం చేశారు. ఓట్ల తొలగింపుపై ఎవరు బాధ్యత వహించాలని ప్రశ్నించారు. రాష్ట్ర ఎన్నికల అధికారిపై రాష్ట్రపతికి, కేంద్ర ఎన్నికల సంఘానికి పిర్యాదు చేస్తామన్నారు. సీబీసీఐడీతో ఎన్నికల అధికారిపై విచారణకు ఆదేశించాలని కేంద్ర ఎన్నికల కమిషన్‌ను డిమాండ్ చేశారు. ఎన్నికల ముందు రజత్ కుమార్ ఆస్తులు.. ప్రస్తుత ఆస్తులపై ఖచ్చితంగా విచారణ జరపాలని డిమాండ్ చేశారు. లోక్‌సభ ఎన్నికలు, పొత్తులు, ప్రస్తుత రాజకీయ పరిస్థితులపై శనివారం మీడియాతో కోదండరామ్ చిట్‌చాట్ నిర్వహించారు. కూటమిగా లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేయాలా వద్దా అనే విషయంపై కూడా చర్చ జరగలేదన్నారు. రానున్న ఎన్నికలపై తమ పార్టీకంటూ అంతర్గతంగా ఓ ఆలోచన ఉందన్నారు. తమ పార్టీ ఎట్టి పరిస్థితిల్లోనూ కాంగ్రెస్‌లో విలీనం కాదని స్పష్టం చేశారు. శాసనసభ ఎన్నికల్లో ఓటమితో తాము నిరాశ చెందలేదని.. రానున్న ఎన్నికలకు సిద్ధంగా ఉన్నామన్నారు. పార్టీ పెట్టిన కొద్ది నెలల్లోనే ఎన్నికలు రావడం ఓటమి చెందినట్లు భావిస్తున్నామన్నారు. పంచాయతీ ఎన్నికల్లో తమ పార్టీ తరపున నామినేషన్లు వేస్తున్నారని చెప్పారు. భారతదేశంలో స్పీకర్ వ్యవస్థ ఇంకా బాగా పటిష్ఠం కావాల్సినవసరం ఉందన్నారు. సచివాలయాన్ని కాదని.. ఎక్కడ నుంచైనా పని చేయొచ్చనే భావన నేటి పాలకుల్లో ఏర్పడిందన్నారు. గత అనుభవాలనుంచి కూటమి పాఠాలు నేర్వాలి. కాంగ్రెస్ పార్టీ అంతర్గత వ్యవహారంపై మేము స్పందించనవసరం లేదన్నారు. పంచాయతీ ఎన్నికల్లో బీసీల రిజర్వేషన్లు తగ్గించటం సరైంది కాదన్నారు. ప్రయివేటు రంగంలో స్థానికులకే అవకాశాలు ఇవ్వాలని సూచించారు. గ్రామ పంచాయితీ లకు నిధులు కేటాయించాలన్నారు. సర్పంచ్‌లకు శిక్షణతో పాటు నిధులు, విధులు ఇవ్వాలని అన్నారు. 'కేంద్రం అగ్రకుల పేదలకు 10 శాతం రిజర్వేషన్‌లు పెంచి.. 50 శాతం దాటి రిజర్వేషన్లు పెంచుకోవచ్చు' అని కేంద్రం చెప్పినట్టే కదా అన్నారు.

ఎస్ఐ, కానిస్టేబుల్ దేహదారుఢ్య పరీక్షలు

ఎదురు చూస్తున్న వేలాది మంది అభ్యర్థులు

- ఈ నెల 21 తర్వాతే నిర్ణయం

నవ తెలంగాణ- ప్రత్యేక ప్రతినిధి

రాష్ట్రంలో ఎస్ఐ, కానిస్టేబుల్ పోస్టుల కోసం జరుగవలసిన దేహదారుఢ్య పరీక్షలు ఎప్పుడెప్పుడా అని వేలాది మంది అభ్యర్థులు ఎదురు చూస్తున్నారు. గతేడాదిలో జరిగిన ఎస్ఐ, కానిస్టేబుల్ పోస్టుల అర్హతా పరీక్షలో దాదాపు మూడు లక్షలకు పైగా అభ్యర్థులు నెగ్గారు. వారిలో రెండు లక్షలకు పైగా కానిస్టేబుల్ అభ్యర్థులుండగా, మరో లక్ష మంది వరకు ఎస్ఐ అభ్యర్థులున్నారు. కాగా వీరందరికి గత ఆగస్టు నెలలోనే దేహదారుఢ్య పరీక్షలు నిర్వహించాలని టీఎస్ఎల్‌పీఆర్‌బీ అధికారులు భావించారు. ఆ సమయంలోనే ముందస్తు ఎన్నికలకు సంబంధించిన సంకేతాలు ఇచ్చిన టీఆర్ఎస్ సర్కారు సెప్టెంబర్‌లో నగారాను మోగించడంతో ఎస్ఐ, కానిస్టేబుల్ నియామకాల ప్రక్రియకు బ్రేకు పడింది. ఇక డిసెంబర్ 7 నాటికి రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికల ప్రక్రియ ముగిసి ఫలితాలు ప్రకటించిన తర్వాత డిసెంబర్ 17వ తేదీ నుంచి ఎస్ఐ, కానిస్టేబుల్ అభ్యర్థులకు దేహదారుఢ్య పరీక్షలు ప్రారంభమవుతాయని రిక్రూట్‌మెంట్ బోర్డు చైర్మెన్ వీవీ శ్రీనివాస్‌రావు ప్రకటించారు. ఈ మధ్యలోనే జరిగిన ఎస్ఐ, కానిస్టేబుల్ పోస్టుల అర్హతా పరీక్షలో ఇంగ్లీష్ అంశాలపై ఇచ్చిన ప్రశ్నలు పూర్తిగా అవుట్ ఆఫ్ ది సిలబస్‌గా ఉన్నాయని, వాటిపై నిపుణుల కమిటీతో పరిశీలన జరిపించి అభ్యర్థులకు న్యాయం చేయాలంటు హైకోర్టులో పిటిషన్ దాఖలు కావడం, దానిపై స్పందించిన కోర్టు కౌంటర్‌ను దాఖలు చేయాలని బోర్డును ఆదేశించడంతో దేహదారుఢ్య పరీక్షలకు బ్రేకు పడింది. అప్పటికే కానిస్టేబుల్ పోస్టులకు సంబంధించి జరిగిన రాత పరీక్షలో కొన్ని ప్రశ్నలపై వచ్చిన అభ్యంతరాలు సరైనవిగా తేల్చిన బోర్డు ఆ మేరకు దాదాపు 14 మార్కుల వరకు అభ్యర్థులకు ఊరట నిచ్చే నిర్ణయం తీసుకున్నది. దీంతో అర్హతా పరిక్షలో పాసైన వారి సంఖ్య రెండు లక్షలు దాటింది. అయితే ఇంకా ఇంగ్లీష్‌కు సంబంధించి ఇచ్చిన ప్రశ్నావళి అత్యంత గొట్టుగా ఉన్నదని, అక్కడ కూడా అన్యాయం జరిగిందంటూ దాఖలైన పిటిషన్‌పై హైకోర్టు కౌంటర్ వేయాలని ఇచ్చిన ఆదేశాల మేరకు తమ తరఫు వాదనను వినిపిస్తూ బోర్డు అధికారులు కౌంటర్ వేశారు. అనంతరం సంక్రాంతి సెలవులు రావడంతో ఈ పిటిషన్‌లపై వాదనలు వాయిదా పడ్డాయి. ఇక 21వ తేదీన కోర్టు కార్యకలాపాలు ప్రారంభమవుతాయి. ఆ తర్వాతే దాఖలైన పిటిషన్‌పై వాద ప్రతివాదనలు సాగి హైకోర్టు నుంచి ఒక నిర్ణయం వెలువడే అవకాశాలు ఉన్నాయి. అయితే అర్హతా పరీక్షలో నెగ్గిన అభ్యర్థులు దేహదారుఢ్య పరీక్షల కోసం అవసరమైన శిక్షణను పొందుతున్నారు. గతేడాది 17 నాటికి ఈ పరీక్ష కోసం సిద్ధమైన అభ్యర్థులకు వాయిదా పడినట్టు తెలియగానే కొంత నిరాశ చెందారు. ఇక తిరిగి ఎప్పుడు ఈ పరీక్ష తేదీలను రిక్రూట్‌మెంట్ బోర్డు ప్రకటిస్తుందా అని వేలాది మంది ఎస్ఐ, కానిస్టేబుల్ అభ్యర్థులు ఎదురు చూస్తున్నారు. బోర్డు అధికారులు సైతం తాము ఈ పరీక్షలు నిర్వహించడానికి సిద్ధంగా ఉన్నామని, హైకోర్టు నుంచి తుది ఆదేశాల కోసం ఎదురు చూస్తున్నామని చెప్తుతున్నారు.

పారిస్‌లో పేలుడు

నలుగురు మృతి, పలువురికి గాయాలు



పారిస్ : సెంట్రల్ పారిస్‌లోని బేకరీ వద్ద శనివారం జరిగిన పేలుడులో నలుగురు మృతి చెందారు. గ్యాస్ లీక్ వల్ల పేలుడు సంభవించి వుంటుందని పోలీసులు అనుమానిస్తున్నారు. పారిస్‌లోని గ్రాండ్స్ బోలెవార్డ్స్ జిల్లాలోని రూ ట్రెవైజ్ వద్ద గల బేకరీ ఉదయం 9గంటల సమయంలో పేలుడు సంభవించింది. వెంటనే మంటలు సమీప భవనాలకు కూడా వ్యాపించాయి. పేలుడు ధాటికి బేకరీ గ్రౌండ్ ఫ్లోర్ పూర్తిగా నేలమట్టమైంది. ఆ ప్రాంతమంతా శిధిలాలు చెల్లాచెదురుగా కనిపిస్తున్నాయి. ఈ ప్రమాదంలో 36 మందికి గాయాలవ్వగా..వారిలో 12 మంది పరిస్థితి విషమంగా ఉన్నట్టు అధికార వర్గాలు తెలిపాయి. అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపులోకి తెచ్చేప్రయత్నాలు జరుగుతున్నాయి. బేకరీ, చుట్టుపక్కల భవనాలు బాగా దెబ్బతిన్నట్టు సోషల్ మీడియా చిత్రాల ద్వారా తెలుస్తోంది. ఈ పేలుడుకు సంబంధించి అధికార సమాచారం ఇంకా తెలియాల్సి వుంది. కాగా గత 9 రోజులుగా జరుగుతున్న ఆందోళనల నేపథ్యంలో పోలీసు యంత్రాంగం అప్రమత్తంగా ఉన్నది. ప్రస్తుతం పరిస్థితి అదుపులో ఉన్నదని హోం మంత్రి క్రిస్టోఫ్ తెలిపారు. 200మంది మంటలతో పోరాడుతున్నారని చెప్పారు. అయితే ఈ పేలుళ్ల వెనుక ఉగ్రకుట్ర ఉన్నదా..అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నట్టు అధికారులు తెలిపారు.

అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో పోటీ చేస్తా

- డెమోక్రాట్ ప్రతినిధి తులసి గబ్బర్డ్



వాషింగ్టన్ : వచ్చే అధ్యక్ష ఎన్నికల్లో పోటీ చేస్తానని డెమోక్రటిక్ పార్టీ ప్రతినిధి, అమెరికా కాంగ్రెస్‌లో మొట్టమొదటి హిందూ సభ్యురాలు తులసి గబ్బర్డ్ తెలిపారు. వచ్చే వారం దీనిపై లాంఛనప్రాయంగా ఒక ప్రకటన చేయాలని నిర్ణయించినట్లు ఆమె చెప్పారు. ఇరాక్ యుద్ధంలో పాల్గొన్న, ప్రస్తుతం విదేశీ వ్యవహారాల కమిటీలో పనిచేస్తున్న 37ఏండ్ల గబ్బర్డ్ మాట్లాడుతూ, తన ఎన్నికల ప్రచారంలో యుద్ధం, శాంతి ప్రధాన అంశాలుగా వుంటాయన్నారు. అమెరికన్లు ఎదుర్కొంటున్న పలు సవాళ్ళు తనను చాలా ఆందోళనకు గురి చేస్తున్నాయని అన్నారు. వాటిని పరిష్కరించడంలో తాను సాయపడాలని భావిస్తున్నట్లు చెప్పారు. అందరికీ ఆరోగ్య సంరక్షణ, క్రిమినల్ జస్టిస్ సంస్కరణలు, వాతావరణ మార్పులు వంటి పలు అంశాలను ఆమె ప్రస్తావించారు. కాగా దీనిపై డెమోక్రాట్ కార్యాలయం వెంటనే స్పందించలేదు. గబ్బర్డ్ సహాయకుడు రానియా బాట్రిస్ ఆమె ఎన్నికల ప్రచార బాధ్యతలను నిర్వర్తిస్తారు. దక్షిణ పసిఫిక్ మహాసముద్రంలోని దీవి అమెరికన్ సమోవాలో జన్మించిన తులసి తల్లి కరోల్ పోర్టర్ హిందూ మతాన్ని ఇష్టపడేవారు. టీనేజరుగా వున్నపుడు తులసి కూడా హిందూ మతంలోకి మారారు.

ఇద్దరు కొరియా మహిళల నుంచి
24 కిలోల బంగారం పట్టివేత



చెన్నై: దక్షిణ కొరియాకు చెందిన ఇద్దరు మహిళలు అక్రమంగా 24 కిలోల బంగారాన్ని అక్రమంగా రవాణా చేస్తూ కస్టమ్స్ అధికారులకు దొరికిపోయిన సంఘటన చెన్నై అంతర్జాతీయ విమానాశ్రయంలో జరిగింది. ఆ బంగారం విలువ రూ.8 కోట్ల వరకూ ఉంటుం దని విమానాశ్రయ అధికారులు తెలిపా రు. అధిక బరువుతో ఇద్దరు మహిళ లు అనుమానాస్పదంగా తిరుగుతుం డటంలో ఎయిర్ ఇంటె లిజెన్స్ విభా గానికి చెందిన కస్టమ్స్ అధికారులు తనిఖీలు చేపట్టి వీరి గుట్టురట్టు చేశారు. 12 కేజీల బరువున్న రెండు బంగారు కడ్డీలను వీరివద్ద నుంచి స్వాధీనం చేసుకు న్నారు. వీరిని రిపబ్లిక్ ఆఫ్ కొరి యాకు చెందిన హంబై యుల్‌జంగ్ (26),ఎన్ యంగ్ కిమ్ (26)గా గుర్తించారు. ఈ ఇద్దరూ హాంకాంగ్ నుంచి చెన్నైకు వచ్చారు. ఈ బంగారాన్ని ఎక్కడి నుంచితెచ్చారు..ఎక్కడికి తరలిస్తు న్నారనే అంశాలపై అధికారులు దర్యాప్తు చేపట్టారు.

ట్రంప్‌పై 2017లోనే దర్యాప్తు ఆరంభం

న్యూయార్క్ టైమ్స్ కథనం



వాషింగ్టన్ : అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ రష్యా తరపున పనిచేస్తున్నారా లేదా అని నిర్ధారించేందుకు ఫెడరల్ బ్యూరో ఆఫ్ ఇన్విస్టిగేషన్ (ఎఫ్‌బిఐ) 2017లోనే విచారణ ప్రారంభించిందని న్యూయార్క్ టైమ్స్ తెలిపింది. 2017 మేలో ఎఫ్‌బిఐ డైరెక్టర్‌గా జేమ్స్ కామేను అధ్యక్షుడు తొలగించిన వెంటనే ఈ దర్యాప్తు ఆరంభమైంది. ఈ దర్యాప్తులో ప్రధానంగా రెండు అంశాలు వున్నాయి. ఒకటి ట్రంప్ కార్యకలాపాలపై నిఘా విధించడం, రెండవది క్రిమినల్ కోణం వుందా లేదా అని నిర్ధారించడం ఈ దర్యాప్తులో ముఖ్యమైన భాగం. ట్రంప్ తెలిసి కానీ తెలియక కానీ అమెరికా ప్రయోజనాలకు వ్యతిరేకంగా రష్యా తరపున పనిచేస్తున్నారా లేదా అలాగే ట్రంప్ దేశ భద్రతకు ముప్పుగా పరిణమిస్తున్నారా లేదా అని విచారించడం ఇందులో కీలకమని న్యూయార్క్ టైమ్స్ పేర్కొంది. కామేను తొలగిస్తూ ట్రంప్ తీసుకున్న చర్య వెనుక క్రిమినల్ కోణం వుందా అనేది కూడా విచారిస్తున్నారు. 2016 ఎన్నికల ప్రచారం సందర్భంగా రష్యాతో ట్రంప్‌కు సంబంధాలు వున్నాయని ఎఫ్‌బిఐ అనుమానిస్తోంది. కాగా రాబర్ట్ ముల్లార్ సాగిస్తున్న దర్యాప్తును తనను 'వెంటాడి వేధించడం'గా ట్రంప్ విమర్శిస్తున్నారు. అధ్యక్షుడిగా తనకు గల చట్టబద్ధతపై ఇదొక మరక వంటిదని వ్యాఖ్యానిస్తున్నారు. అసలు ఈ దర్యాప్తు నిరాధారమైనదని ఆయన పేర్కొంటున్నారు. అయినా ముల్లార్ దర్యాప్తు కొనసాగుతోంది.

తూర్పు గాజాలో ఘర్షణలు

- పలువురు పాలస్తీనియన్లకు గాయాలు



గాజా : తూర్పు గాజాలో వందలాదిమంది పాలస్తీనా ప్రదర్శకులు, ఇజ్రాయిల్ సైనికుల మధ్య శుక్రవారం మధ్యాహ్నం ఘర్షణలు చెలరేగాయని ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. ఇజ్రాయిల్ సరిహద్దుకు సమీపంలో వున్న ఈ ప్రాంతంలో ఇజ్రాయిల్ సైనికుల తూటాలకు, రబ్బర్ బుల్లెట్లకు, బాష్పవాయు గోళాలకు అనేకమంది పాలస్తీనియన్లు గాయపడ్డారని వారు తెలిపారు. గతేడాది మార్చి నుండి ప్రతి వారం జరుగుతున్న ఇజ్రాయిల్ వ్యతిరేక ప్రదర్శనల్లో భాగంగా శుక్రవారం నాటి నిరసనలు సాగాయి.

గత 42 శుక్రవారాలుగా ఈ ఘర్షణలు కొనసాగుతున్నాయి.. పాలస్తీనా పతాకాలు చేబూని, ఇజ్రాయిల్ వ్యతిరేక నినాదాలు చేస్తూ వందలాదిమంది ఆందోళనకారులు ప్రదర్శనల్లో పాల్గొన్నారు. 'దిగ్బంధనాన్ని అతిక్రమించే శుక్రవారం' అని నినదిస్తూ ర్యాలీలు, ప్రదర్శనల్లో చేతులు కలపాల్సిందిగా పలువురు ఆందోళనకారులు పిలుపిచ్చారు. ఈ ఆందోళనలు ప్రారంభమైనప్పటి నుంచి ఇప్పటివరకు 240మంది పాలస్తీనియన్లు మరణించారు. 25వేల మందికి పైగా గాయపడ్డారు.

పాక్‌కు సందర్శించనున్న ఐక్యరాజ్యసమితి అధ్యక్షురాలు



మరియా ఫెర్నాండా

ఐరాస : పాక్‌తో మరింతగా సత్సంంధాలు మెరుగుపర్చుకునేందుకు, వివిధ సంస్థలతో అనుసంధాన్ని పెంపొందించే లక్ష్యంగా ఐక్యరాజ్య సమితి అధ్యక్షురాలు మరియా ఫెర్నాండా ఎస్పినోసా వచ్చే వారం పాకిస్తాన్‌కు సందర్శించనున్నారు. పాక్ ఆహ్వానం మేరకు ఈ నెల 18 నుండి 22 వరకు మరియా పర్యటించనున్నారని ఐరాస జనరల్ అసెంబ్లీ అధికార ప్రతినిధి ప్రకటనలో తెలిపారు. సెప్టెంబర్‌లో ఐరాస అధ్యక్షురాలిగా పదవీ బాధ్యతలు చేపట్టిన మరియాకు మొదటి అధికారిక పర్యటన కావడం విశేషం. ఈక్వెడార్ విదేశాంగ వ్యవహారాల మాజీ మంత్రి మరియా జూన్‌లో జరిగిన ఐరాస జనరల్ అసెంబ్లీలో 73వ అధ్యక్షురాలిగా ఎన్నికయ్యారు. ఇప్పటి వరకు ఎన్నికైన అధ్యక్షుల్లో ఆమె నాల్గొవ మహిళ. ఈ పర్యటనలో పాక్ ప్రధాని ఇమ్రాన్ ఖాన్, అధ్యక్షుడు ఆరిఫ్ ఆల్వి, విదేశాంగ మంత్రి షా మహ్మద్ ఖురేషిలతో ఆమె భేటీకానున్నారని ఐరాస కార్యాలయం తెలిపింది.

కంపెనీలకు ఫేస్‌బుక్ యూజర్ల డేటా విక్రయం

2012లోనే ఆలోచన చేసిన ఫేస్‌బుక్



శాన్‌ఫ్రాన్సిస్కో : ఫేస్‌బుక్ యూజర్ల డేటాను కంపెనీలకు విక్రయించే ఆలోచనను ఫేస్‌బుక్ కొన్నేళ్ళ క్రితమే చేసిందని, కానీ తర్వాత అందుకు వ్యతిరేకంగా వ్యవహరించాలని నిర్ణయించిందని మీడియా వార్తలు తెలిపాయి. యూజర్ డేటా 'ది గ్రాఫ్ ఎపిఐ' అందుబాటులోకి వచ్చే సౌలభ్యం కల్పించాలంటే కనీసం 250,000 డాలర్లు కంపెనీలు చెల్లించాలని 2012లో ఫేస్‌బుక్ సిబ్బంది నిర్ణయించినట్లు ఆ వార్తలు పేర్కొన్నాయి. అయితే 2014 ఏప్రిల్‌లో ఫేస్‌బుక్ ఆ పద్ధతిని మార్చింది. 2015 జూన్ నాటికల్లా మొత్తంగా డేటా అందుబాటులోకి వచ్చే సౌకర్యాన్ని తొలగించింది. యూజర్ సమాచారం అందే సౌలభ్యాన్ని పెంచితే అందుకు ప్రతిగా మరింత ఖర్చు పెట్టాల్సి వుంటుందన్న ఆలోచనపై ఫేస్‌బుక్ ఉద్యోగులు కొందరు ఆనాడు చర్చించారని వాల్‌స్ట్రీట్ జర్నల్ తెలిపింది.

ఈ సమాచారం సేకరించడానికి ఫేస్‌బుక్ అనేక పద్ధతులను ఉపయోగించింది. యూజర్ల లోకేషన్లు కనుగొనడం, వారి సందేశాలను చదవడం, ఫోన్లలో వారి ఫోటోలను అందుబాటులోకి తెచ్చుకోవడం వంటి చర్యలకు పాల్పడిందని గార్డియన్ పేర్కొంది. వ్యక్తుల కాల్స్, సందేశాలు ద్వారా తాము సమాచారాన్ని సేకరించామని మార్చిలో ఫేస్‌బుక్ అంగీకరించింది. అయితే వీటన్నింటికీ ముందుగానే అనుమతి తీసుకున్నామని తెలిపింది.

పెరుగుతున్న డ్రంకెన్ డ్రైవ్ కేసులు

పోలీసుల వద్ద మద్యం ప్రియుల జాబితా

- పాస్‌పోర్టు కార్యాలయాలు, కాలేజీలు,ఉద్యోగ సంస్థలకు సమాచారం

పోలీసుల హెచ్చరికలు.. కేసులు పెరుగుతున్నా.. మద్యం తాగి వాహనాలు నడపడం తగ్గడం లేదు. మద్యం మత్తులో కార్లు, బైకులపై వేగంగా వెళ్తూ ప్రమాదాలకు కారణమవుతున్న ఘటనలు జరుగుతున్నాయి. వారి వల్ల ప్రమాదాల్లో అమాయకులు ప్రాణం కోల్పోతున్నారు. మద్యం సేవించి పట్టుబడితే జైలు శిక్ష తప్పదని, లైసెన్స్‌లు రద్దవుతాయని తెలిసినా పట్టించుకోవడం లేదు. టాఫిక్ పోలీసులు రహదారులు, గల్లీల్లో సైతం ప్రత్యేక తనిఖీలు చేస్తున్నారు.





నవతెలంగాణ - సిటీబ్యూరో

హైదరాబాద్‌లో సుమారు 58.85 లక్షల వాహనాలు రోడ్లపై తిరుగుతున్నాయి. చాలా మంది ట్రాఫిక్ నిబంధనలు పాటించడం లేదు. మరికొందరు మద్యం సేవించి వాహనాలు నడుపుతున్నారు. వీరి మూలంగా ప్రమాదాలు జరిగి అమాయకులు ప్రాణం కోల్పోతున్నారు. ప్రమాదాలను నివారించేందుకుగాను 2011 నవంబర్ 4న తొలిసారిగా హైదరాబాద్‌లో 'డ్రంకెన్ డ్రైవ్' తనిఖీలకు పోలీసులు శ్రీకారం చుట్టారు. బ్రీత్ ఎనలైజర్ పరికరంతో తనిఖీలు చేసి మద్యం శాతాన్ని నమోదు చేస్తున్నారు. 2017లో 18,952 మంది మద్యం ప్రియులను పట్టుకోగా ,17,284 మందిపై కోర్టులో చార్జ్‌షీట్ దాఖలు చేశారు. వారిలో 3,866 మంది జైలుకెళ్లారు. ఇక 2018లో 26,779 మందిపై కేసు నమోదు చేయగా 26,407 మందిపై చార్జిషీట్ దాఖలు చేశారు. తాగిన మద్యం శాతాన్ని బట్టి 5,148 మందికి ఒక్క రోజు నుంచి రెండు నెలల వరకూ జైలు శిక్ష విధించారు. 13,68 మంది వాహన దారుల డ్రైవింగ్ లైసెన్స్‌లను రద్దు చేశారు.

తప్పించుకునే ఎత్తుగడలు

నగరంలోని పలు ప్రాంతాల్లో పోలీసుల తనిఖీలు ఉంటాయని గుర్తిస్తున్న మందు బాబులు ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటున్నారు. మద్యం తాగే ముందు స్నేహితుల్లో ఒకరికి తాగించడం లేదు. మద్యం సేవించని స్నేహితున్ని వాహనంపై ముందు పంపిస్తున్నారు. రోడ్లపై డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు లేవని నిర్ధారించుకున్న తర్వాత వారు వెళ_న్నారు. పోలీసుల తనిఖీలు కనిపిస్తే ముందు వెళ్లిన వ్యక్తి సెల్‌ఫోన్ ద్వారా సమాచారం అందించడంతో వారు గల్లీల్లో నుంచి జారుకుంటున్నారు.

క్లీక్ మంటే వివరాలు తెరపైకి

ట్రాఫిక్ నిబంధనలు ఉల్లఘి ంచే వారిని గుర్తించేందుకు ట్రాఫిక్ పోలీసులు పీడీఏ (పర్సనల్ డిజిటల్ అసిస్టెంట్) యంత్రాన్ని ఉపయో గిస్తున్నారు. ఇందులో వాహనం నెంబర్ ఎంటర్ చేయగానే ఎన్నిసార్లు రెడ్ సిగ్నల్ దాటడం, రాంగ్ పార్కింగ్, లైసెన్సు లేకుండా వాహనాలు నడపటం వంటి ఘటనల తోపాటు మోతాదుకు మించి మద్యం సేవించి గతంలో పట్టుబడిన విషయాలన్నీ తెరపైకి వస్తాయి.

సంస్థలకు సమాచారం

డ్రంకెన్ డ్రైవ్ తనిఖీల సమయంలో పోలీసులతో వాగ్వాదానికి దిగుతున్నారు. పక్కా ఆధారాల కోసం పోలీసులు వీడియో చిత్రీకరణ చేస్తున్నారు. పట్టుబడిన వారి డ్రైవింగ్ లైసెన్స్, ఫొటోలు తీసుకుని కమాండ్ కంట్రోల్ రూమ్‌కు అనుసంధానం చేస్తున్నారు. అక్కడ ఆధార్‌లో నమోదు చేస్తున్నారు. పాయింట్లు విధిస్తున్నారు. పట్టుబడిన వారు ఉద్యోగులైతే వారు పనిచేసే సంస్థలకు సమాచారం అందిస్తున్నారు. విద్యార్థులైతే కాలేజీలకు వివరాలు పంపిస్తున్నారు. పట్టుబడిన వారికి పాస్‌పోర్టులు లభించకుండా పాస్‌పోర్టు కార్యాలయాలకూ వివరాలు అందిస్తున్నారు.

లక్ష్యానికి దూరంగా పీఎంఏవైజీ..

- రాష్ట్రాలకు లేఖ రాసిన కేంద్రం

న్యూఢిల్లీ: బీజేపీ సర్కారు చేపట్టిన ప్రధానమంత్రి ఆవాస్ యోజన-రూరల్ (పీఎంఏజీవై-జీ) లక్ష్యానికి దూరంగా నిలిచింది. ఈ ఏడాది మార్చి 31 నాటికి దేశంలో కోటి మంది భూమి లేని నిరుపదేలకు ఇండ్లు కట్టించే ఉద్దేశంతో ఈ పథకాన్ని రూపొందించారు. అయితే, పలు రాష్ట్రాలలో అర్హులకు అసలు భూమి కూడా కేటాయించలేదు. వీరు దేశవ్యాప్తంగా ఐదు లక్షల మంది ఉన్నారు. కాగా, వీరికి భూమి కేటాయించడమే గాక వీలైనంత త్వరలో వారికి ఇండ్లు కట్టించి ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వాలను కేంద్రం కోరింది. ఈ మేరకు ఈనెల 4న రాష్ట్ర ప్రభుత్వాలకు లేఖ రాసింది. ఇదిలాఉంటే అర్హులకు భూములు కేటాయించలేని రాష్ట్ర ప్రభుత్వాలు.. భూమికి బదులు వారికి నగదును ముట్టజెప్పుతూ చేతులు దులుపుకుంటున్నాయి. కేంద్రం పంపిన లేఖ ప్రకారం.. అసోం, బీహార్, మహారాష్ట్ర, ఒడిషాలలోని ప్రభుత్వాలు.. 2018, జులై 1 నాటికి అర్హులలో 1 శాతం మందికి మాత్రమే భూమిని అందించాయి. 'నిర్ధేశించిన సమయంలో ఈ పథకాన్ని పూర్తి చేయడానికి కొన్ని ఇబ్బందులున్నాయి. అర్హులకు భూమిని కేటాయించడమే ఇందులో పెద్ద సవాలుగా మారింది' అని కేంద్ర గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ తన లేఖలో పేర్కోవడం గమనార్హం. దేశవ్యాప్తంగా ఇప్పటికి 65 లక్షల ఇండ్లను పూర్తి చేసినట్టు, మరో 25 లక్షల ఇండ్లు నిర్మాణంలో ఉన్నాయని ప్రభుత్వ లెక్కలు చెబుతున్నాయి. ఈ ఏడాది మార్చి 31 నాటికే గడువు తేదీ ముగుస్తుండగా.. గడువులోపు ఇండ్లను పూర్తి చేస్తామని కేంద్రం చెబుతోంది. కానీ, వాస్తవ పరిస్థితి మాత్రం దీనికి దూరంగా నిలవడం ప్రస్తావనార్హం.

కమ్ముకున్న పొగమంచు

- దారి కనిపించక ఒకదానికొకటి ఢీకొన్న 16 వాహనాలు
- ఇద్దరికి తీవ్రగాయాలు

నవతెలంగాణ - నందిగామ

పొగమంచు కారణంగా దారి కనిపించక రంగారెడ్డి జిల్లా నందిగామ మండల కేంద్రంలోని బైపాస్ రోడ్డులో పలు వాహనాలు ఒకదానికొకటి ఢీకొన్నాయి. వాహనాలు ధ్వంసమయ్యాయి. పలువురికి గాయాలయ్యాయి. ఈ ఘటన శనివారం తెల్లవారుజామున జరిగింది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నందిగామ మండల కేంద్రంలోని బైపాస్ రోడ్డులో ఉదయం పొగమంచు కమ్ముకుంది. ముందు ఏ వాహనం వస్తుందో కూడా కనిపించని విధంగా పొగమంచు ఉండటంతో ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. ఈ క్రమంలో షాద్‌నగర్ నుంచి హైదరాబాద్ వెళ్తున్న 16 వాహనాలు ఒకదానికొకటి ఢీకొన్నాయి. టాటా వింగర్ కారు ముందు భాగం పూర్తిగా ధ్వంసమైంది. అందులో ప్రయాణిస్తున్న ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. ఆరెంజ్ ట్రావెల్స్, నాలుగు ఆర్టీసీ బస్సులు, ఆరు కార్లు, డీసీఎం, నాలుగు లారీల అద్దాలు ధ్వంసమయ్యాయి. బైపాస్‌పై ఏకకాలంలో ఈ ప్రమాదాలు జరగడంతో సుమారు రెండున్నర గంటల పాటు ట్రాఫిక్ స్తంభించింది. అప్రమత్తమైన జీఎంఆర్, పోలీసు సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకొని గాయపడిన వారిని ఆస్పత్రికి తరలించారు. వాహనాలను నందిగామ పాత జాతీయ రహదారిగుండా మళ్లించి ట్రాఫిక్‌ను క్లియర్ చేయించారు.

అదే విధంగా మండల కేంద్రంలోని ప్రభుత్వాస్పత్రి వద్ద పొగమంచు తీవ్రంగా ఉండటంతో లారీ ముందు వెళ్తున్న వాహనాన్ని ఢీకొట్టింది. దీంతో గంటపాటు ట్రాఫిక్ నిలిచిపోయింది. పెట్రోలింగ్ పోలీసులు వచ్చి వాహనాలను పక్కకు జరిపి ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు.

బస్సు, ద్విచక్ర వాహనం ఢీ ఇద్దరు మృతి

నవతెలంగాణ-అశ్వారావుపేట

ఆర్టీసీ బస్సు ఢీకొనడంతో ద్విచక్ర వాహనంపై వెళ్తున్న ఇద్దరు మృతిచెందారు. ఈ ఘటన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట మండలంలో శనివారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రామన్నగూడేనికి చెందిన మాడు దుర్గారావు(25), మాడు పాపారావు(23) బంధువులు. వీరు ద్విచక్ర వాహనంపై అశ్వారావుపేట నుంచి వినాయకపురం వెళ్తున్నారు. భద్రాచలం వైపు నుంచి అశ్వారావుపేట వైపు వస్తున్న ఏపీఎస్ ఆర్టీసీ బస్సు వినాయకపురం సమీపంలోని చిలకలగండి ముత్యాలమ్మ దేవాలయం దగ్గర్లో బైక్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో దుర్గారావు, పాపారావు అక్కడికక్కడే మృతిచెందారు.

లోక్‌సభ ఎన్నికలకు సన్నద్ధం

- తెలంగాణ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మణ్

నవ తెలంగాణ - న్యూ ఢిల్లీ బ్యూరో

త్వరలో రాబోయే లోక్‌సభ ఎన్నికలకు తాము సన్నద్ధం అవుతున్నట్టు భారతీయ జనతా పార్టీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ లక్ష్మణ్ వెల్లడించారు. ఈ ఐదేండ్ల కాలంలో తమ ప్రభుత్వం చేపట్టిన పథకాలను ప్రజల్లోకి తీసుకెళతామని తెలిపారు. శనివారం ఇక్కడ జరిగిన బీజేపీ జాతీయ సమ్మేళనంలో తెలంగాణ బీజేపీ నాయకులు పాల్గొన్నారు. ఈ సమ్మేళనంలో తెలుగు రాష్ట్రాల నుంచి దాదాపు 800 మంది నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నట్టు ఆ పార్టీ నాయకులు తెలిపారు. ఈ సందర్భంగా మీడియాతో లక్ష్మణ్ మాట్లాడారు. తమ పార్టీ అధ్యక్షుడు అమిత్ షా, ప్రధానమంత్రి నరేంద్ర మోడీలు స్ఫూర్తిదాయక ప్రసంగాలతో మార్గదర్శకం చేశారన్నారు. అదే స్ఫూర్తితో 2019 సార్వత్రిక ఎన్నికలకు సంసిద్ధం కావాలని బీజేపీ శ్రేణులకు ఆయన పిలుపునిచ్చారు. కూటమి పేరు మీద ఒక్కటవుతున్న బీజేపీయేతర పార్టీలకు మోడీకి సరితూగే నాయకుడెవరని ప్రశ్నించారు. నాయకత్వం ఎవరో తెలియని కూటమికి ఇక ఎజెండా ఏముంటుందని ఆయన ప్రశ్నించారు. ఈ ఐదేండ్లలో జరిగిన అభివద్ధి - స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత జరిగిన అభివద్ధిని పోల్చి చూడమని ప్రజలను కోరతామన్నారు. పేద ప్రజలకు ఇండ్లు, గ్యాస్... ఇలా ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేశామన్నారు. మరోసారి మోడీ... మరోసారి బీజేపీ నినాదంతో ప్రజల్లోకి వెళతామని చెప్పారు. వ్యవసాయం, సంక్షేమం, ఆర్థికంగా వెనుకబడ్డవర్గాలకు రిజర్వేషన్లు, రామమందిర నిర్మాణం వంటి అంశాలపై బీజేపీ క తనిశ్చయంతో ఉందన్నారు.

గురుకుల టీచర్లకు టీఎస్‌యూటీఎఫ్ అండ

- బోధనేతర పనులతో విద్యార్థులకు అందని నాణ్యమైన విద్య
- 8 గంటల పనివిధానం అమలు చేయాలి : రాష్ట్ర సదస్సులో నేతల డిమాండ్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్




మాట్లాడుతున్న చావరవి

రాష్ట్రంలో వివిధ గురుకుల విద్యాలయాల సంస్థల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (టీఎస్‌యూటీఎఫ్) అండగా ఉండనుంది. గురుకుల ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి ముందుంటామని టీఎస్‌యూటీఎఫ్ నేతలు చెప్పారు. గురుకుల ఉపాధ్యాయులకు బోధనేతర పనులు అప్పగించడం వల్ల బోధనపై దృష్టిసారించకపోవడంతో విద్యార్థులకు నాణ్యమైన విద్య అందడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. ఉపాధ్యాయులపై ఒత్తిడిని తగ్గించాలనీ, ఎనిమిది గంటల పనివిధానాన్ని అమలు చేయాలనీ డిమాండ్ చేశారు. శనివారం హైదరాబాద్‌లోని టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర కార్యాలయంలో గురుకుల ఉపాధ్యాయుల రాష్ట్ర సదస్సు జరిగింది. అధ్యక్షత వహించిన టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు సిహెచ్ రాములు మాట్లాడుతూ గురుకులాలకు శాశ్వత భవనాల్లేవని చెప్పారు. విద్యార్థులు, ఉపాధ్యాయులకు కనీస సౌకర్యాలు లేకున్నా సర్దుకొని టీచర్లు అంకితభావంతో పనిచేస్తున్నారని అన్నారు. బోధనేతర పనులు అప్పగించడం, పనివేళలు కాకుండా అదనంగా పనిచేయించడంతో ఒత్తిడికి గురవుతున్నారని చెప్పారు. ప్రశ్నించే స్వేచ్ఛనూ హరించివేస్తూ వేధింపులకు గురిచేస్తున్నారని అన్నారు. యాజమాన్యాలు వేర్వైనా, సమస్యలు మాత్రం అన్ని పాఠశాలల్లో ఒకే రకంగా ఉన్నాయని వివరించారు. అధికారులు సమస్యలు పరిష్కరించి పాఠశాలల్లో సానుకూల వాతావరణం కల్పించాలని కోరారు. టీఎస్‌యూటీఎఫ్ ప్రధాన కార్యదర్శి చావ రవి మాట్లాడుతూ గురుకుల ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలను క్రోఢీకరించి త్వరలోనే ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని అన్నారు. అధికారులకు ప్రాతినిధ్యం చేస్తామన్నారు. స్పందించకుంటే ఉపాధ్యాయులను సంఘటిత పరిచి ప్రత్యక్ష కార్యాచరణకు పూనుకుంటామని చెప్పారు. టీఎస్ గురుకులాలు, సాంఘిక సంక్షేమ గురుకులాలు, బీసీ గురుకులాలు, గిరిజన గురుకులాలు, మైనార్టీ గురుకులాల నుంచి హాజరైన పలువురు ఉపాధ్యాయులు తమ సమస్యలను వివరించారు. శాశ్వత భవనాలు నిర్మించాలనీ, ఉపాధ్యాయులకు వసతి సౌకర్యం కల్పించాలనీ, నైట్ డ్యూటీల నుంచి టీచర్లకు మినహాయింపునివ్వాలనీ, కేర్‌టేకర్‌ను నియమించాలనీ కోరారు. విద్యాహక్కు చట్టం నిర్దేశించిన పనిగంటలను అమలు చేయాలనీ, బోధనేతర పనుల నుండి తప్పించాలనీ, గురుకులాలన్నింటినీ విద్యాశాఖ పరిధిలోకి తేవాలనీ, ఒకే డైరెక్టరేట్‌ను ఏర్పాటు చేయాలనీ డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో టీఎస్‌యూటీఎఫ్ మాజీ అధ్యక్షులు ఎ నర్సిరెడ్డి, ఉపాధ్యక్షులు సిహెచ్ దుర్గాభవాని, గురుకుల పాఠశాలల బాధ్యులు మార్గరేట్, విజయలక్ష్మి, గణేష్‌గౌడ్, దామోదర్, ఎల్లయ్య, సృజన, సుమిత్ర, నరేందర్, ప్రశాంత్, గోవర్ధన్, శంకర్, ఆంజనేయులు, టీఎస్‌టీయూఎఫ్ నాయకులు కిష్టయ్య, బి నరసింహారావు, సత్యానంద్, శాంతికుమారి, నాగమణి, ఆంజనేయులు, ఎంఏకె దత్తు, మాణిక్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నవచిత్రం

సినిమా కూతురులాంటిది..


షారూఖ్ ఖాన్

'మన జీవితానికి మనమే రాజు అనుకున్నప్పుడు, మనకు నచ్చింది చేయాలి. ఒకవేళ అలా చేయకపోతే మనం రాజే కాకూడదు' అని అంటున్నారు షారూఖ్ ఖాన్. ఇటీవల ఆయన నటించిన చిత్రం 'జీరో'. ఆనంద్.ఎల్.రాయ్ దర్శకత్వంలో రూపొందిన ఈ సినిమాలో కత్రినా కైఫ్, అనుష్క శర్మ కథానాయికలుగా నటించారు. ఈ చిత్రం విడుదలై బాక్సాఫీసు వద్ద పరాజయం చెందింది. దీనిపై ఓ ఇంటర్వ్యూలో షారూఖ్ మాట్లాడుతూ, 'నేను సాధించలేనేమో అనుకున్న విషయాల్లో విజయం సాధించాను. మన జీవితాలకు మనమే రాజు అనుకున్నప్పుడు నచ్చింది చేయాలి. పేరు కోసం ఏదో చేయడం సరైనది కాదు. ఓ నిర్మాతగా రైటర్‌కి క్రియేటివ్ ఫ్రీడమ్ ఇవ్వాలి. అదే సమయంలో సినిమాకి చాలా జాగ్రత్తలు తీసుకోవాలి. నా దృష్టిలో సినిమా కూడా ఓ కూతురు లాంటిదే. కూతురి పెళ్ళిని ఎంతో ఖర్చుపెట్టి ఘనంగా చేస్తాం. అలానే సినిమాకి కూడా ఖర్చు పెట్టాలి' అని అన్నారు. షారూఖ్ ప్రస్తుతం వ్యోమగామి రాకేష్ శర్మ బయోపిక్ కోసం ప్రిపేర్ అవుతున్నారు. దీనికి 'సారే జహాసే అచ్ఛా' అనే టైటిల్‌ని పరిశీలిస్తున్నారని సమాచారం.

థాక్రే భార్యగా రీఎంట్రీ


అమృతరావు

మహేష్ సరసన 'అతిథి' చిత్రంలో కథానాయిక నటించిన బాలీవుడ్ నటి అమృత రావు తెలుగు ఆడియెన్స్‌ని అలరించింది. తెలుగులో ఒకే ఒక్క సినిమాలో మెరిసిన ఆమె హిందీలో పలు ప్రాజెక్ట్‌లతో బిజీ అయ్యింది. మూడేండ్ల క్రితం ప్రియుడు అన్మోల్‌ని పెళ్ళి చేసుకుని సినిమాలకు దూరంగా ఉంది. తాజాగా ఆమె రీఎంట్రీ ఇస్తూ హిందీలో రూపొందుతున్న 'థాక్రే' చిత్రంలో నటిస్తున్నారు.
శివసేన పార్టీ వ్యవస్థాపకుడు బాల్ థాక్రే జీవితం ఆధారంగా రూపొందుతున్న చిత్రమిది. థాక్రే పాత్రలో నవాజుద్దీన్ సిద్ధిఖీ నటిస్తున్నారు. థాక్రే భార్య మీనా థాక్రే పాత్రలో అమృత నటిస్తుంది. ఆమె పాత్ర లుక్‌ని ఇటీవల విడుదల చేశారు. ఈ సందర్భంగా తన పాత్ర గురించి అమృతరావు మాట్లాడుతూ, 'మీనా థాక్రేకి మీడియా అంటే కాస్త బిడియం. కానీ కుటుంబాన్ని ఆమె చక్కగా లీడ్ చేశారు. ఆమె గురించి రీసెర్చ్ చేసినప్పుడు నాకు కనీసం డాక్యుమెంటరీ వీడియో కూడా దొరకలేదు. ఆమె గురించి తెలుసుకుని, కన్విన్సింగ్‌గా నటించడం పెద్ద ఛాలెంజింగ్‌గా అనిపించింది. బాల్ థాక్రే ఇంటర్వ్యూలో కూడా ఆమె గురించి ఎక్కడా ప్రస్తావించలేదు. ఫైనల్‌గా బాల్ థాక్రే సిస్టర్ మిసెస్ కరంజ్కర్ ఇంటర్వ్యూ దొరికింది. ఆమె ద్వారా కొన్ని విషయాలు తెలుసుకున్నా. నా దృష్టిలో మీనా థాక్రే ఒక ఆదర్శ తల్లి, ఆదర్శవంతమైన భార్య. ఈ పాత్రలో నటించడం హ్యాపీగా ఉంది' అని తెలిపింది. అభిజిత్ పన్సే దర్శకత్వంలో రూపొందుతున్న ఈ సినిమా ఈ నెల 25న ప్రేక్షకుల ముందుకు రానుంది.

భారతీయుడు 2లో కీలక పాత్ర..!


శింబు

కమల్ హాసన్ నటిస్తున్న ప్రతిష్టాత్మక చిత్రం 'భారతీయుడు 2'. గతంలో విడుదలైన సెన్సేషనల్ బ్లాక్‌బస్టర్ 'భారతీయుడు' చిత్రానికి ఇది సీక్వెల్. శంకర్ దర్శకత్వంలో రూపొందుతుంది. ఇందులో కమల్ హాసన్ ప్రధాన పాత్ర పోషిస్తుండగా కీలక పాత్రల్లో పలువురు యువ కథానాయకులు కనిపించబోతున్నారు. ఇప్పటికే దుల్కర్ సల్మన్ ఫైనల్ అయినట్టు తెలుస్తుంది. తాజాగా శింబు పేరు కూడా వినిపిస్తోంది. ఓ కీలక పాత్ర కోసం శింబుని ఎంపిక చేశారట. కమల్ హాసన్ మనవడి పాత్రలో శింబు కనిపిస్తారని సమాచారం. తాత, తండ్రి పాత్రల్లో కమల్ హాసన్ నటించే అవకాశం ఉందట. అలాగే బాలీవుడ్ స్టార్ అక్షయ్ కుమార్ కూడా ఇందులో నెగటివ్ పాత్ర పోషిస్తున్నారట. ఈ చిత్రంలో కాజల్ కథానాయికగా నటిస్తుంది. సమకాలీన రాజకీయాలు, అవినీతి, సామాజిక అంశాల ప్రధానంగా సినిమా ఉంటుందని తెలుస్తుంది.

వంద కోట్ల క్లబ్‌లోకి 8 సినిమాలు..!


రోహిత్ శెట్టి

బాలీవుడ్ దర్శకుడు రోహిత్ శెట్టి అరుదైన రికార్డుని సాధించారు. ఆయన దర్శకత్వం వహించిన 8 సినిమాలు వరుసగా వంద కోట్లకుపైగా కలెక్షన్లను రాబట్టాయి. ఈ విషయాన్ని రణ్‌వీర్ సింగ్ ఇటీవల ఇన్‌స్టాగ్రామ్‌లో పేర్కొన్నారు. 'వరుసగా రోహిత్ ఎనిమిదో సినిమా వంద కోట్లు దాటినందుకు ఆనందంగా ఉంది' అని తెలిపారు. రోహిత్ శెట్టి దర్శకత్వంలో రూపొందిన 'సింబా' చిత్రంలో రణ్‌వీర్ సింగ్ హీరోగా నటించారు. ఇటీవల విడుదలైన ఈ సినిమా దాదాపు 200 కోట్లకి పైగా కలెక్షన్లను దాటింది. ఇది తెలుగులో వచ్చిన 'టెంపర్'కి రీమేక్ కావడం విశేషం. 'గోల్‌మాల్ 3' రూ.160 కోట్లు వసూలు చేసింది. 'బోల్ బచ్చన్'. రూ.187కోట్లు, 'చెన్నై ఎక్స్‌ప్రెస్' ప్రపంచ వ్యాప్తంగా రూ.400 కోట్లు, 'సింగం', 'సింగం 2' చిత్రాలు 100కోట్లు, రూ.140 కోట్లు రాబట్టాయి. 'దిల్‌వాలే' ప్రపంచ వ్యాప్తంగా రూ.400కోట్లు వసూలు చేసింది. 'గోల్‌మాల్ ఎగైన్' సినిమా సుమారు రూ.200 కోట్లను కొల్లగొట్టింది. ఇదిలా ఉంటే 'సింబా' చిత్రంలో అజయ్ దేవగన్ గెస్ట్‌గా కనిపించడానికి కారణం గురించి రోహిత్ శెట్టి స్పందిస్తూ, 'నా సినిమాలో అజయ్ ప్రజెన్స్‌ని కోరుకుంటున్నారు. బాజీరావ్ సింగంని చూడాలనుకుంటారు. ఆ పాత్ర యూనివర్స్. ఎందులోనైనా పెట్టొచ్చు' అని తెలిపారు.

సైలెంట్‌గా సైలెన్స్ షూటింగ్..!

అనుష్క



'రుద్రమదేవి', 'బాహుబలి', 'భాగమతి' వంటి భారీ చిత్రాలతో మెస్మరైజ్ చేసిన అనుష్క తదుపరి చిత్రాల విషయంలో ఆచితూచి అడుగులేస్తోంది. ప్రస్తుతం ఆమె సైలెన్స్ సినిమాలో నటిస్తున్నట్టు సమాచారం. రైటర్ కోనవెంకట్ నిర్మిస్తున్న ఈ చిత్రానికి హేమంత్ మధుకర్ దర్శకత్వం వహిస్తున్నారు. అనుష్కకి జోడీగా మాధవన్ నటించనున్న ఈ సినిమాకు 'సైలెన్స్' అనే టైటిల్‌ని పరిశీలిస్తున్నారు. ఇదిలా ఉంటే , ఈ సినిమాలో ఓ హాలీవుడ్ నటుడిని తీసుకోబోతున్నారట. హాలీవుడ్ స్టార్ మైఖెల్ మాడ్సన్‌ని విలన్ పాత్ర కోసం ఎంపిక చేసే ఆలోచన చిత్ర బృందం ఉందట. ప్రస్తుతం ఆయనతో చర్చలు జరుపుతున్నారట. థ్రిల్లర్ నేపథ్యంలో రూపొందిస్తున్నారు. మహిళా ప్రధానంగా సాగే ఈ చిత్రంలో అనుష్క దివ్యాంగురాలి పాత్రలో కనిపించనున్నట్టు సోషల్ మీడియాలో ఓ వార్త ప్రస్తుతం వైరల్ అయ్యింది. మార్చిలో సినిమాని ప్రారంభించనున్నారు. మేజర్ షూటింగ్ అమెరికాలో ఉంటుందట. ఇందులో అనుష్క కొత్త లుక్‌లో కనిపిస్తారట.

తదుపరి పీరియడ్ చిత్రం !


శివ, అజిత్

ఓ కాంబినేషన్‌లో బ్యాక్ టు బ్యాక్ మూడు సినిమాలు రావడం, అవి హ్యాట్రిక్ హిట్ అవ్వడం ఇటీవల కాలంలో చూసి ఉండరు. కానీ అజిత్, శివ కాంబినేషన్ ఆ అరుదైన ఘనత సాధించింది. 'వీరం', 'వేదాళం', 'వివేగం'లతో హ్యాట్రిక్ హిట్ అందుకోవడం విశేషమైతే, ఇటీవల సంక్రాంతి కానుకగా విడుదలైన 'విశ్వాసం' సైతం భారీ బ్లాక్‌బస్టర్‌గా డబుల్ హ్యాట్రిక్‌కి నాంది పలికింది. ఈ నేపథ్యంలో వరుసగా ఐదోసారి ఈ కాంబినేషన్ రిపీట్ కాబోతోందని సమాచారం. అజిత్ హీరోగా ఓ పీరియాడికల్ నేపథ్య చిత్రం చేయాలనుందని దర్శకుడు శివ 'విశ్వాసం' సక్సెస్‌మీట్‌లో చెప్పారు. దీనిపై అజిత్‌తో కూడా చర్చించారట. అన్నీ కుదిరితే త్వరలోనే కచ్చితంగా ఈ ప్రాజెక్ట్ ఉంటుందని శివ అన్నారు. ప్రస్తుతం అజిత్ బాలీవుడ్ హిట్ చిత్రం 'పింక్' రీమేక్‌లో నటిస్తున్నారు. వినోద్ దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాలో బాలీవుడ్ నటి విద్యా బాలన్ అతిథి పాత్రలో నటిస్తున్నారు. ఇక కథానాయికలుగా తాప్సీ, శ్రద్ధా శ్రీనాథ్, నజ్రీయా నజీమ్ పేర్లు వినిపిస్తున్నాయి. బోనీ కపూర్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్న విషయం తెలిసిందే.

కంగనా రనౌత్



ప్రయత్నిస్తూ ఓడిపోయిన వాడు లేడు


నాని

'ఆపేసి ఓడిపోయిన వాడు ఉన్నాడు కానీ, ప్రయత్నిస్తూ ఓడిపోయిన వాడు లేడు' అని అంటున్నాడు నాని. ఆయన హీరోగా నటిస్తున్న చిత్రం 'జెర్సీ'. గౌతమ్ తిన్ననూరి దర్శకత్వంలో రూపొందుతున్న చిత్రమిది. శ్రద్ధా శ్రీనాథ్ కథానాయికగా నటిస్తుంది. సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకంపై సూర్యదేవర నాగవంశీ నిర్మిస్తున్నారు. సంక్రాంతి పండుగని పురస్కరించుకుని ఈ చిత్ర టీజర్‌ని శనివారం విడుదల చేశారు. ఇందులో 'నీ వయసు ఇప్పుడు 36 అర్జున్. అది ప్రొఫెషనల్ స్పోర్ట్స్ నుంచి రిటైర్ అయ్యే వయసు...' ఓ వ్యక్తి అంటే, 'పిల్లల్ని ఆడించే వయసులో మనకు ఆటలు ఎందుకు బావా..?' అని మరో వ్యక్తి అనడం, 'ఎంత ప్రయత్నించినా ఇప్పుడు నువ్వు ఏం చేయలేవు..' అని ఓ మహిళ నానితో కోపంగా అంటుంది. దానికి సిక్స్ కొట్టిన తర్వాత 'ఆపేసి ఓడిపోయిన వాడు ఉన్నాడు. కానీ ప్రయత్నిస్తూ ఓడిపోయిన వాడు లేడు' అని నాని చెప్పిన డైలాగ్ టీజర్‌లో హైలైట్‌గా నిలిచింది. క్రికెట్ నేపథ్యంలో రూపొందుతున్న ఈ సినిమాకి అనిరుథ్ సంగీతం అందిస్తున్నారు. ఏప్రిల్‌లో సినిమాని విడుదల చేయనున్నారు.

మావి ప్రజలు ఇచ్చే అవార్డులు..


నరేష్, పరుచూరి గోపాలకృష్ణ, టి.సుబ్బరామిరెడ్డి, పింకి రెడ్డి, మీనా, నగ్మా, శోభనా కామినేని

'కళాకారులను గుర్తించి కళని ప్రోత్సహించేందుకు ఓ కళాకారుడిగా సుబ్బరామిరెడ్డి ఎంతగా తపన పడతారో నాకు తెలుసు. కళాకారుడి ఆకలి తీర్చే మహానుభావుడాయన' అని పరుచూరి గోపాలకృష్ణ అన్నారు. కళాబంధు టి.సుబ్బరామిరెడ్డి గతకొన్ని సంవత్సరాలుగా 'టీఎస్ఆర్-టీవీ9 నేషనల్ ఫిల్మ్ అవార్డు'లను అందిస్తున్న విషయం విదితమే. 2017, 18కి చెందిన అవార్డులను ఫిబ్రవరిలో అందించబోతున్నారు.
ఈ సందర్భంగా శనివారం ఏర్పాటు చేసిన ప్రెస్‌మీట్‌లో టి.సుబ్బరామిరెడ్డి మాట్లాడుతూ, 'కళాకారులను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో 2010లో ఈ అవార్డులను ప్రారంభించాను. అవార్డులు రెండు రకాలు. ప్రభుత్వం ఇచ్చే అవార్డులు, ప్రజలు ఇచ్చే అవార్డులు. మావి ప్రజలు ఇచ్చే అవార్డులు. ప్రతి రెండేండ్లకు ఓసారి ఈ అవార్డులని అందిస్తున్నాం. 2017లో వచ్చిన సినిమాలకు, 2018 విడుదలైన సినిమాలకు ఈ ఏడాది అవార్డులను అందించనున్నాం. ప్రేక్షకులు వేసే ఓటింగ్ ద్వారా ఈ అవార్డుల ఎంపిక ఉంటుంది. ఓటింగ్‌ని బట్టి జ్యూరీ కమిటీ అవార్డులను నిర్ణయిస్తుంది. జ్యూరీకి నేను చైర్మెన్‌గా ఉంటాను. డా॥శోభన కామినేని, పింకిరెడ్డి, జీవిత, మీనా, నగ్మ, పరుచూరి గోపాలకృష్ణ, నరేష్, కె.ఎస్.రామారావు, కె.రాఘురామ క్రిష్ణమ్‌రాజు జ్యూరీ సభ్యులుగా ఉన్నారు. ఫిబ్రవరి 16న అవార్డులను ప్రకటించి, 17న వైజాగ్‌లోని పోర్ట్ గ్రౌండ్‌లో అవార్డుల ప్రదాన కార్యక్రమం గ్రాండ్‌గా నిర్వహించనున్నాం. శ్రీదేవి మెమోరియల్ అవార్డును విద్యాబాలన్‌కి అందిస్తున్నాం' అని అన్నారు.
'లక్షల మంది ప్రేక్షకుల ముందు అవార్డు తీసుకోవడంలో కళాకారుడు పొందే అనుభూతి చెప్పలేనిది. ఇలా కళాకారులను ప్రోత్సహిస్తూ సుబ్బరామిరెడ్డి జీవితం ధన్యమైంది' అని పరుచూరి గోపాలకృష్ణ తెలిపారు. నిర్మాత కె.ఎస్.రామారావు చెబుతూ, 'అవార్డుల ద్వారా చాలా మంది ఆర్టిస్టులు, టెక్నీషియన్లకు జాతీయ స్థాయి గుర్తింపు తెచ్చారు. అంతేకాదు ప్రభుత్వం అందించిన జాతీయ అవార్డు తరచూ కాంట్రవర్సీలు అవుతుంటాయి. నంది అవార్డులను సరిగా నిర్వహించలేని పరిస్థితి. ఈ నేపథ్యంలో ఎలాంటి కాంట్రవర్సీ లేకుండా అవార్డు వేడుకని నిర్వహించడం సుబ్బరామిరెడ్డికే సాధ్యమైంది' అని తెలిపారు. 'చాలా రోజుల తర్వాత హైదరాబాద్‌కి రావడం ఆనందంగా ఉంది. గతంలో 'దృశ్యం' సినిమాకి అవార్డు తీసుకున్నా. ఇప్పుడు జ్యూరీలో భాగం కావడం చాలా హ్యాపీగా ఉంది' అని మీనా తెలిపారు. నగ్మ చెబుతూ, 'సుబ్బరామిరెడ్డి నిర్మించిన 'గ్యాంగ్‌మాస్టర్'లో కథానాయికగా నటించారు. ఆయన నాకు 25 ఏండ్లుగా తెలుసు. ఆర్ట్, కల్చర్‌ని ప్రోత్సహిస్తున్న తీరు అభినందనీయం' అని చెప్పారు. ఈ కార్యక్రమంలో నరేష్, శోభనా కామినేని, పింకి రెడ్డి పాల్గొన్నారు.

ప్రియాంకతో సూపర్‌గర్ల్ సినిమా..!


ప్రియాంక చోప్రా


'ప్రియాంక చోప్రాతో కలిసి నటించాలని ఉంది. ఆమెతో ఓ సూపర్ గర్ల్ చిత్రం చేయాలనుకుంటున్నా' అని అంటోంది కంగనా రనౌత్. ప్రియాంక చోప్రా, కంగనా కలిసి గతంలో సూపర్ హీరో చిత్రం 'క్రిష్3'లో నటించారు. హృతిక్ రోషన్ హీరోగా రూపొందిన ఈ సినిమా ఘన విజయం సాధించింది. ఇందులో ప్రియాంక హోమ్లీ గర్ల్‌గా, కంగనా సూపర్ హీరోయిన్ తరహా పాత్రలో మెప్పించారు. వ్యక్తిగతంగానూ ఈ ఇద్దరు ఒకరికొకరు పూర్తి భిన్నం. కానీ సినిమాల పరంగా ఒకేతరహాలో లేడీ ఓరియెంటెడ్ చిత్రాలు చేస్తున్నారు. ప్రియాంక హాలీవుడ్ కథానాయికగా రాణిస్తుంటే, కంగనా మహిళా పాత్రలకు కేరాఫ్‌గా నిలిచింది. ప్రస్తుతం ఆమె నటించిన 'మణికర్ణిక: ది క్వీన్ ఆఫ్ ఝాన్సీ' చిత్రం ఈ నెల 25న విడుదల కానుంది. ఈ సందర్భంగా కంగనా మాట్లాడుతూ, 'నాకు సూపర్ గర్ల్ చిత్రంలో నటించడం ఇష్టం. అది కూడా ప్రియాంకతో కలిసి నటించడానికి ఇష్టపడతా' అని తెలిపింది. ప్రస్తుతం 'మెంటల్ హై క్యా'లో కంగనా నటిస్తుంటే, 'ది స్కై ఈజ్ పింక్'తోపాటు హాలీవుడ్ చిత్రం 'ఈజ్‌నాట్ ఇట్ రొమాంటిక్?' చిత్రాల్లో ప్రియాంక నటిస్తూ బిజీగా ఉంది.

స్ట్రాంగ్ కంటెంట్‌తో ఉండిపోరాదే


లావణ్య

తరుణ్ తేజ్, లావణ్యలను హీరో హీరోయిన్లుగా, నవీన్ నాయని దర్శకుడిగా పరిచయం చేస్తూ శ్రీమతి సత్య ప్రమీల కర్లపూడి సమర్పణలో గోల్డ్ టైమ్ ఇన్ పిక్చర్స్ పతాకంపై డా॥ లింగేశ్వర్ నిర్మిస్తున్న చిత్రానికి 'ఉండిపోరాదే' అనే టైటిల్‌ని ఖారారు చేశారు. అంతేకాదు సంక్రాంతి పండగని పురస్కరించుకుని ఈ చిత్ర ఫస్ట్‌లుక్‌ని విడుదల చేశారు. ఈ సందర్భంగా నిర్మాత లింగేశ్వర్ మాట్లాడుతూ, 'కథ స్ట్రాంగ్‌గా ఉంటే, కథకి తగ్గ నటీనటులు ఉంటే, ఆ కథని అద్భుతంగా తెరకెక్కించే దర్శకుడు ఉంటే, కొత్త, పాత అనే తేడా లేకుండా ఆడియెన్స్ ఆదరిస్తారు. ఈ విషయాన్ని నమ్మి చక్కటి కథను మా బ్యానర్‌లో తెరకెక్కిస్తున్నాం. రాజమండ్రి పరిసర ప్రాంతాల్లో మొదటి షెడ్యూల్‌ని పూర్తి చేశాం. తదుపరి షెడ్యూల్ ఈ నెల 28 నుంచి బెంగుళూరు, మైసూర్, కరీంనగర్, హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో ఏకధాటిగా చిత్రీకరించనున్నాం. అన్ని వర్గాల ప్రేక్షకుల్ని అలరించే చిత్రమవుతుంది' అని అన్నారు. కెధార్ శంకర్, సత్యకృష్ణన్, సిద్ధిక్షా, అల్లు రమేష్, నారి ప్రధాన పాత్రల్లో నటిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: సాబు వర్గీస్, కెమెరా: శ్రీను విన్నకోట.

రేస్ 4కి రెడీ..!


సైఫ్ అలీఖాన్

సైఫ్ అలీ ఖాన్ ప్రధాన పాత్రలో నటించిన 'రేస్' సినిమా బాక్సాఫీసు వద్ద ఘన విజయం సాధించింది. 2008లో వచ్చిన ఈ చిత్రానికి అబ్బాస్ మస్తాన్ దర్శకత్వం వహించారు. ఆ తర్వాత ఆయన దర్శకత్వంలో సైఫ్ అలీ ఖాన్ హీరోగా 'రేస్ 2' విడుదలై సూపర్ హిట్ అయ్యింది. కానీ గతేడాది సల్మాన్ ఖాన్ హీరోగా రెమో డి సౌజా దర్శకత్వంలో వచ్చిన 'రేస్ 3' డిజాస్టర్‌గా నిలిచింది. దీంతో నిర్మాత రమేష్ టౌరానీ తనకి రెండు విజయాలని అందించిన సైఫ్ అలీ ఖాన్‌తో 'రేస్ 4'ని తెరకెక్కించేందుకు ప్లాన్ చేస్తున్నారు.

అసలేం జరిగిందంటే..?


శ్రీరామ్

శ్రీరామ్ హీరోగా ఎన్‌వీఆర్ దర్శకత్వంలో రూపొందుతున్న చిత్రం 'అసలేం జరిగింది?'. ఎక్సోడస్ మీడియా పతాకంపై కె.నీలిమా నిర్మిస్తున్న ఈ చిత్ర పోస్టర్‌ని ఎంపీ సంతోష్ కుమార్ శనివారం విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 'తెలంగాణ రాష్ట్రంలో ఇంత వరకు ఎవరూ తీయని కొత్త ప్రాంతంలో షూటింగ్ జరిపిన చిత్రమిది. అందుకోసం ఆరు నెలల పాటు తెలంగాణలోని వివిధ ప్రాంతాలను సందర్శించడం గొప్ప విషయం. అందుకు చిత్ర బృందాన్ని అభినందిస్తున్నా. దర్శకుడిగా పరిచయం అవుతున్న కెమెరామెన్ ఎన్‌వీఆర్‌కి ఆల్ ది బెస్ట్. సినిమా పెద్ద విజయం సాధించాలి' అని అన్నారు. 'నవ్యమైన కథాంశంతో సినిమాని రూపొందించనున్నాం. ఫిబ్రవరి 11 నుంచి సినిమా షూటింగ్‌ని ప్రారంభిస్తాం. రెండు షెడ్యూల్స్‌లో పూర్తి చేస్తాం. 'భైరవగీత'లో విలన్‌గా నటించిన విజయ్ రామ్ ఈ సినిమాలోనూ ప్రతినాయకుడిగా నటిస్తున్నాడు. సినిమాకి సంబంధించిన పూర్తి వివరాలు త్వరలో వెల్లడిస్తాం' అని నిర్మాత కె.నీలిమా తెలిపారు. ఈ చిత్రానికి సంగీతం: మహావీర్, పాటలు : చిర్రావూరి విజయ్ కుమార్, డాక్టర్ చల్లా భాగ్యలక్ష్మి, వెంకటేష్.

నా సక్సెస్‌కి కారణం అదే..

మాధురీ దీక్షిత్



'హార్డ్ వర్క్‌కి ప్రత్యామ్నాయం లేదు. విజయంలో నిత్య శ్రమే ప్రధాన భూమిక పోషిస్తుంది' అని మాధురీ దీక్షిత్ అన్నారు. బాలీవుడ్‌లో అనేక అద్భుత కళాఖండాల్లాంటి చిత్రాల్లో నటించి అలరించారు. ఎలాంటి పాత్రలోనైనా ఇట్టే ఒదిగిపోవడం ఆమె ప్రత్యేకత. నటిగా, తల్లిగా, భార్యగా ఇలా విభిన్న కోణాలను ఆవిష్కరించారు. అద్భుత నటిగా ఇండియన్ ఆడియెన్స్‌ని ఫిదా చేశారు. ప్రస్తుతం రెండు సినిమాలతో బిజీగా ఉన్న ఆమె హార్డ్ వర్క్ గురించి ఓ షోలో మాట్లాడుతూ, 'నా కెరీర్‌లో పలు అద్భుతమైన పాటల్లో నటించే అవకాశం లభించింది. అమేజింగ్ కొరియోగ్రాఫర్లు పలు మెమరబుల్ సాంగ్స్‌ని క్రియేట్ చేశారు. ఆయా పాటలను ఇప్పటికీ ఎంజాయ్ చేస్తున్నా. అయితే సక్సెస్‌కి ప్రధాన కారణం హార్డ్ వర్క్. దానికి ప్రత్యామ్నాయం లేదు. రెండు శాతం తెలివి ఉంటే, 98 శాతం హార్డ్ వర్క్ కావాలి. నేను నటించిన ప్రతి పాత్రలో నాకు వరకు నేను బెస్ట్ ఇచ్చా. అది యాక్టర్‌గానే కాదు, డాన్సర్‌గా, తల్లిగా, వైఫ్‌గా కూడా. నేను మంచి డాన్సర్‌గా ఎదగడానికి రోజూ చేసే ప్రాక్టీసే కారణం. అదే ఈ రోజూ మీ అభిమానం పొందటానికి కారణం అయ్యింది' అని తెలిపింది. ప్రస్తుతం ఆమె 'టోటల్ దమాల్', 'కళంక్' చిత్రాల్లో నటిస్తోంది.

సంక్రాంతికి సొంతూర్లకు..



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

హైదరాబాద్ నుంచి విజయవాడకు వెళ్లే ఎన్‌హెచ్ 65 రహదారి వాహనాల రద్దీతో చాలా ప్రాంతాల్లో ట్రాఫిక్ స్తంభిస్తోంది. హైదరాబాద్‌లోని ఎల్బీనగర్ చౌరస్తాలో సొంతూర్లకు వెళ్లేందుకు వేలాది మంది బస్సుల కోసం ఎదురుచూస్తున్నారు. బస్సుల్లో సీట్లకోసం ఎగబడుతున్నారు. సీట్లు దొరక్క నిలబడి ప్రయాణించేందుకూ సిద్ధమవుతున్నారు. ప్రయాణికుల రద్దీతో ఎల్బీనగర్ ప్రాంతమంతా రద్దీగా మారింది. రోజువారీ కంటే ఏడెనిమిది వేల కార్లు అధికంగా జాతీయరహదారిపైకి రావటం, బస్సుల సంఖ్య పెరగటంతో యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలం పంతంగి టోల్‌గేట్ వద్ద ఐదారు కిలోమీటర్ల మేర ట్రాఫిక్ స్తంభించింది. ఒక్కో వాహనం టోల్‌గేట్ దాటేందుకు గంట నుంచి రెండు గంటల వరకు సమయం పడుతున్నది. ట్రాఫిక్ సమస్య తలెత్తడంతో చౌటుప్పల్‌లో విజయవాడవైపు వెళ్లే వాహనాలను పోలీసులు నిలిపేస్తున్నారు. అరగంటకోసారి విడతలవారీ వదులుతూ ట్రిఫిక్‌ను క్రమబద్ధీకరిస్తున్నారు. నల్లగొండ జిల్లా కేతేపల్లి మండలం కొర్లపహాడ్ టోల్‌గేట్ వద్ద కూడా ఇదే పరిస్థితి. కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోవడంతో టోల్‌గేట్ సిబ్బంది ప్రత్యేక చర్యలు తీసుకుని వాహనాలను పంపిస్తున్నారు. మరోవైపు సికింద్రాబాద్ నుంచి రోజువారీగా ఏపీ వైపు వెళ్లే రైళ్లతో పాటు 60 ప్రత్యేక రైళ్లను నడుపుతున్నట్టు దక్షిణ మధ్య రైల్వే అధికారులు చెబుతున్నప్పటికీ ప్రయాణికులు మాత్రం ఇబ్బందులు ఎదుర్కొంటూనే ఉంటున్నారు. బస్సుల్లో అధిక చార్జీలను భరించలేని బడుగు జీవులు సాధారణ బోగీల్లో కూసింత జాగా కోసం పడరాని పాట్లు పడుతున్నారు. ప్రమాదభరితంగా వేలాడుతూ రైళ్లలో ప్రయాణిస్తున్నారు. పిల్లాపాపలు, వృద్ధులతో కలిసి బయలుదేరిన కుటుంబాల వారి పరిస్థితి అయితే మరీ దారుణం.

పొగమంచు ఎక్కువగా ఉండటంతో వాహనాలు కనిపించడకపోవడంతో ప్రధాన రహదారులపై పదుల సంఖ్యలో ప్రమాదాలు జరిగాయి.

వెళ్లాలా..? వద్దా..?

పండగ పూట ఇంటికి వెళ్లాలా? వద్దా? అన్న సందేహంలో సగటు జీవి పడ్డాడు. రిజర్వేషన్లలో టికెట్లు దొరక్క, దొరికినా అదనపు చార్జీలను భరించలేక కుటుంబంతో సహా బస్టాండ్లకు, రైల్వేస్టేషన్లకు వెళ్లిన వాళు అక్కడ రద్దీని చూసి జడుసుకుంటున్నారు. ఏదో కిందా..మీదా పడి ఇంటికెళ్దామని వాళ్లు ముందుకు అడుగు వేసినా అదనపు చార్జీలను చూసి భయపడుతున్నారు. టీఎస్‌ఆర్టీసీ అధికారికంగా అనుకున్నట్టు హైదరాబాద్ నుంచి ఏపీలోని విజయవాడ, రాజమండ్రి, నర్సాపూర్, విశాఖపట్నం, ఏళేశ్వరం, ఒంగోలు, తిరుపతి, నెల్లూరు, పలు పట్టణాలను 1579 బస్సులను నడుపుతున్నట్టు, ప్రయాణీకుల రద్దీతో మరో 500 బస్సుల దాకా తిప్పుతున్నట్టు రంగారెడ్డి రీజియన్ మేనేజర్ యాదగిరి తెలిపారు. సాధారణంగా హైదరాబాద్ నుంచి విజయవాడకు టికెట్ చార్జీ వివిధ బస్సుల్లో రూ.300 నుంచి 1600 రూపాయల వరకు ఉంది. ఇప్పుడు పండగ పేరుతో, రిటర్న్‌లో ఖాళీగా రావాల్సి వస్తుందనే నెపంతో ఆర్టీసీ కూడా రెట్టింపు చార్జీలను వసూలు చేస్తున్నది. ప్రయివేటు వాహనాల వాళ్లు అయితే 'ఇంతైతే వస్తం..లేకుంటే మీ ఇష్టం' మొహం మీదనే చెబుతున్నారు. డిమాండ్‌ను బట్టి వెయ్యి నుంచి మూడు వేల వరకు వసూలు చేస్తున్నారు. ఇంత తాళలేక కొందరైతే ప్రత్యేకంగా క్యాబ్‌లను తీసుకుని వెళు తున్నారు. ఓవైపు సొంతూరుకు వెళ్దామని పిల్లల గోల, ఇంటి నుంచి పెద్దోల కబురుతో తప్పని సరి పరిస్థితుల్లో ప్రయాణికులు వేల రూపాయల చార్జీలను పెట్టి సొంతూర్లకు పయనమవుతున్నారు. ఇగ రోజువారీ కూలీలు, పేదలు అయితే వెళ్లాలా? వద్దా? అనే సంశయంతో కొట్టుమిట్టాడుతున్నారు. పండగ పేరుతో అదనపు బస్సులను ఏపీకి తిప్పుతుండటంతో హైదరాబాద్ నుంచి జిల్లాలకు వెళ్లే ప్రయాణికులు కూడా బస్సుల్లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

ప్రజలంతా సొంతూర్లకు వెళ్తుండటంతో హైదరాబాద్‌లోని రోడ్లపై ట్రాఫిక్ తగ్గింది. ఇప్పటికే ఆంధ్రా ప్రాంతం వాళ్లు ఎక్కువగా ఉండే శేరిలింగంపల్లి, అమీర్‌పేట్, కూకట్‌పల్లి, హైటెక్‌సిటీ, వనస్థలిపురం, తదితర ప్రాంతాల్లో ఇండ్లకు తాళాలు పడటంతో ఆ ప్రాంతాలన్నీ బోసిపోతున్నాయి.

అసలే కూలి బతుకులు...ఇంత కిరాయిలా? : రమణమ్మ, విజయవాడ

కూలిపనులు చేసుకుని బతుకుదామని హైదరాబాద్‌కు వచ్చినం. పండగకు ఇంటికి పోదామని బస్టాఫ్‌లో నిల్చున్న. ఏ బస్సోళ్లని అడిగినా విజయవాడకు రూ.600 నుంచి 700 అడుగుతున్నారు. అవీ మామూలు సిటీ బస్సులే. కూలినాలి చేసుకునేటోళ్లం గంత కిరాయి బెట్టి పోవడం అవసరమా అని మానుకున్న. ఆర్టీసీ బస్సులోల్లు కూడా గింత కిరాయిలు వసూలు చేయటం ఏం బాగోలేదు.

మొన్న రూ.850...నేడు 1200 :సత్య, తుని

మూడు రోజుల కింద తునికి వెళ్లేందుకు రూ.850 పెట్టి టికెట్ బుక్ చేయించుకున్నా. ఈ రోజు టికెట్ బుక్ చేయించుకునేటోళ్లకు రూ.1200 వసూలు చేస్తున్నారు. ఇంత దారుణమా?

చార్జీల దెబ్బతో కొత్తల్లుడికి తిప్పలు



హైదరాబాద్‌కు చెందిన రవి విశాఖపట్నానికి చెందిన శ్రీవీణతో ఇటీవల పెండ్లి జరిగింది. భార్యతో కలిసి తొలిసారి సంక్రాంతి పండగకు అత్తారింటికి వెళ్దామని ఎల్బీనగర్‌లో బస్సుల కోసం రెండుమూడు గంటలు ఎదురుచూశాడు. ఏ బస్సు వాళ్లని చార్జీలు అడిగినా రూ.4000 నుంచి రూ.5000 అనటంతో బిత్తరపోయాడు. మామూలుగానైతే చార్జీ రూ.1200లే. ఇద్దరూ వెళ్దామంటే కిరాయిలే రూ.8 నుంచి 9 వేలు అవుతుండటంతో ప్రయాణాన్ని మానేసుకుందామనుకున్నాడు. కానీ, అసలే కొత్త పెళ్లికొడుకు. పోకుంటే అత్తారింటికాడ ఏమనుకుంటారో అన్న ఆలోచనలో పడ్డాడు. అతని భార్య కూడా ఇంత కిరాయి పెట్టి అవసరం లేదులే అని వారిస్తున్నా.. పరువు ఎక్కడ పోతుందో అన్న బెంగతో పోవటానికే మొగ్గు చూపాడు. కొంత తక్కువ చార్జీకి బస్సు దొరక్కపోతదా అని భార్యతో కలిసి నిలబడ్డాడు. రవి లాంటి కొత్తల్లుడి పరిస్థితే కాదు...చాలా మంది పరిస్థితి ఇదే.

టోల్ రద్దు

ఆది, బుధవారాల్లో టోల్ మినహాయింపు : ఎస్‌కే జోషి

సంక్రాంతి సెలవుల సందర్భంగా ఆది, బుధ వారాల్లో జాతీయ రహదారులపై టోల్ గేట్ ఫీజుల వసూళ్లను రద్దు చేస్తున్నట్టు తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ప్రకటించారు. ఈమేరకు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. సంక్రాంతి పండుగకు ఒకరోజు ముందు, పండుగ తర్వాతి రోజు ఫీజులను వసూలు చేయవద్దని టోల్‌గేట్ నిర్వాహకులను ఆదేశించారు.

మార్కెట్‌లో రైతు మృతి

నవతెలంగాణ- కేసముద్రం రూరల్

మార్కెట్ సిబ్బంది నిర్లక్ష్యం వల్ల ఓ వృద్ధ రైతు ప్రాణం కోల్పోయిన ఘటన మహబూబాబాద్ జిల్లా కేసముద్రం వ్యవసాయ మార్కెట్‌లో శనివారం జరిగింది. స్థానికులు, రైతుసంఘాల నాయకులు తెలిపిన వివరాల ప్రకారం.. గూడూరు మండలం నాయకపల్లి గ్రామానికి చెందిన రైతు నల్లపాడు సత్తయ్య(70) పది బస్తాల ధాన్యాన్ని శుక్రవారం మార్కెట్‌కు తీసుకొచ్చాడు. రాత్రి సమారు 9గంటల సమయంలో ధాన్యాన్ని అధికారులు కొనుగోలు చేశారు. అప్పటికే రాత్రి కావడంతో మార్కెట్‌లో ఉన్న విశ్రాంతి భవనంలో పడుకునేందుకు వెళ్లాడు. కాగా సిబ్బంది అతనిని లోపలికి అనుమతించలేదు. దాంతో రైతు ఓపెన్ షెడ్‌లోనే తన భార్య సత్తమ్మతో కలిసి పడుకున్నాడు. అయితే చలికి తట్టుకోలేక బార్దాన్ సంచులనే దుప్పటిగా వినియోగించారు. అయినా లాభం లేకుండా పోయింది. చలి తీవ్రతకు సత్తయ్య ప్రాణం కోల్పోయాడు. విషయం తెలుసుకున్న రైతు సంఘం నాయకులు, గ్రామస్తులు మార్కెట్‌కు చేరుకుని సత్తయ్య మృతదేహాన్ని మార్కెట్ కార్యాలయంలో ఉంచి ఆందోళనకు దిగారు. మార్కెట్ శాఖ నుంచి రూ.లక్ష, వ్యవసాయ మార్కెట్ శాఖ ఫండ్ నుంచి రూ.లక్ష ఇస్తామని మార్కెట్ కార్యదర్శి మల్లేశం హామీనిచ్చారు. హరికృష్ణ ట్రేడింగ్ కంపెనీ వ్యాపారి చిదురాల వసంత్‌రావు రూ.10వేలు సత్తయ్య దహన సంస్కారాల నిమిత్తం అందజేశారు. విషయం తెలుసుకున్న జేసీ డేవిడ్ ఘటనాస్థలికి చేరుకుని మార్కెట్ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతు కుటుంబానికి తీవ్ర అన్యాయం జరిగిందన్నారు. బాధిత కుటుంబానికి న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామన్నారు.

స్వైన్ ఫ్లూ పంజా

(మొదటిపేజీ తరువాయి)

సంఖ్యలో చికిత్స పొందుతున్నట్టు సమాచారం.

వ్యాధిలక్షణాలు..

సాధారణ ఫ్లూ జ్వరాలు వచ్చే వ్యక్తిలో కన్పించే లక్షణాలన్నీ స్వైన్‌ఫ్లూ బాధితుల్లో కనిపిస్తాయి. ముక్కు కారడం, దగ్గు, గొంతునొప్పి, తుమ్ములు, కళ్ల వెంట నీరు కారడం, ఒళ్లు నొప్పులు ఉంటాయి. కొందరికి వాంతులు, విరేచనాలు అవుతాయి. ఇక గర్భిణులు, శ్వాస కోశ సంబంధిత వ్యాధులతో బాధపడేవారు, చిన్న పిల్లలు, వృద్ధులు, ఊబకాయులకు సులభంగా వ్యాపించే ప్రమాదం ఉంది. వ్యాధి బారిన పడిన వ్యక్తి తుమ్మినప్పుడు, దగ్గినప్పుడు వైరస్ గాల్లోకి ప్రవేశించి రెండు గంటలకుపైగా జీవిస్తుంది. ఫ్లూ లక్షణాలతో బాధపడే వారికి దూరంగా ఉండాలి. ముక్కుకు మాస్కు ధరించడంతోపాటు తరచూ చేతులు శుభ్రం చేసుకోవాలి. ఎక్కువ సార్లు నీళ్ల తాగాలి. జనసమ్మర్ధ ప్రాంతాలకు వెళ్లక పోవడం ఉత్తమం. తీర్థయాత్రలు, ప్రయాణాలు రద్దు చేసుకోవాలి. బహిరంగ ప్రదేశాల్లో ఉమ్మి వేయరాదు. ఇతరులకు షేక్‌హ్యాండ్ ఇవ్వడం, కౌగిలించుకోవడం చేయరాదు. చిన్న పిల్లలతో సహా ఎవరినీ ముద్దు పెట్టుకోరాదని వైద్యులు తెలిపారు.

వచ్చే ఐదేండ్లలో సాగునీటికి 2లక్షల కోట్లు



(మొదటిపేజీ తరువాయి)

సంబంధించి గత నాలుగేండ్ల ఎంత ఖర్చు చేశామనే విషయాన్ని క్షుణ్నంగా పరిశీలించాలని సూచించారు. రాష్ట్రంలోని అన్ని సాగునీటి ప్రాజెక్టులకు కేంద్రం అనుమతులివ్వటంపట్ల ఆయన హర్షం వ్యక్తం చేశారు.

పదిహేను ఆర్థిక సంఘానికి చెందిన బృందం మరికొద్ది రోజుల్లో రాష్ట్రానికి రానున్న నేపథ్యంలో శనివారం హైదరాబాద్‌లోని ప్రగతి భవన్‌లో సీఎం ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. భారత ఆర్థిక వ్యవస్థను గుణాత్మక దిశగా నడిపించేందుకు ఆర్థిక సంఘం నడుం బిగించాల్సి ఉందని ఈ సందర్భంగా ఆయన చెప్పారు. మూస పద్ధతిలో కాకుండా తన పాత్రను వినూత్నంగా తీర్చిదిద్దుకోవాల్సిన అవసరం ఉన్నదని ఆయన అభిప్రాయపడ్డారు. స్వాతంత్ర కాలం నుంచి రాష్ట్ర, జాతీయ స్థాయిలో అనేక పార్టీల ప్రభుత్వాలు వచ్చాయి.. పోయాయి..కానీ అవి ఎలాంటి గుణాత్మక మార్పును తీసుకురాలేక పోయాయని చెప్పారు. ఈ నేపథ్యంలో తిరిగి లోతైన విశ్లేషణ, ఆత్మావలోకనం చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఈ నేపథ్యంలో ఆయా ప్రభుత్వాల విధానాల పట్ల ప్రజలు తీవ్ర అసంతృప్తితో ఉన్నారని.. నిరసనలు వ్యక్తం చేస్తున్నారని చెప్పారు. దీనికి కాంగ్రెస్, బీజేపీ అనే రెండు రాజకీయ వ్యవస్థలే మూలకారణమని సీఎం స్పష్టం చేశారు.

దేశానికి విశాలమైన విత్త విధానం ఉన్నదని సీఎం చెప్పారు. కేంద్రీకరించాల్సిన అధికారాలను అందుకు విరుద్ధంగా కేంద్రీకరించారని విమర్శించారు. పురోగతి సాధిస్తున్న రాష్ట్రాల విధానాల్లో జోక్యం చేసుకోవద్దంటూ తాను నిటి అయోగ్ సమావేశాల్లో చెప్పానని గుర్తుచేశారు. రాష్ట్ర ప్రగతిని దేశ ప్రగతిగా పరిగణించాలి. పురోగతి సాధిస్తున్న రాష్ట్రాలను నిరుత్సాహపరచొద్దు. కొద్ది మోతాదులో నిధులను విడుదల చేయడానికి కూడా అనేక నిబంధనలను విధిస్తున్నారు. రాష్ట్రానికి కేంద్రానికి నడుమ ఉండాల్సిన రాజ్యాంగ సంబంధం రోజురోజుకూ కనుమరుగవుతున్నది. రాష్ట్రాల అధికారాలు, హక్కుల పంపిణీ విషయంలో కేంద్రం అనుసరిస్తున్న వైఖరి రాష్ట్రాలను కించపరిచే విధంగా ఉండటం అత్యంత విచారకరమని ముఖ్యమంత్రి వ్యాఖ్యానించారు.

ఫైనాన్స్ కమిషన్ పాత్రను ప్రస్తావిస్తూ... రాష్ట్రాలలో పర్యటించే క్రమంలో ఫెనాన్స్ కమిషన్ సభ్యులు ముందే ఒక అభిప్రాయాన్ని కలిగి ఉండడం సరికాదని సీఎం వ్యాఖ్యానించారు. రాష్ట్రంలో పర్యటించి ప్రభుత్వంతో చర్చించటం ద్వారా వారి అభిప్రాయాలను పరిగణలోకి తీసుకోవాలన్నారు. అలా కాకుండా క్షేత్ర స్థాయి పర్యటనకు ముందే ఒక అవగాహనతో టర్మ్ ఆఫ్ రిఫరెన్స్ చేయడం సరికాదన్నారు. ఒక్కో రాష్ట్రానికి ఒక్కో సాంస్కృతిక, ఆర్థిక జీవన విధానం ఉంటుందనీ, ఆయా రాష్ట్రాల అవసరాల రీత్యా డివల్యూషన్ అంశాన్ని రాష్ట్రాల హక్కుగా పరిగణించాలని కోరారు. కేవలం విధి విధాఆనల రూపకల్పనకు మాత్రమే ఫైనాన్స్ కమిషన్ పరిమితమైతే మంచిదని సూచించారు.

బడ్జెట్ పై ముందస్తు కసరత్తు...

బడ్జెట్ రూపకల్పనకు సంబంధించి ఏర్పాట్లు, అందుకవసరమైన చర్యలపై కూడా కేసీఆర్ సమీక్షించారు. ప్రజల అవసరాలను అన్నిరంగాల్లో పరిశీలించిన మీదటనే తుది బడ్జెట్‌కు రూపకల్పన చేయాలని స్పష్టం చేశారు. కేవలం ఒక్క ఏడాదికా..? లేకా ఐదేండ్ల పూర్తి కాలానికా..? అనే అవగాహనతో బడ్జెట్‌కు విధి విధానాలు రూపొందించాలని సూచించారు. తెలంగాణ రాష్ట్ర ఆర్థికాభివృద్ధిని మరింత బలోపేతం చేసే దిశగా బడ్జెట్ ఉండాలని సూచించారు. రాబోయే ఐదేండ్ల కాలంలో హైద్రాబాద్‌ను అద్భుతమైన గ్లోబల్ సిటీగా రూపొందిస్తామని సీఎం చెప్పారు. ఇందుకోసం ప్రతిపాదనలు తయారు చేయాలని ఆదేశించారు.

మంత్రులు, కార్యదర్శులకు శిక్షణ...

క్యాబినెట్ రూపొందిన వెంటనే మంత్రులకు, ఆయా శాఖల కార్యదర్శులకు వారి విధులు, బాధ్యతలమీద అడ్మినిస్ట్రేటివ్ స్టాఫ్ కాలేజీ ఆధ్వర్యంలో శిక్షణా కార్యక్రమాలు నిర్వహించాలని సీఎం ఆదేశించారు. రాష్ట్రంతో సహా దేశ ఆర్థిక వ్యవహారాలు, సచివాలయ విధి విధానాలు, బడ్జెట్ రూపకల్పన నిబంధనలు, వాటి పరిమితులు, ప్రాధాన్యతలకు అనుగుణంగా ఆయా మంత్రిత్వ శాఖల్లో చేపట్టే కార్యక్రమాలన్నింటినీ వివరించాలని సూచించారు. సమీక్షా సమావేశంలో ప్రభుత్వ ప్రధాన సలహాదారు డాక్టర్ రాజీవ్ శర్మ, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్‌కే జోషి, ఆర్థికశాఖ సలహాదారు జీఆర్ రెడ్డి, సీఎంవో అధికారులు నర్సింగ్‌రావు, స్మితా సబర్వాల్, సందీప్ కుమార్ సుల్తానియా, మాణిక్ రాజ్, స్పెషల్ సీఎస్ రాజేశ్వర్ తివారీ, ఆర్థికశాఖ ముఖ్య కార్యదర్శి రామకృష్ణారావు, పంచాయతీరాజ్ కార్యదర్శి వికాస్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రేమ జంట గ్రామ బహిష్కరణ



నవతెలంగాణ-వికారాబాద్‌రూరల్

తక్కువ కులం వాడిని పెండ్లి చేసుకుందని కులపెద్దలు కుటుంబంతో పాటు ప్రేమజంటనూ శాశ్వతంగా గ్రామం నుంచి బహిష్కరించారు. దీంతో ఆ కుటుంబం తీవ్ర మానసిక క్షోభను అనుభవిస్తోంది. ఈ విషయం మూడేండ్ల తరువాత వికారాబాద్ జిల్లా సిద్దులూర్‌లో స్థానిక అంగన్‌వాడీ టీచర్ విజయలక్ష్మి చొరవతో శనివారం వెలుగులోకి వచ్చింది. సిద్దులూరు గ్రామానికి చెందిన బంటు అంజయ్య- అనసూజ కుమార్తె సువర్ణ (ముదిరాజ్ సామాజిక తరగతి), కొటాలగూడకు చెందిన వినయ్(ఎస్టీ) మూడేండ్ల కిందట ప్రేమ వివాహం చేసుకున్నారు. వినయ్

కుటుంబం వారిని ఇంటికి రానివ్వలేదు. ఇటు సిద్దులూరులో గ్రామపెద్దలూ అగ్గిమీద గుగ్గిలం అయ్యారు. అంజయ్య కుమార్తె తక్కువ కులం వాడిని పెండ్లి చేసుకుందని ఆ కుటుంబాన్ని సాంఘిక బహిష్కరణ చేశారు. అంజయ్య కుటుంబాన్ని గ్రామంలో మంచి చెడులకు ఎవరూ పిలవడం లేదు. ఇరుగు పొరుగు వారు కూడా వారితో మాట్లాడటం లేదు. దీంతో అంజయ్య కుటుంబం తీవ్ర మానసిక క్షోభకు గురవుతోంది. ప్రాణ భయంతో సువర్ణ-వినయ్ దంపతులు హైదరాబాద్ చేరుకున్నారు. ఒకటి రెండుసార్లు గ్రామానికి వచ్చి అందరితో కలిసిపోయే ప్రయత్నం చేయగా, మీ కుటుంబ సభ్యులను కులం నుంచి బహిష్కరించామనీ, ఇతర కుటుంబాలతో కలిస్తే పరిణామాలు తీవ్రంగా ఉంటాయనీ గ్రామ పెద్దలు హెచ్చరించారు. దీంతో ప్రస్తుతం ఆ దంపతులు హైదరాబాద్‌లో కూలీ పని చేసుకొని జీవిస్తున్నారు. మూడేండ్ల నుంచి వారు గ్రామం ముఖం చూడలేదు. వారికి ప్రస్తుతం ఒక కుమార్తె. ప్రభుత్వం, అధికారులు జోక్యం చేసుకొని కులాంతర వివాహం చేసుకున్న తమకు ప్రభుత్వ ప్రోత్సాహం అందించి ఉపాధి కల్పించాలని కోరుతున్నారు. అలాగే, గ్రామపెద్దలకు కౌన్సెలింగ్ ఇచ్చి తమ కుటుంబాన్ని సాంఘిక బహిష్కరణ నుంచి కాపాడాలని వేడుకున్నారు.

ఎనీ టైం నో వాటర్



(మొదటిపేజీ తరువాయి)

సరఫరానే లేదు. నీరు తాగడానికి ఏర్పాటు చేసిన గ్లాసులను గుర్తు తెలియని వ్యక్తులు తీసుకుపోయారు. వాటి నిర్వహణను జీహెచ్‌ఎంసీ గాలికొదిలేసింది. వేసవి సమీపిస్తున్న నేపథ్యంలో నగరంలోని వాటర్ ఏటీఎంల పనితీరుపై ప్రత్యేక కథనం..

'నగరంలో వాటర్ ఏటీఎంలను ఏర్పాటు చేసేందుకు జీహెచ్‌ఎంసీ నిర్ణయించింది. రూ.1కు లీటర్ చొప్పున రూ.20కు 20 లీటర్లు అందించనున్నాం. ఇప్పటి వరకు 100 ఏర్పాటు చేశాం. 500 ప్రాంతాల్లో ఏర్పాటు చేయడమే లక్ష్యం' అని బేగంపేట్‌లోని పార్కు హోటల్ దగ్గర 100వ వాటర్ ఏటీఎం ఏర్పాటు సందర్భంగా నగర మేయర్ బొంతు రామ్మోహన్ అన్నారు. కానీ వాటర్ ఏంటీఎంలు ఏర్పాటు చేసిన 10-15 రోజులే తప్ప ఎక్కడా నిరంతరంగా పని చేసిన దాఖలాలు లేవు. ఏడాదికాలంగా వీటి గురించి పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. దీంతో విలువైన యంత్రాలు వృథాగా మారాయి. ఏర్పాటు లక్ష్యం మంచిదే అయినా వీటి నిర్వహణను జీహెచ్‌ఎంసీ అధికారులు గాలికొదిలేశారు.

కోటి మందికిపైగా జనాభా కల్గిన మహానగరంలో తాగునీటి సమస్య తీవ్రంగా ఉంది. వాటర్‌బోర్డు ద్వారా ప్రతి రోజూ 450 ఎంజీడీల నీటిని సరఫరా చేసినా ఆయా ప్రాంతాల్లో పనిచేసే ఉద్యోగులు, కార్మికులు, ఇతరులకు వెంటనే తాగునీటిని అందించడం కష్టమే. ముఖ్యంగా వేసవిలో సమస్య తీవ్రంగా ఉంటుంది. వీటన్నింటినీ దృష్టిలో పెట్టుకుని గ్రేటర్‌లో వాటర్ ఏటీఎంలను ఏర్పాటు చేయాలని జీహెచ్‌ఎంసీ నిర్ణయించింది. దీంతో వాటర్ ఏటీడబ్ల్యు(ఎనీ టైం వాటర్) అందించే సంస్థల కోసం ఎక్స్‌ప్రెషన్ ఆఫ్ ఇంట్రెస్ట్ (ఈఓఐ)ను ఆహ్వానించారు. ముందుకొచ్చిన సంస్థల్లో రెండింటిని ఎంపిక చేశారు. రూ.1 లీటర్ నీరు ఇవ్వాలని నిర్ణయించారు. ఆ రెండు సంస్థలతో చేసుకున్న ఒప్పందం ప్రకారం వాటర్ కియోస్క్‌ల ఏర్పాటుకు జీహెచ్‌ఎంసీ స్థలం కేటాయించింది. వాటర్‌బోర్డు నుంచి నీటిని ఉచితంగా సరఫరా చేయాలి. జీహెచ్‌ఎంసీ స్థలం కేటాయించిన ప్రాంతాల్లో ఈఓఐ సంస్థ కియోస్క్‌లను ఏర్పాటు చేసింది. కానీ ఏటీఎంల నిర్వహణను మర్చిపోయారు. వాటర్‌బోర్డు సైతం నీటిని నిరంతరం సరఫరా చేయడం లేదు. ఫలితంగా ఆ యంత్రాలు వృథాగా మారాయి. మిషన్‌లోని గ్లాసులను సైతం ఎత్తుకెళ్లారు. యంత్రాల్లో చెత్తచెదారం పేరుకు పోయి పనికి రాకుండా పోతున్నాయి.

100 కియోస్క్‌లు

జీహెచ్‌ఎంసీ పరిధిలోని 500 ప్రాంతాల్లో వాటర్ కియోస్క్‌లు ఏర్పాటు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. స్వీడన్‌కు చెందిన సుప్రసిద్ధ జోసబ్ ఇంటర్నేషనల్ సంస్థ అందించే సాంకేతిక పరిజ్ఞానంతో ఈ ఏటీఎం మిషన్లను ఏర్పాటు చేస్తున్నట్టు బల్దియా ప్రకటించింది. నీటిలో ఉన్న సహజ సిద్ధమైన మినరల్స్‌ను తొలగించకుండా స్వచ్ఛమైన నీటిని అందించేందుకు ఈ కియోస్క్‌లను ఏర్పాటు చేశారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ, రెడ్‌క్రాస్, రెడ్ క్రీసెంట్ తదితర సంస్థలు నిర్ధారించిన నాణ్యత ప్రమాణాలకు అనుగుణంగా ఈ నీటిని అందిస్తున్నట్టు తెలిపారు. కానీ ఇప్పటికే ఏర్పాటు చేసిన 100 ప్రాంతాల్లో 10-15 తప్ప ఎక్కడా పని చేయడం లేదు. అయినా జీహెచ్‌ఎంసీ అధికారులు పట్టించుకోవడం లేదు. వాటర్‌బోర్డు కూడా నీటి సరఫరా చేయడం లేదని సమాచారం. గ్రేటర్‌లోని కీలకమైన జీహెచ్‌ఎంసీ, వాటర్‌బోర్డు విభాగాలు వాటర్ కియోస్క్‌లను గాలికొదిలేశాయి. అయితే జీహెచ్‌ఎంసీ కమిషనర్‌గా, వాటర్‌బోర్డు ఎండీగా దానకిషోర్ పనిచేస్తున్నారు.

మచ్చుకు కొన్ని

- మలక్‌పేట్‌లోని మహబూబ్ మాన్సన్ మార్కెట్ దగ్గర ఏర్పాటు చేసిన కియోస్క్ పని చేయడం లేదు. నీళ్లులేక మిషన్ వృథాగా మారింది.
- ధర్నాలతో నిత్యం రద్దీగా ఉండే ఇందిరాపార్కు వద్ద ఏర్పాటు చేసిన కియోస్క్ కూడా పనిచేయడం లేదు.
- రామంతాపూర్‌లోని అమ్మ కాన్సెప్ట్‌స్కూల్ పక్కన ఉన్న వాటర్ ఏటీఎం పని చేయడం లేదు. అందులో చెత్తా చెదారం పేరుకు పోయి వృథాగా ఉంది. ఇదే ప్రాంతంలోని గాంధీనగర్‌లో ఉన్న ఏటీఎం కూడా వృథాగా ఉంది. చుట్టూ చెత్తా చెదారం చేరింది.
- గోల్నాక డీమార్ట్ సమీపంలోని వాటర్ ఏటీఎం పని చేయడం లేదు.

చర్యలు తీసుకుంటాం
మేయర్ బొంతు రామ్మోహన్

తాగునీటి సమస్యను తగ్గించడానికి ఏర్పాటు చేసిన ఎనీ టైం వాటర్(ఏటీడబ్ల్యు) కియోస్క్‌లు పనిచేయని చోట పరిశీలించి చర్యలు తీసుకుంటాం. ఈ విషయంపై జీహెచ్‌ఎంసీ, వాటర్‌బోర్డు అధికారులతో చర్చిస్తాం.

భారీ కుట్ర?



(మొదటిపేజీ తరువాయి)

వెనెక్కి తీసుకోవాలని అలోక్‌వర్మను సెంట్రల్ విజిలెన్స్ కమిషనర్ కేవీ.చౌదరీ కోరారు. జన్‌పథ్‌లో ఉన్న అలోక్‌వర్మ నివాసానికి వెళ్లి మరీ కేవీ.చౌదరీ అతనితో మాట్లాడారు. "మేం కోరినట్టు మీరు నడుచుకుంటే, ముందు ముందు అన్ని సమస్యలూ సర్దుకుంటాయి"అని అలోక్‌వర్మకు చెప్పారు. తన మాటల ద్వారా మోడీ సర్కార్ కోరుకుంటున్నదేమిటో తెలిపారు. అయితే సీవీసీ చౌదరి తనను కలుసుకొని మాట్లాడిన విషయాల్ని జస్టిస్ పట్నాయక్ దృష్టికి అలోక్‌వర్మ తీసుకెళ్లారు. సీవీసీ చౌదరి తన నుంచి ఏమి ఆశించి వచ్చారు? ఏం అడిగారు? ఎప్పుడు అడిగారు? అన్నది సవివరంగా రాతపూర్వకంగా జస్టిస్ పట్నాయక్‌కు అలోక్‌వర్మ అందజేశారు.

డైరెక్షన్ అంతా ప్రధాని కార్యాలయం...

రాకేశ్ ఆస్థానాపై ఆరోపణలు చేస్తున్న సమయంలో సీవీసీ చౌదరీ-అలోక్‌వర్మ సమావేశం జరిగింది. బొగ్గు కుంభకోణంలో నిందితుడిగా ఉన్న ప్రధాని కార్యాలయ ఉన్నతాధికారి భాస్కర్ ఖుల్బే నుంచి అలోక్‌వర్మకు ఒక ఫోన్‌కాల్ వచ్చింది. ఈ ఫోన్‌కాల్ వెనుకున్నది రాకేశ్ ఆస్థానాయే. ఇదంతా గ్రహించిన అలోక్‌వర్మ, సీబీఐలో నెం.2 స్థానంలో ఉన్న రాకేశ్ ఆస్థానాపై మండిపడ్డాడు. వాస్తవాలు ఇలా ఉంటే...మరోవైపు ఇవన్నీ దాచేసిన సీవీసీ అలోక్‌వర్మకు వ్యతిరేకంగా సుప్రీంకోర్టుకు నివేదిక ఇచ్చింది. అలోక్‌వర్మతో జరిపిన సమావేశాన్ని మరుగునపెట్టింది. నిజాల్ని మసిబూసి మార్చే ప్రయత్నం చేసింది. కేవలం రాకేశ్ ఆస్థానా కోసం, అతను ఇచ్చిన సమాచారాన్ని ఆధారంగా చేసుకొని సీవీసీ ముందుకెళ్లిందన్నది దీనిని బట్టి తెలుస్తోంది.

శనివారం జాతీయ మీడియాతో మాట్లాడుతూ జస్టిస్ పట్నాయక్ చెప్పినవి మామూలు విషయాలు కావు. తన సమక్షంలో జరిగిన సీవీసీ విచారణలో అలోక్‌వర్మ తప్పుచేసినట్టు తేలలేదనీ, ఎలాంటి ఆధారాలూ లభ్యం కాలేదనీ పట్నాయక్ చెప్పారు. ప్రధాని మోడీ నమ్మకస్తుడు రాకేశ్ ఆస్థానాను రక్షించుకోవడం కోసం సీవీసీని రంగంలోకి దించారని, ఆస్థానాపై రూపొందిన ఆరోపణల నివేదికను మార్చాలన్న ప్రయత్నం జరిగిందనీ ఇప్పుడు తేలిపోయింది.

ఎందుకోసం ఇదంతా చేశారు?

స్పెషల్ డైరెక్టర్‌గా రాకేశ్ ఆస్థానా ప్రవర్తిస్తున్న తీరు, సంస్థ పట్ల అతను చూపుతున్న నిబద్ధత ప్రశ్నార్థకంగా ఉందని "రహస్య నివేదిక"లో అలోక్‌వర్మ ఆరోపించారు. ఈ ఆరోపణలు, ఈ నివేదిక ముందు ముందు రాకేశ్ ఆస్థానాకు ఎక్కడ అడ్డువస్తుందోనని మోడీ సర్కార్ సీవీసీని రంగంలోకి దించింది. సీబీఐ డైరెక్టర్‌గా ఆస్థానాకు ప్రమోషన్ ఇవ్వడానికి ఇది అడ్డువస్తుందని కేంద్రం గాభరాచెందిందని తెలుస్తోంది. దీంతో ఏకంగా సీబీఐ డైరెక్టర్ అలోక్‌వర్మపైనే ఆస్థానా ఎదురు ఆరోపణలు చేశారు. రహస్య నివేదికలో తనపై ఆరోపణలు చేశారన్న అక్కసుతో అలోక్‌వర్మకు వ్యతిరేకంగా పలు తప్పుడు ఆరోపణలు చేశారు.

ఈ మొత్తం వ్యవహారంలో నిందితుడిగా బోనులో నిలబడాల్సింది ఎవరు? అంటే రాకేశ్ ఆస్థానానే. కానీ మోడీ సర్కార్ ఏం చేసింది? అలోక్‌వర్మను బోనులో నిలబెట్టింది. తప్పుడు ఆరోపణలతో ఆయనపై బదిలీ వేటు వేసింది. ఇదంతా చూసిన జస్టిస్ పట్నాయక్ కేంద్రం తీరును తీవ్రంగా ఖండించారు. అలోక్ వర్మపై కేంద్రం తీసుకున్న నిర్ణయం తనను చాలా చాలా నిరాశపర్చిందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ మాటల్ని శనివారం జాతీయ మీడియా ముందు మరోసారి చెప్పారు.

జాతీయ మీడియాలో సంచలనం రేపుతున్న సీబీఐ సంక్షోభంపై సీవీసీ చౌదరీ వ్యాఖ్యానించడానికి నిరాకరించారు. మొత్తంగా చూస్తే సీబీఐ డైరెక్టర్ పదవి నుంచి అలోక్‌వర్మను తప్పించడానికి తెరవెనుక పెద్ద తతంగమే నడిచింది. ఆస్థానా కోసం మోడీ సర్కార్ నైతికంగా ఎన్ని మెట్లు కిందకు దిగాలో అన్ని మెట్లూ దిగేసింది. ఈ వ్యవహారంలో కేంద్రం ఎన్నో అడ్డదారులు తొక్కిందన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

అలోక్‌పై అవినీతి ఆధారాల్లేవు

న్యూఢిల్లీ : పదవీచ్యుతుడైన సీబీఐ డైరెక్టర్ అలోక్‌వర్మ అవినీతికి పాల్పడ్డారనడానికి ఎలాంటి సాక్ష్యాధారాలు లేవని సుప్రీం కోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ ఎ.కె.పట్నాయక్ తెలిపారని ఇండియన్ ఎక్స్‌ప్రెస్ కథనం పేర్కొంది. అలోక్‌వర్మపై కేంద్ర విజిలెన్స్ కమిషన్ (సీవీసీ) విచారణ పర్యవేక్షణా బాధ్యతలు పట్నాయక్‌కే అప్పగించారు. సుప్రీం కోర్టు అలోక్‌వర్మను తిరిగి సీబీఐ డైరెక్టర్‌గా నియమించిన రెండు రోజులకే ఈ నెల 10న ఆయనను ఆ పదవి నుంచి తొలగించారు. ప్రధాని నరేంద్ర మోడీ నేతృత్వంలోని సెలక్షన్ కమిటీ సమావేశంలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు. అవినీతికి పాల్పడ్డారని, విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహించారని మొత్తంగా ఎనిమిది అభియోగాలు మోపుతూ సివిసి ఇచ్చిన నివేదికను సమావేశం పరిగణనలోకి తీసుకుంది. ఆ నివేదికలోని నిర్ధారణలన్నీ సీవీసీవి తప్ప, తనవి కావని జస్టిస్ పట్నాయక్ పునరుద్ఘాటించారు. అవినీతికి సంబంధించి వర్మపై ఎలాంటి సాక్ష్యాలు లేవు, సీబీఐ స్పెషల్ డైరెక్టర్ రాకేష్ అస్తానా ఫిర్యాదుపై మొత్తం విచారణ జరిగింది. "సీవీసీ నివేదికలోని నిర్ధారణల్లో ఏ ఒక్కటీ కూడా నాది కాదని నా నివేదికలో చెప్పాను." అని ఆయన పేర్కొన్నారు. అస్తానా, వర్మ ఇరువురూ పరస్పరం అవినీతి ఆరోపణలు చేసుకున్నారు. దాంతో గతేడాది అక్టోబరులో ఇరువురు అధికారులను కేంద్రం సెలవుపై పంపింది. ఇదంతా కూడా ప్రతిష్టాకరమైన ఒక జాతీయ సంస్థకు చెందినదైనందున వర్మ కేసుపై నిర్ణయం తీసుకోవడానికి సెలక్షన్ కమిటీ మరికొంత సమయం తీసుకుని వుండాల్సిందని పట్నాయక్ అభిప్రాయపడ్డారు. ఉన్నత స్థాయి కమిటీ నిర్ణయిస్తుందని సుప్రీంకోర్టు చెప్పినప్పటికీ ఆ నిర్ణయం చాలా చాలా తొందరపాటు అని ఆయన అన్నారు. "వారు పూర్తిగా మనస్సు లగ్నం చేసి మరీ ఆలోచించి వుండాల్సింది, ఎందుకంటే అక్కడ వున్నది సుప్రీం కోర్టు న్యాయమూర్తి అని అన్నారు. సీవీసీ చెప్పినది ఇక్కడ తుది మాట కాబోదని ఆయన స్పష్టం చేశారు. వర్మను తొలగించేందుకు మోడీ, జస్టిస్ సిక్రి ఓటు వేయగా, ఖార్గె అసమ్మతి నోట్ దాఖలు చేసి, సీవీసీ నివేదికలోని అంశాలను ప్రశ్నించారు. సెలక్షన్ కమిటీ ముందు తన వాదన వినిపించడానికి వర్మకు ఒక అవకాశం కల్పించాలని కోరారు. సీవీసీ నివేదికలోని నిర్ధారణలను తనవి కావని స్పష్టం చేస్తూ సుప్రీం కోర్టుకు ఒక లేఖ కూడా రాశానని పట్నాయక్ చెప్పినట్లు ది టెలిగ్రాఫ్ పేర్కొంది. "విచారణను పర్యవేక్షించడం వరకే నా పాత్ర. అందుకోసం సహజ న్యాయ సూత్రాలను పాటించాలనుకున్నాను.సానా స్టేట్‌మెంట్‌ను నా సమక్షంలోనే రికార్డు చేశారు." అని పట్నాయక్ ఆ లేఖలో పేర్కొన్నారు. సాక్ష్యాధారాలు సరిగా రికార్డు చేశానని తాను హామీ ఇవ్వగలనని చెప్పారు. 14రోజుల్లోగా విచారణ ముగిసిందని చెప్పారు. ఫైర్ సర్వీసెస్ డైరెక్టర్ జనరల్‌గా బాధ్యతలు తీసుకోవడానికి నిరాకరించిన వర్మ శుక్రవారం సర్వీసు నుండి వైదొలగుతూ రాజీనామా చేశారు.

సీబీఐకి మరింత స్వేచ్ఛ

సీబీఐకి మరింత స్వాతంత్ర్యం ఇవ్వాలని భారత మాజీ ప్రధాన న్యాయమూర్తి ఆర్.ఎం.లోధా శుక్రవారం పేర్కొన్నారు. రాజకీయ కార్యనిర్వాహక వర్గం నుంచి సీబీఐకి రక్షణ కల్పించాల్సిన అవసరం ఎంతైనా వుందన్నారు. అధికారంలో ఎవరున్నా దానితో నిమిత్తం లేకుండా ఎప్పుడైతే రాజకీయ వర్గాలు సీబీఐపై పట్టు సాధించాలని ప్రయత్నిస్తాయో అప్పుడు ఇలాంటి సంఘటనలే జరుగుతాయని లోధా వ్యాఖ్యానించారు.

సెన్సెక్స్ ▼ 97	నిఫ్టీ ▼ 27	డాలరుకు రూపాయి విలువ	బంగారం(10.గ్రా)	వెండి (కేజీ)
36,009	10,794	70.50	రూ. 31,943	రూ. 39,259

శనివారం మార్కెట్లు ముగిసే సమయానికి

కోడిగుడ్లు (వందకి)			
హైదరాబాద్	433	విజయవాడ	441
ఒక్కగుడ్డుకు	4.70	చెన్నై	455
వరంగల్	433	ముంబయి	484

రుణాల రికవరీపై ప్రత్యేక నజర్!

- 1500 ఉద్యోగులతో ప్రత్యేక రికవరీ బృందాలు
- రంగంలోకి ప్రత్యేకంగా ఎనిమిది శాఖలు
- ఆరు నెలల్లో 1500 కోట్ల రికవరీకి ఛాన్స్
- వ్యవసాయంలో పెరగనున్న మొండి బాకీలు:

సిండికేట్ బ్యాంక్ ఎండీ, సీఈవో మహాపాత్ర



నవతెలంగాణ, వాణిజ్య విభాగం: నిరర్థక ఆస్తుల సమస్యను పరిష్కరించు కొనేందుకు ప్రత్యేక ప్రణాళికతో ముందుకు సాగుతున్నట్టుగా సిండికేట్ బ్యాంక్ మేనేజింగ్ డైరెక్టర్, చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ మృత్యుంజయ్ మహాపాత్ర తెలిపారు. శనివారం ఆయన హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాట్లాడుతూ గత సెప్టెంబరు నాటికి బ్యాంక్ 12.9 శాతం స్థూల, 6.8 శాతం నికర నిరర్థక ఆస్తులను కలిగి ఉందని తెలిపారు. అయితే మార్చి ముగింపు నాటికి వీటిని తగ్గించుకొనేందుకు సమ్మిళితంగా తాము ప్రత్యేక ప్రణాళికతో ముందుకు సాగుతున్నట్టుగా ఆయన తెలిపారు. ఇందులో భాగంగా 1500 మంది ఉద్యోగులతో రుణ వసూలు బృందాలను తయారు చేసినట్టుగా మహాపాత్ర వెల్లడించారు. దీనికి తోడు ఎనిమిది ప్రత్యేక శాఖలు రుణ రికవరీ కోసం ప్రత్యేకంగా పని చేస్తున్నట్టుగా ఆయన వివరించారు. ఈ ప్రత్యేక శాఖలు నేరుగా కార్పొరేట్ కార్యాలయంతో నిరంతరం సంప్రదింపులు జరుపుతు రుణ రికవరీ ప్రక్రియను ముందుకు తీసుకుపోతున్నట్టుగా ఆయన వివరించారు. వచ్చే మూడు నుంచి ఆరు నెలల కాలంలో నిరర్థక ఆస్తుల నుంచి దాదాపు రూ.1500 కోట్ల రుణాలను రికవరీ చేయగలమన్న విశ్వాసాన్ని ఆయన ఈ సందర్భంగా వ్యక్తం చేశారు. ఎన్‌సీఎల్‌టీ, ఎన్‌సీఎల్‌టీ యేతర మార్గాల ద్వారా రుణాల రికవరీ జరపనున్నట్టుగా ఆయన వివరించారు. ప్రభుత్వాలు రుణ మాఫీ చేపడుతాయన్న భావనల నేపథ్యంలో అన్నదాతలు బ్యాంకు రుణాలు చెల్లింపునకు వెనకాడుతున్న నేపథ్యంలో రానున్న రోజుల్లో వ్యవసాయ రుణాల మొండి బాకీలు 14 శాతానికి చేరే అవకాశం ఉందని ఆయన వివరించారు. ఈ విషయాన్ని బ్యాంక్ ప్రత్యేకంగా పరిశీలిస్తోందని ఆయన వివరించారు. నిరర్థక ఆస్తుల మొత్తం నుంచి రుణాల రికవరీతో పాటు సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలకు రుణాల జారీని పెంచడం ద్వారా వచ్చే జూన్ నాటికి బ్యాంక్ లాభాల్లోకి రాగలదని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. మార్చి నాటికి బ్యాంక్ బ్రేక్ ఈవెన్‌ను చేరుతుందని అన్నారు. సెప్టెంబరుతో ముగిసిన ఆరు నెలల కాలానికి సిండికేట్ బ్యాంక్ రూ.2825 కోట్ల మేర నష్టాలను నమోదు చేసింది. ఎంప్లాయిస్ స్టాక్ పర్చేజ్ పథకంలో(ఈఎస్‌పీఎస్) భాగంగా జనవరి–ఫిబ్రవరి మాసాల్లో బ్యాంక్ ఉద్యోగులకు సాక్ట్స్‌ను జారీ చేయడం ద్వారా రానున్న రోజుల్లో రూ.500 కోట్ల వరకు నిధులను సమీకరించనున్నట్టుగా మహాపాత్ర తెలిపారు. అక్టోబరు డిసెంబరు మధ్య కాలంలో బ్యాంక్‌కు అందిన మూలధనీకరణ నిధులకు ఇది అదనమని ఆయన తెలిపారు.

ఆధార్‌తో ఆదా గాలి మాటలేనట!

77 వేల కోట్ల మిగులు వాస్తవ లెక్క కాదు

- నివేదికలో ఆదా సమాచారాన్ని మేము లెక్కించ లేదు..
- అసలు విషయం వెల్లడించిన ప్రపంచ బ్యాంక్ వర్గాలు
- తప్పుడు సమాచారంతో సుప్రీంకు సర్కారుఅఫిడవిట్..
- వెంకట నారాయణన్ శోధనతో వెలుగులోకి నిజాలు
- 90 వేల కోట్ల ఆదా అంటూ అరుణ్ జైట్లీ కొత్త లెక్క..
- అసలు ఆదా తేల్చడం అంత సులువుకాదు: విశ్లేషకులు



న్యూఢిల్లీ: ప్రభుత్వం అందుబాటులోకి తెచ్చిన విశిష్ట గుర్తింపు సంఖ్య ఆధార్‌తో ప్రభుత్వ సంక్షేమ పథకాల దుర్వినియోగం తగ్గుతోందని..వీటి ద్వారా కేంద్రానికి ఏటా వేలాది కోట్ల రూపాయలు మిగులుతున్నాయని ప్రభుత్వం చెబుతున్న లెక్క ఉత్త గాలి లెక్కేనని తేలిపోయింది. ఆధార్ అద్భుతమైన పథకమని దీని వల్ల ఖజానాకు మేలు జరుగుతోందని ప్రధాన మంత్రి మొదలు కొని ఆర్థిఖ మంత్రి వరకు ఊకదంపుడుగా ఊదరకొట్టడం మనం వినే ఉంటాం. సాక్షాత్తు కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ ఇదే విషయమై ఇటీవల మాట్లాడుతూ ఆధార్ దేశ ముఖచిత్రంలో సమూల మార్పులకు శ్రీకారం చుట్టిందని.. ఆధార్‌తో ఆదా అయిన డబ్బుతో ఆయుష్మాన్ భారత్ వంటి మూడు భారీ కార్యక్రమాలను చేపట్టే వెసులుబాటు కలిగిందని వెల్లడించారు. ఆధార్ ప్రయోజనాల పేరుతో జైట్లీ ఫేస్‌బుక్‌లో పోస్ట్ చేస్తూ సబ్సిడీల పంపిణీలో ఆధార్ వాడకంతో గత కొన్నేళ్లుగా రూ.90 వేల కోట్లు ఆదా అయ్యాయని వెల్లడించారు. ఇదే విషయాన్ని ప్రపంచ బ్యాంక్ కూడా వెల్లడించిందని ఆయన అన్నారు. భారత్‌లోనే ఈ వినూత్న టెక్నాలజీ అందుబాటులో ఉందన్నారు. ఆధార్ వాడకం ద్వారా ఆదా అవుతున్న మొత్తం పేదల సంక్షేమానికి చేరుతోందని చెప్పుకొచ్చారు. ఆధార్ వల్ల ఏటా ప్రభుత్వానికి 77 వేల కోట్ల రూపాయలు మిగులుతున్నాయని పదే పదే చెప్పడమే కాకుండా, ఈ విషయాన్ని సాక్షాత్తు ప్రపంచ బ్యాంకు తన '2016 వార్షిక నివేదిక'లోనే వెల్లడించిందని చెప్పారు . అంతేకాకుండా ఆధార్ కార్డుల రాజ్యాంగబద్ధతను సుప్రీంకోర్టులో సవాల్ చేసినప్పుడు ప్రభుత్వం సమర్పించిన అఫిడవిట్‌లో కూడా ఈ 'ప్రపంచ బ్యాంకు లెక్కల'నే అఫిడవిట్‌లో పేర్కొన్నారు. అయితే తాజాగా ఈ లెక్కలన్నీ నిరాధారమైనవేనని తెలింది.ఆధార్‌తో ప్రభుత్వానికి కలుగుతున్న ఆదా లెక్కల్లో నిజమెంత, ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాల్లో ఏ మేరకు దుర్వినియోగాన్ని అరికట్ట గలిగారు, ఆర్థికంగా దాని విలువెంతో మన ఆర్థికవేత్తలకే ఇంతవరకు అంతు చిక్కడం లేదు. అలాంటప్పుడు ప్రపంచ బ్యాంకు అంత కచ్చితంగా ఎలా లెక్కకట్టింది? దానికి ఆ లెక్కలు ఎవరు చెప్పారు? అనే సందేహం సైబర్ సెక్యూరిటీ పరిశోధకుడు ఆనంద్ వెంకట నారాయణన్‌కు కలిగింది. ఆయన భారత పొదుపు మీద '2016 ప్రపంచ బ్యాంకు నివేదిక'ను రూపొందించిన అధికారులకు 'ఈ 77 వేల కోట్ల రూపాయలు మిగులుతున్నాయని ఎలా లెక్కించారు?' అంటూ 2017, అక్టోబరులో ఒక ఈమెయిల్ రాశారు. వారి వద్ద నుంచి ఎలాంటి సమాధానం రాలేదు. 2018, ఫిబ్రవరి 9వ తేదీన ఆ ప్రశ్నకు మరిన్ని అనుబంధ ప్రశ్నలను జోడించి వెంకట నారాయణన్ మళ్లీ ఈ మెయిల్ పంపించారు. ఈసారి బ్యాంకు నుంచి సమాధానం వచ్చింది. అయితే అందులో అధికారుల పేర్లను పేర్కొనలేదు. అది కూడా గణాంకాలతో పొంతన లేకుండా..' మొట్టమొదటి అంశంగా 11 బిలియన్ డాలర్లు (దాదాపు 77 వేల కోట్ల రూపాయలు) వాస్తవ లెక్క కాదు అని తెలిపింది. అంత మిగిలే అవకాశం ఉందన్నది తమ అంచనా అని తెలిపింది. రెండోది ఇది తమ ప్రపంచ బ్యాంకు సిబ్బంది వేసిన అంచనా కాదని తేల్చి చెప్పింది. విద్యావేత్తలు, ఆర్థిక వేత్తలు వేసిన అంచనా అని తెలిపింది. మూడవ వివరణగా సమాధానం ఇస్తూ అంచనా మేరకు భారత ప్రభుత్వం 11 బిలియన్ డాలర్ల దుర్వినియోగాన్ని అరికట్టాలన్నది ప్రపంచ బ్యాంకు ఆకాంక్ష అని వివరించింది. . నివేదిక పీఠికలో ఇది ఒక అంచనా అన్నది సూచించాం' అని ప్రపంచ బ్యాంకు స్పష్టం చేసింది. ఆ మరుసటి రోజే వెంకట నారాయణన్ మరో అనుబంధ పశ్నను పంపించారు. ప్రపంచ బ్యాంకు సీనియర్ అధికారులు.. ఆధార్ మంచి పథకం, దాని వల్ల కోట్లాది రూపాయలు మిగులుతున్నాయని ఎందుకు మాట్లాడుతున్నారన్నది ఆ ప్రశ్న. దానికి కూడా ప్రపంచ బ్యాంకు నుంచి సమాధానం వచ్చింది. అందులో ' ఆధార్ లాంటి డిజిటల్ గుర్తింపు వ్యవస్థ ప్రయోజనాల గురించి ప్రపంచ బ్యాంకు సీనియర్ అధికారులు మాట్లాడడం సహజమే. ఏ దేశంలోనైనా అభివృద్ధి ప్రక్రియ సమ్మిళితంగా, సమర్థంగా జరగాలి. అభినందించడమనేది లేకపోవడం వల్ల అది జరగడం లేదు. అభినందనల వల్ల జవాబుదారీ ప్రభుత్వమే కాకుండా సంస్థలు కూడా సానుకూలంగా స్పందిస్తాయన్నది మా విశ్వాసం' అని పేర్కొంది.

రూ.77 వేల కోట్లు లెక్క ఎలా వచ్చిందంటే..

మొత్తం గందరగోళానికి కారణమైన రూ.77 వేల కోట్ల రూపాయల ఆదా అంశం కేవలం అంచనా అన్నది అలహాబాద్ ఐఐఎం అసోసియేట్ ప్రొఫెసర్‌గా పని చేస్తున్న ఆర్థిక వేత్త, సామాజిక శాస్త్రవేత్త రీతికా ఖెరా 2016, జూలై 21వ తేదీన ఎన్‌డీటీవీ వెబ్‌సైట్‌కు రాసిన వ్యాసంలో తొలిసారిగా వెలుగులోకి వచ్చింది. ఈ మొత్తం అప్పట్లో ప్రభుత్వం డైరెక్ట్ బెనిఫిట్ స్కీంలో చేసిన లావాదేవీలే మొత్తమట. కాగా, ఆధార్ గుర్తింపును దేశంలోని వివిధ రాష్ట్ర ప్రభుత్వాలు పలు పథకాలకు వాడుతున్నందున వాస్తవంగా ఈ విశిష్ట గుర్తింపు కార్డు వాడకం వల్ల ఎంత మొత్తం సర్కారుకు ఆదా అవుతోందన్న విషయం విశ్లేషించుకొని లెక్క తేల్చడం అంత సులువు కాదని ఆర్థిక వేత్తలు చెబుతున్నారు. అయితే ప్రభుత్వం చెబుతున్నత గరిష్ట స్థాయిలో ఆదా ఉంటుందన్నది నమ్మశక్యం కాదని వారంటున్నారు.

ప్రకటన కోరితే.. దాటవేతే సమాధానం..

ప్రపంచ బ్యాంక్ వెల్లడించిన ఆధార్ ఆదా లెక్కలు తమ దేశంలో గందరగోళానికి దారితీసిందని, రూ.77 వేల కోట్ల ఆదా అన్నది వాస్తవం కాదని, అది ఒక అంచనా మాత్రమేనంటూ అంటూ ఓ బహిరంగ ప్రకటన చేయాల్సిందిగా వెంకట నారాయణన్ ఎన్నిసార్లు ప్రపంచ బ్యాంకు అధికారులను కోరినా 'త్వరలో విడుదల చేస్తాం' అన్న వ్యాక్యం తప్పిస్తే ఇంతవరకు ప్రకటన వెలువడలేదు. ఆయన ఇటీవల కూడా ప్రపంచ బ్యాంకు అధికారులను సంప్రదించగా, ఢిల్లీలోని ప్రపంచ అధికారులను సంప్రదించాల్సిందిగా సూచించారట. ప్రస్తుతం ఆయన ఆ పనిలో పూర్తిగా నిమగ్నమై ప్రపంచ బ్యాంక్‌పై పోరు చేస్తున్నారు.

యెస్ బ్యాంక్ బోర్డు చైర్మెన్‌గా బ్రహ్మదత్



న్యూఢిల్లీ: తమ బ్యాంక్ బోర్డు చైర్మెన్‌గా మాజీ ఐఏఎస్ అధికారి బ్రహ్మదత్‌ను(70) నియమించుకున్నట్టుగా దేశంలో నాలుగో అతిపెద్ద ప్రయివేటు బ్యాంకింగ్ సంస్థ యెస్ బ్యాంక్ వెల్లడించింది. బ్యాంక్ బోర్డుకు తాత్కాలిక చైర్మెన్‌గా దత్‌ను నియమించుకొనేందుకు గాను భారతీయ రిజర్వు బ్యాంక్ సమ్మతి తెలిపినట్టుగా యెస్ బ్యాంక్ ఒక ప్రకటనలో తెలిపింది. దత్ ఈ పదవిలో 2020 జులై4 వరకు కొనసాగనున్నట్టుగా బ్యాంక్ వర్గాలు తెలిపాయి. 2013 నుంచి దత్ యెస్ బ్యాంక్ బోర్డులో స్వతంత్ర డైరెక్టరుగా సేవలందిస్తున్నారు. గడిచిన 5.5 యేండ్ల కాలంగా ఆయన బ్యాంక్‌కు చెందిన వివిధ సబ్ కమిటీలలో తన వంతు సేవలను అందించినట్టుగా బ్యాంక్ యెస్ బ్యాంక్ తెలిపింది. ఐఏఎస్ అధికారిగా దత్ దాదాపు 37 సంవత్సరలపాటు కర్ణాటక ప్రభుత్వంలోను, కేంద్ర ప్రభుత్వంలోను పని చేశారు.

ఎయిరిండియా ఆదాయంలో వృద్ధి




న్యూఢిల్లీ: ప్రభుత్వ రంగ విమానయాన సంస్థ ఎయిరిండియా క్రమంగా తన పనితీరును మెరుగుపరుచుకుంటోంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం అక్టోబర్ నుంచి డిసెంబర్‌తో ముగిసిన మూడో త్రైమాసికం (క్యూ3)లో కంపెనీ రెవెన్యూలో 20 శాతం వృద్ధి నమోదయ్యింది. కాగా ప్రయాణికుల సంఖ్యలో మాత్రం 4 శాతం పెరుగుదల చోటు చేసుకుంది. 2018-19 క్యూ3లో ప్రయాణికుల నుంచి రూ.5,538కోట్ల రెవెన్యూ వచ్చిందన్నారు. 2017-18 ఇదే డిసెంబర్‌తో ముగిసిన త్రైమాసికంలో రూ.4,615కోట్ల ఆదాయం నమోదయ్యిందని సంస్థ అధికారి తెలిపారు. ఇదే సమయంలో 53.28లక్షల ప్రయాణికులను గమ్యానికి చేర్చామని సదరు అధికారి తెలిపారు.

ఐడీఎఫ్‌సీ బ్యాంక్ పేరు మారింది..

న్యూఢిల్లీ: ప్రయివేటు రంగ బ్యాంకింగ్ సంస్థ ఐడీఎఫ్‌సీ బ్యాంక్ పేరు మారింది. తమ బ్యాంక్ పేరును 'ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంక్ లిమిటెడ్'గా మార్చుతున్నట్టుగా విత్త సంస్థ బీఎస్‌ఈ దాఖలు చేసిన ఫైలింగ్‌లో తెలిపింది. బ్యాంక్ పేరు మార్పు శనివారం నుంచి తక్షణం అమలులోకి వచ్చినట్టుగా ఐడీఎఫ్‌సీ బ్యాంక్ వెల్లడించింది. పేరు మార్పుకు సంబంధించి తమకు చెన్నైకి చెందిన 'రిజిస్ట్రార్ ఆఫ్ కంపెనీస్' నుంచి ధ్రువపత్రం అందినట్టుగా బ్యాంక్ తెలిపింది. బ్యాంకింగేతర ఆర్థిక సంస్థ క్యాపిటల్ ఫస్ట్, ఐడీఎఫ్‌సీ బ్యాంకులు తమ విలీనపు ప్రక్రియ డిసెంబరు 18తో ముగిసినట్టుగా తెలిపాయి. దీనికి అనుగుణంగానే రెండు సంస్థల పేర్లు వచ్చేలా ఇప్పుడు ప్రయివేటు విత్త సంస్థ పేరును 'ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంక్ లిమిటెడ్'గా మార్చారు.

పంచాయతీల్లో పార్టీల పెత్తనం

- ఎన్నికలకు సామాన్యులు దూరం
- పార్టీ రహిత ఎన్నికల్లో కండువాలతో నామినేషన్లు



నవతెలంగాణ బ్యూరో–హైదరాబాద్

పంచాయతీ ఎన్నికల్లో రాజకీయ పార్టీల పెత్తనం కొనసాగుతున్నది. దీంతో ప్రశాంతంగా ఉన్న గ్రామాల్లో రాజకీయ వైశమ్యాలు పెరిగిపోతున్నాయి. పంచాయతీల్లో ఎన్నికలు జరగకుండా ఏకగ్రీవానికే పార్టీ నేతలు మొగ్గు చూపుతున్నారు. ఎలాగైనా పార్టీ బలపర్చిన అభ్యర్థిని గెలిపించుకోవడానికి సామాన్య ప్రజలు ఎన్నికల్లో పోటీ చేయకుండా అడ్డుకుంటున్నారు. ప్రధానంగా టీఆర్ఎస్ నేతలు గ్రామాల్లో తిష్టవేసి పంచాయతీల్లో వీలైనంత వరకు ఏకగ్రీవం చేసి తమ వారికి పదవి కట్టబెట్టే ప్రయత్నాలు చేస్తున్నారు. పంచాయతీల్లో ఏకగ్రీవం కోసం కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తున్నట్టు సమాచారం.

కండువాలతో నామినేషన్లు

పార్టీ రహిత ఎన్నికల్లో రాజకీయ పార్టీలు బలపర్చిన అభ్యర్థులు ఆ పార్టీ కండువాలు వేసుకుని నామినేషన్లు దాఖలు చేయడం గమనార్హం. ఇది ఎన్నికల నిబంధనలకు విరుద్ధమైనా ఎన్నికల సంఘం ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదన్న విమర్శలు వస్తున్నాయి. నామినేషన్ వేయడానికి ప్రధాన పార్టీల నేతలు వారి వెంట రావడంపై సామాన్యులు మండిపడుతున్నారు. ప్రధానంగా అన్ని పంచాయతీల్లోనూ టీఆర్ఎస్ కండువాలు కప్పుకుని నామినేషన్లను దాఖలు చేస్తున్నారు. దీనివల్ల అభ్యర్థుల మధ్య ఘర్షణలు చోటు చేసుకుంటున్నా ఎన్నికల సిబ్బంది ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు. పంచాయతీల్లోనూ ప్రజాకూటమి తరపున అభ్యర్థులను ప్రకటిస్తుండటంతో కాంగ్రెస్, టీడీపీ వర్గాల మధ్య ఘర్షణలు చోటు చేసుకుంటున్నాయి. శుక్రవారం భద్రాచలం నియోజకవర్గంలో ఇలాంటి ఘటనలు చోటు చేసుకోవడంతో ఇరువర్గాల వారిపై పోలీసులు కేసునమోదు చేశారు.

రాజకీయాలకు పేదలు దూరం

పంచాయతీ ఎన్నికల్లో అగ్రకులాల ఆధిపత్యం, డబ్బు, పలుకుబడి కలిగిన వారికే ప్రాధాన్యం ఇస్తుండటంతో పేదలు రాజకీయాలకు దూరమవుతున్నారు. పైగా బీసీ రిజర్వేషన్లలో తగ్గించడం, ఏబీసీడీఈ వర్గీకరణ చేపట్టకపోవడంతో అటు బీసీల్లోనూ.. ఇటు సాధారణ స్థానాల్లోనూ ధనిక వర్గాల ఆధిపత్యమే కొనసాగుతున్నది. పేద, మధ్య తరగతి కుటుంబాలు కేవలం నామినేషన్లకే పరిమితం అవుతున్నారు. ఎన్నికలకు ముందే ధనబలం కలిగిన అభ్యర్థులు ఓటర్లను తమవైపు తిప్పుకోవడం, వారిని ప్రలోభాలకు గురి చేస్తుండటంతో పేద, మధ్య తరగతి వర్గాల వారికి గెలిచే అవకాశం లేకుండా చేస్తున్నారు. స్వేచ్ఛగా, పారదర్శకంగా ఎన్నికలు జరగకుండా వీలైనంత వరకు ఏకగ్రీవానికే అగ్రకులాలు, ధనికులు మొగ్గు చూపుతున్నారు.

వెనుకబడిన వారే ఉన్నా..

గ్రామాల్లో అధిక శాతం ఎస్సీ, బీసీలే ఉన్నా అగ్రకులాల ఆధిపత్యమే నడుస్తున్నది.రిజర్వేషన్ స్థానాల్లోను వారి అనుయాయులనే పోటీలోకి దించుతున్నారు. వారు సూచించిన అభ్యర్థులకే ఓటు వేయాలని హుకుం జారీ చేయడం గమనార్హం. వెనుకబడ్డ కులాల్లోని వారందరూ రాజకీయల్లో రాణించాలన్న ఉద్దేశంతో ఏర్పాటు చేసిన రిజర్వేషన్ల ఆశయం నీరుగారిపోతున్నది.

పల్లెల్లో బహిష్కరణ పీడ

వారితో కలుపుగోలుతనానికి దూరం

- 'మంథని'లో గ్రామానికి దూరంగా ఎస్సీలు
- కేసుల్లో నిందితులకు పడని శిక్షలు

బాధితులను వెంటాడుతున్న ఉదంతాలు



మంథని గ్రామం..

నవతెలంగాణ–నిజామాబాద్ ప్రతినిధి

పెత్తందార్ల ఆగడాలతో బహిష్కరణకు గురవుతున్న దళితులకు, ఇతర బలహీనవర్గాలకు ఆ బాధలు ఏండ్లుగా వెంటాడుతున్నాయి. జిల్లా అధికారులు, పోలీసుల సమక్షంలో గొడవలు సద్దుమణినట్టే అనిపించినా బాధితులకు మాత్రం బహిష్కరణ వెతలు తప్పడం లేదు. వారితో కలుపుగోలుగా మాట్లాడకుండా అంటీముట్టనట్టు వ్యవహరిస్తూ మానసికంగా కుంగదీస్తున్నారు. దీంతో ఎటూ పాలుపోక బాధితులు బిక్కుబిక్కుమంటూ గడుపుతున్న పరిస్థితి.

బహిష్కరణ, దాడుల కేసుల్లో నిందితులకు శిక్ష పడకపోవడంతో ప్రతి సందర్భంలో ఆ ఘటనలు సాకుగా చూపి బాధితులపై కక్ష సాధిస్తున్నారు. అందుకు ప్రత్యక్ష ఉదాహరణ ఆర్మూర్ పట్టణానికి ఎనిమిది కిలోమీటర్ల దూరంలో ఉన్న మంథని గ్రామం. దళితుల సాంఘిక బహిష్కరణ జరిగి రెండేండ్లు పూర్తవుతున్నా.. నేటికీ వారితో ఇంతకుముందులా వ్యవహరించడం లేదు. ఆ గ్రామంలో ప్రతి యేడాది ఫిబ్రవరిలో జరిగే 'రంగనాయకుల' జాతర సందర్భంగా మాత్రమే దళితులతో పాటు అన్ని కులాలూ ఏకమవుతున్నాయి. సాధారణ రోజుల్లో మాత్రం 'ఎవరికి వారే' అన్నట్టు జీవిస్తున్నారు. అసలు వివాదానికి కారణమైన '22 ఎకరాల భూమి' నేటికీ దళితుల వశం కాలేదు. సాంఘిక బహిష్కరణ తరువాత ఈ వివాదం రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశమైన తర్వాత తప్పని పరిస్థితుల్లో దళితులకు పది ఎకరాలు అప్పగించారు. మిగిలిన 12 ఎకరాలను 'పటేళ్లు' అమ్ముకున్నారు.

నిజామాబాద్ జిల్లా ఆర్మూర్ మండలం మంథని గ్రామంలో 2011 జనాభా లెక్కల ప్రకారం మొత్తం 3,128 మంది ఉన్నారు. మొత్తం 856 కుటుంబాలున్నాయి. మహిళలు 1,656 మంది ఉన్నారు. అందులో దళితులు 18.7 శాతం అంటే 586 మంది ఉన్నారు. దళితులు ఆ గ్రామంలోని భూస్వాములకు ఏండ్ల తరబడి వెట్టి చేసినందుకుగాను పూర్వీకులు ఊరి చివరిలో 22 ఎకరాలను దానంగా ఇచ్చారు. ఆ భూమి తమదేనంటూ 'పటేళ్లు' ఎదురుతిరిగారు. వీడీసీని అడ్డంపెట్టుకుని దళితులు ఆ భూములు వదులుకోవాల్సిందిగా హుకుం జారీ చేశారు. దీన్ని దళితులు తీవ్రంగా ప్రతిఘటించారు. దీంతో సుమారు 150 మాల, మాదిగ కుటుంబాలను వీడీసీ సామాజిక బహిష్కరణ చేసింది. వారికి నిత్యవసర సరుకులు అమ్మకం నిలిపేశారు. వారితో ఎవరైనా మాట్లాడితే రూ. వెయ్యి జరిమానా విధించారు. తాజాగా ఆ గ్రామంలో 'నవతెలంగాణ' బాధితులను పలకరించగా.. వీడీసీ ఆదేశాలతో నాటి నుంచి ఇతర కులస్తులు తమతో కలుపుగోలుగా మాట్లాడ్డం లేదని వాపోయారు. చేసేదేమీ లేక దళితులు సైతం వీడీసీని రద్దు చేసే వరకూ గ్రామ కార్యక్రమాల్లో భాగస్వామ్యం కాబోమని, వీడీసీ ఆదేశాలను పాటించబోమని తీర్మానించుకున్నారు. ఇప్పటికీ గ్రామంలో ఏదైనా కార్యక్రమాలు జరిగినా, వీడీసీ ఏమైనా ఆదేశించినా దళితులు పాటించడం లేదు.

జాతరకు భంగం వాటిల్లొద్దని..

గ్రామంలో చోటుచేసుకున్న ఈ వివాదం జాతరకు ఆటంకం కావొద్దని ఆ ఊరి రంగ నాయకుల స్వామి జాతరకు, గంగనీళ్లకు, ఊర పండుగలకు గ్రామస్తులతో కలిసి పండుగల్లో భాగస్వామ్యం అవుతున్నారు. తమపై అపవాదు రావొద్దనీ, ఊరిపండుగలు ఆగొద్దనే ఊరిమీదకు వస్తున్నామని దళితులు చెబుతున్నారు.

ఘర్షణ వద్దని సర్పంచ్ ఏకగ్రీవం..

ఆర్మూర్ డివిజన్‌లో మొదటి విడతలో ఎన్నికలు జరుగుతున్నాయి. అయితే జనరల్ కేటగిరీలో ఎంపికైన మంథని గ్రామంలో సర్పంచి పదవి ఏకగ్రీవమైంది. ఎన్నికల సమయంలో మరోసారి ఘర్షణలు చెలరేగే ప్రమాదముందని గ్రహించిన గ్రామస్తులు.. దళితులతో పాటు అందరూ సర్పంచి పదవిని ఏకగ్రీవం చేసుకున్నారు. ఇటీవల అసెంబ్లీ ఎన్నికల సమయంలోనూ ఇక్కడ ఘర్షణపూరిత వాతావరణం నెలకొన్న నేపథ్యంలో గ్రామస్తులు కూడా ఏకగ్రీవానికే మొగ్గుచూపినట్టు తెలిసింది.

ఆంధ్రా వర్సిటీ వీసీని తొలగించాలి

సైన్స్ కాంగ్రెస్‌లో సూడో సైన్స్‌పై చర్చలొద్దు

- సైంటిస్టుల్లో, ప్రొఫెసర్లలో మూఢత్వం సరిగాదు: 'విజ్ఞాన సభలో అజ్ఞానమా' రౌండ్‌టేబుల్‌లో వక్తలు



నవతెలంగాణ బ్యూరో–హైదరాబాద్

జలంధర్‌లోని లవ్‌లీ యూనివర్సిటీలో జరిగిన 106వ జాతీయ సైన్స్ కాంగ్రెస్‌లో టెస్టుట్యూబ్ బేబీ సృష్టి పురాతన కాలంలోనే ఉన్నదని మాట్లాడిన ఆంధ్రా వర్సిటీ వీసీ నాగేశ్వర్‌రావును వెంటనే విధుల నుంచి తొలగించాలని, సైన్స్ కాంగ్రెస్‌లో సూడో సైన్స్‌పై చర్చ జరగకుండా నిర్వాహకులు చూడాలని 'విజ్ఞాన సభలో అజ్ఞానమా?' రౌండ్ టేబుల్ సమావేశం తీర్మానించింది. సైన్స్ కాంగ్రెస్‌లో మూఢత్వ విషయాలను చర్చకు పెట్టేవారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఎస్వీకే–జేవీవీ ఆధ్వర్యంలో 'విజ్ఞాన సభలో అజ్ఞానమా?' రౌండ్ టేబుల్ సమావేశం శనివారం జరిగింది. ఈ సమావేశంలో సీసీఎంబీ శాస్త్రవేత్త బాంబ్జీ మెహతా మాట్లాడుతూ..మూఢత్వాలు అన్ని దేశాల్లో ఉన్నాయని, అమెరికాలో కొన్ని ప్రాంతాల్లో డార్విన్ సిద్ధాంతాన్ని నేటికీ అమోదించడం లేదని గుర్తుచేశారు. అయితే, పిల్లలకు చదువులు చెప్పే గురువుల్లో, నూతన ఆవిష్కరణలతో సమాజాన్ని ముందుకు నడిపించాల్సిన శాస్త్రవేత్తల్లో మూఢత్వం ఉండటం బాధాకరమన్నారు. రక్తికట్టించేందుకు పురాతన గ్రంథాల్లో జొప్పించిన ఊహాత్మక సన్నివేశాలను సైన్స్‌తో ముడిపెట్టడం దారుణమన్నారు. డాక్టర్ కృష్ణ కుమారి మాట్లాడుతూ..ఇండ్లు కట్టేటప్పుడు, ప్రయోగాలు చేసేటప్పుడు శాస్త్రవేత్తలు జ్యోతిష్యుల దగ్గరకు వెళ్లడం బాధాకరమన్నారు. దేశంలో సూడో సైన్స్ విస్తరిస్తోందని, దాన్ని అరికట్టేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. నేర్చుకున్న సైన్స్‌ను ఎలా ఉపయోగించుకోవాలో పిల్లలకు ప్రతిఒక్కరూ తెలియజెప్పాలని ఆకాంక్షించారు. అశాస్త్రీయ అంశాల మీద చర్చపెట్టినప్పుడు తమ పరిశోధనలకు కేంద్రం ఎక్కడ నిధులు నిలిపివేస్తుందో అన్న భయంతో కనీసం ఖండించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఎల్వీ ప్రసాద్ ఆస్పత్రి హెచ్ఓడి చిత్రా కన్నాబిరామన్ మాట్లాడుతూ..ఆస్ట్రాలజీ సైన్స్ అని కొందరు ప్రచారం చేస్తున్నారని, అది ఏ మాత్రం వాస్తవం కాదని కొట్టిపడేశారు. ఆల్ ఇండియా పీపుల్స్ సైన్స్ నెట్‌వర్క్ వైస్‌ప్రెసిడెంట్ టి.రమేష్ మాట్లాడుతూ.. సైన్స్‌లో పరిశోధనలను నిర్వీర్యం చేసేందుకు మోడీ సర్కారు కుట్ర పన్నుతోందని, అందులో భాగంగనే బడ్జెట్‌లో 2 శాతం నుంచి 0.8 శాతానికి నిధులను తగ్గించిందని వివరించారు. బీజేపీ పాలన పట్ల ప్రజల్లో వస్తున్న వ్యతిరేకతను పక్కదోవ పట్టించేందుకు అహేతుక అంశాలను తెరపైకి తెస్తోందని విమర్శించారు. జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ అందె సత్యం మాట్లాడుతూ..విద్యార్థులను పరిశోధనల వైపు మళ్లించేందుకు, చైతన్యపరిచేందుకు జనవిజ్ఞానవేదిక అనేక కార్యక్రమాలను చేపడుతున్నదని వివరించారు. సుందరయ్య విజ్ఞాన కేంద్రం పూర్వ కార్యదర్శి సి.సాంబిరెడ్డి మాట్లాడుతూ..న్యూటన్, ఐన్‌స్టీన్ శాస్త్రవేత్తలే కాదని కెజి కృష్ణన్ వ్యాఖ్యానించడం దారుణమన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్వీకే కార్యదర్శి ఎస్.వినయకుమార్, దుర్గారావు, వసంత కన్నాభిరామన్, పాల్గొన్నారు.

పాక్‌లో మొదటిసారిగా..

ఉన్నత స్థాయి హోదాలోకి సిక్కు

అమృత్‌సర్: పాకిస్థాన్ చరిత్రలో మొదటిసారిగా ఒక సిక్కు వ్యక్తి ఉన్నత స్థాయి ఉద్యోగానికి ఎంపికయ్యారు. పంజాబ్ ప్రావిన్స్ గవర్నర్‌కు పబ్లిక్ రిలేషన్స ఆఫీసర్(పీఆర్వో)గా పవన్ సింగ్ అరోరా ఎంపికయ్యారు. కాగా, పవన్ సింగ్ గవర్నర్ భవన్‌లో ఇప్పటికే బాధ్యతలు తీసుకున్నట్టు పాకిస్థాన్ మీడియా వివరిస్తోంది. కర్తార్‌పూర్ కారిడార్‌కు పాకిస్థాన్ ప్రధాని ఇమ్రాన్ ఖాన్ ఘనంగా శంకుస్థాపన కార్యక్రమం నిర్వహించిన తర్వాత ఈ ఎంపిక జరగడం గమనార్హం. గతంలో నానక్ సాహిబ్‌లో జిల్లా సమాచార అధికారిగా బాధ్యతలు నిర్వహించారు. పాకిస్థాన్ మైనారిటీలను సమానంగా పరిగణిస్తుందని ప్రధాని ఇమ్రాన్ వ్యాఖ్యల నేపథ్యంలో పవన్ సింగ్ ఉన్నత ఉద్యోగానికి ఎంపికవడం గమనార్హం.

నీ కూతురును కిడ్నాప్ చేస్తాం

చేతనైతే రక్షించుకో

- ఢిల్లీ సీఎం కేజ్రివాల్‌కు బెదిరింపు మెయిల్స్

న్యూఢిల్లీ: ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రివాల్‌ను బెదిరిస్తూ కొందరు గుర్తు తెలియని దుండగులు ఆయన అధికారిక ఖాతకు మెయిల్స్ పంపారు. నీ కూతురును కిడ్నాప్ చేస్తాం, చేతనైతే కాపాడుకొండని మెయిల్ చేశారు. ఈ నేపథ్యంలో కేజ్రివాల్ కుమార్తె హర్షితకు భద్రతను పెంచారు. దీనిపై పోలీసు అధికారి ఒకరు మాట్లాడుతూ... మెయిల్స్‌ను సైబర్ పోలీసులకు పంపామని తెలిపారు. ఆ మెయిల్ ఎక్కడి నుంచి వచ్చిందో తెలుసుకోవడానికి ఐపీ అడ్రస్‌ను కనుక్కునే పనిలో సైబర్ పోలీసులు నిమగ్నమైనట్టు వెల్లడించారు. కాగా ఈ మెయిల్స్‌ను మూడు రోజుల కింద ఢిల్లీ పోలీసులకు పంపామని ఇప్పటి వరకు పోలీసుల నుంచి సమాధానం రాలేదని మరో అధికారి చెప్పారు. కాగా అరవింద్ కేజ్రీవాల్ కు ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఐఐటీ ఢిల్లీ నుంచి కెమికల్ ఇంజనీరింగ్‌ను హర్షిత పూర్తిచేశారు.

నన్ను నేను నమ్ముకున్న ప్రతిసారి
విజయం నన్నే వరించేది...
ఒకరిపై ఆధారపడిన ప్రతిసారి
నన్ను నేను నిందించుకోవలసి వచ్చేది...
చివరికి నాకర్థమయింది
స్వశక్తికి మించిన ఆస్తి లేదని...
– షేక్స్‌పియర్



బేడీలు!?

మరోసారి
నా గుండె దర్వాజ పై
తలుపు తాడించకు ప్రియా!
ఇప్పుడిప్పుడే కిటికీ తెరిచాను..
ఆకాశంలోకెగిరి
దేదీప్యమానంగా
వెలుగుతూన్న ప్రేమ జ్యోతిని
నీకివ్వాలనే ధైర్యానికి
శిక్షననుభవిస్తున్నాను
చేతులకే కాదు
కాళ్లకు కూడా పడ్డాయి
కుల–మత బేడీలు?



- అమ్జద్

వహ్వా..వహ్వా

నువ్వే చెప్పు



వినటానికి ఎదురుగా లేవు గానీ,
ఎన్నో విషయాలు చెప్పాలని ఉంది.
నా ముందు లేవు గానీ,
మళ్ళీ మళ్ళీ చూడాలనిపిస్తుంది.
ఎక్కడున్నావో తెలియదు గానీ,
ఇప్పటికిపుడు నీ ముందు వాలాలని ఉంది.
చెబితే నమ్మవు గానీ,
ప్రతీక్షణం నీ ధ్యాసే అయింది.
ప్చ్......!
ఏం చేయాలి ? - నందు

చిలిపి ప్రశ్న



సుబ్బారావు: ఏరా బావా... నీ కొడుకు ఎప్పుడూ వేలు చప్పరిస్తూ ఉండేవాడు. ఇపుడు అలవాటు తగ్గిందా?
వెంగళప్ప: ఆ తగ్గిందిరా... ఇప్పుడు అస్సలు పెట్టుకోవడం లేదు.
సుబ్బారావు: ఎలా మాన్పించావురా?
వెంగళప్ప: అబ్బే ఏం లేదురా... వాడికి లూజుగా ఉండే నిక్కర్లు కుట్టించాను. వెదవకి నిక్కరు పట్టుకోవడంతోనే సమయం సరిపోతుంది. ఇక వేలేం చప్పరిస్తాడు.

ఫన్.కాం

లెక్క తప్పుంటది



రాము: నాకెందుకో చాలా భయం భయంగా ఉంది... మామూలుగా 19 తర్వాత 20 వస్తుంది... అవునా!
చందు: అవును... అయితే ఇప్పుడేమైంది..
రాము: ఈ సంవత్సరం ఏంటో 20 తర్వాత 19 వచ్చింది. 2019 అంటా! ఏమైనా అవుతుందా...
చందు: ఏమవుతుంది. ఏమీ అవదు. అనవసరంగా రాద్ధాంతం చేయొద్దు. లెక్క తప్పుంటది పిచ్చోడా..!

మీరూ రాయొచ్చు

హాయ్ ఫ్రెండ్స్. ఈ పేజీకి మీరేదైనా రాయాలను కుంటున్నారా.. అయితే ఆలస్యం దేనికి? కలం పట్టండి. ముఖ్యమైన ఈవెంట్స్, సక్సెస్ స్టోరీలు, కవితలు, జోకులు ఇలా యూత్‌కు సంబంధించి సమాచారం ఏదైనా సరే మాకు పంపండి. మా అడ్రస్ : జోష్ పేజీ, నవ తెలంగాణ తెలుగు దినపత్రిక, ఎం.హెచ్.భవన్, ఫ్లాట్ నం. 21/1, ఆజామాబాద్, ఆర్.టి.సి కల్యాణ మండపం వీధి, బాగ్‌లింగంపల్లి, హైదరాబాద్ – 500020.
e-mail : navatelangana.josh @gmail.com



యువత న్యూస్ పేపర్ ఎందుకు చదవటం లేదు అనే ప్రశ్న ఆ యువకుడ్ని వేధించింది. నిద్రపోనీయకుండా కలవర పెడుతున్నది. రోజూ ఇవే ఆలోచనలు. ఓ ఉదయం ఒంటరిగా ఇంటి ముందు తిరుగుతున్నాడు. అప్పుడే పేపర్ వేసి వెళ్తున్న పేపర్ బాయ్‌ని చూశాడు. కనీసం ఇతనైనా న్యూస్ పేపర్ చదువుతున్నాడా? అనే మరో ప్రశ్న అతని మదిని తొలిచేసింది. ఆ పేపర్ బాయ్‌తో మాట్లాడాలనే ఆసక్తి అతన్ని నిలవనీయలేదు. మరి ఆ తర్వాత ఏం చేశాడో ఈ రోజు జోష్‌లో తెలుసుకుందాం...

ఓ యాప్ అతని జీవితాన్నే మార్చేసింది

మరుసటి రోజు పేపర్ బాయ్ కోసం ఎదురుచూస్తున్నాడు. పేపర్ బాయ్ రాకతో అతని ముఖం వెలిగిపోయింది. 'బ్రదర్ ఈ పేపర్ మాకంటే ముందు నీ చేతికే వస్తుంది కదా చదువుతావా?' అడిగాడు. 'లేదు భయ్యా, నాకు ఎట్లా కుదుతుంది. పొద్దునే పేపర్ ఇంటి ముందు లేకపోతే జనం గోల చేస్తారు' అన్నాడు. ఆ సమాధానం అతనికి మరల నిరుత్సాహ పరిచింది. మళ్ళీ మథనం మొదలైంది.

అప్ డేట్ అవ్వాలి

రాజకీయ వార్తలు చదవాలంటే ఓ పేపర్. బిజినెస్ న్యూస్ కావాలంటే ఇంకో పేపర్. సినిమా సంగతులు తెలియాలంటే మరో మేగజైన్. ఫ్యాషన్ కోసం ఒకటి.. ఇంటీరియర్ కోసం మరొకటి. ఇలా ఎన్ని పేపర్లని కొనాలి. ఎన్ని మేగజైన్లని తెప్పించుకోవాలి. ఇవన్నీ మన అరచేతిలో ఇమిడిపోతే... అప్పుడు వచ్చింది అతనికి ఓ ఐడియా. అది జీవితాన్ని మార్చేసింది. ఈ ఐడియా ఏదో బావుంది. డిజిటల్ మీడియాకాలంలో కూడా అన్నేసి పేపర్లు, మేగజైన్లు కొనడమేంటి? అప్ డేట్ అవ్వాలి. ఆ దిశగా ఆవిష్కరణలు జరగాలి. ఐడియాలన్నీ ఏ కంప్యూటర్ లాబొరేటరీల్లోనో జరుగుతాయనుకుంటే పొరపాటే. కొన్ని కొన్ని ఇన్నోవేషన్స్ ఏ మాస్టర్ డిగ్రీ లేకున్నా బుర్రలో తళుక్కున మెరుస్తాయి. అలాంటి కథే ఇదే.

ఒకే ఒక్క యాప్‌తో

వెంకట కార్తీక్ రాజా అని 18 ఏండ్ల కుర్రాడు. మన తెలుగువాడే కాకపోతే బెంగుళూర్‌లో సిర్థపడిన ఫ్యామిలీ. సో ఇప్పుడు అతడు బెంగళూరుకు చెందిన కార్తీక్ రాజాగా మాట్లాడుకుంటున్నాం. ఇతనికి వచ్చిన ఆలోచన నిజంగా అరచేతిలో అద్భుతాన్నే సృష్టించింది. ఒకటి కాదు రెండు కాదు.. ఏకంటా 400 దిన, వారపత్రికలను కండ్ల ముందుంచింది. ఒకే ఒక మొబైల్ యాప్ వందలాది న్యూస్ పేపర్లను దినపత్రికలను ఏకతాటిపైకి తెచ్చింది. అది కూడా రియల్ టైంలో చదువుకునేలా చేసింది.

యువతపైనే దృష్టి

పేపర్ బోయ్ మొబైల్ యాప్ క్రియేట్ చేయాలన్న ఆలోచన కార్తీక్‌కు కాలేజీ డేస్‌లోనే వచ్చింది. అతని ఆలోచనకు తల్లిదండ్రుల మద్దతు కూడా లభించింది. అలా ఇద్దరితో మొదలైన కార్తీక్ రాజా ప్రయాణం నేడు యాభై మందికి చేరింది. ముందుగా ద్వితీయ, తృతీయ శ్రేణి పట్టణాలపై ఫోకస్ చేశాడు. ఎందుకంటే దేశంలోని జనాభాలో అధిక జనాభా ఈ సిటీల్లోనే ఉంటారు కాబట్టి. అయితే అతని టార్గెట్ ప్రజలందరూ కాదు. ముందు యువతరం ఈ వైపు రావాలనే అభిలాష అతనిది.

పేపర్ బాయ్ యాప్

స్థానిక, జాతీయ, అంతర్జాతీయ దినపత్రికలతో సహా అనేక మేగజైన్లకు ఒక ప్లాట్ ఫాం క్రియేట్ చేశాడు. డిజిటల్ విప్లవం స్ఫూర్తితో యాప్ తయారు చేశాడు. దానికి పేరు ఏమి పెట్టాలని ఆలోచిస్తుంటే ... ఉదయమే అందరికి పేపర్ అందించే పేపర్ బోయ్ కండ్ల ముందు మెదిలాడు. అంతే 'పేపర్ బాయ్' అని తన యాప్‌కి పేరుపెట్టాడు. ఫిబ్రవరి 2016 లో కార్తిక్ పేపర్ బాయ్‌ని ప్రారంభించినప్పటికీ పూర్తి స్థాయిలో మాత్రం 2017 అక్టోబర్ నుంచి అందుబాటులోకి వచ్చింది. వార్తాపత్రికలతో మాట్లాడి ప్రచురణలు ఎలక్ట్రానిక్ రూపాలను అందించడానికి, ప్రచురణలతో ఒప్పించటానికి ఈ టీంకు ఆరు నుంచి ఏడు నెలలు పట్టింది. చివరికి కార్తిక్ పోరాటం ఫలించింది. ప్రస్తుతం 400 భారతీయ వార్తాపత్రికలు, 250 మ్యాగజైన్ల డిజిటల్ ప్రచురణలను అందించే ఏకైక వేదికయింది 'పేపర్ బోయ్'. ఇప్పటికే ఐఓస్, యాండ్రాయిడ్ వెర్షన్‌లో అందుబాటులో వుంది. వెబ్ మోడల్ కూడా చూడొచ్చు. ఇందులో ఎలాంటి పత్రికైనా, మేగజైన్ అయినా మొబైల్లో క్షణాల్లో చూసుకోవచ్చు. ఈ 'పేపర్ బోయ్' యాప్‌ని విశ్వవ్యాప్తం చేయడమే అతని లక్ష్యం.

పురస్కారాలు

ఇండియాలోనే తొలి వార్తాపత్రిక అగ్రిగేటర్‌గా ప్రముఖ బాలీవుడ్ నటుడు అక్షయ్ కుమార్ నుంచి అవార్డు అందుకున్నారు. అలాగే బెస్ట్ స్టార్టప్ అవార్డు కూడా అందుకున్నారు.

నాన్నే ఆదర్శం

ఇప్పుడు కార్తీక్ వయసు 21. సాధారణంగా ఏవరైనా చిన్న వయసులోనే ఓ స్థాయికి వస్తే అక్కడితో చదువుకు స్వస్తి చెప్పేస్తారు. కానీ మన హీరో అలా చేయలేదు. ఎందుకంటే అతడికి చదువు విలువ తెలుసు. "నేను రోజూ కళాశాలకు వెళ్ళి సాయంత్రం ఆఫీస్‌కు వెళ్తాను. నేను ఏవైనా ఇతర పనులతో ఆఫీస్‌కు వెళ్ళలేకపోతే నాన్న విజయ్ భాస్కర్, మా అక్కనే అన్నీ చూసుకుంటారు. మాకంపెనీలో మా కుటుంబ సభ్యులే భాగస్వాములు. నాన్న చిన్న ముత్యాల షాప్ పెట్టుకుని మమ్మల్ని ఇంతటి వాళ్లను చేశారు. అంచెలంచెలుగా ఎదిగిన నాన్న జీవితమే మాకు ఆదర్శం. నాన్న, పెద్దనాన్న వేణుగోపాల్ అందించిన సహకారం నా ఈ చిన్న ఆలోచనకి పురుడుపోసింది. నేను నా సొంత సంస్థ కోసం కృషి చేస్తాను" అంటున్నాడు కార్తీక్.





ఆదరణ ఎలా ఉందంటే...

ప్రపంచ వ్యాప్తంగా సుమారు 50 దేశాల వారు 'పేపర్ బాయ్' యాప్‌ను వాడుతున్నారు. మొత్తంగా 1.2మిలియన్ ప్రజలు దీన్ని ఉపయోగించుకుంటున్నారని సంతోషంగా చెప్తున్నాడు కార్తీక్. ముఖ్యంగా తెలంగాణలో మంచి ఆదరణ ఉన్న ఈ యాప్‌కి రెండు తెలుగు రాష్ట్రాలతో పాటు కర్నాటకలో కూడా యువత విశేషంగా తమ మొబైల్స్‌లో ఈ యాప్‌ను డౌన్ లోడ్ చేసుకున్నారని హ్యాపీగా చెప్తున్నాడు.

"మరి ఈ యాప్‌ను ఇంతగా అదరిస్తున్న యువత నిరుద్యోగంతో ఇబ్బందులు పడుతున్నారు కదా, కొంతమందికైనా ఉపాధి కల్పిస్తారా?' అని అడిగితే 'అది మా బాధ్యత బాస్ తప్పని సరిగా కొంత మందికి మేం ఉపాధి కల్పిస్తాం' అని నిగర్వంగా చెప్తున్నాడు కార్తీక రాజు.

- అనంతోజు మోహన్ కృష్ణ

సరికొత్త ఆలోచనలతో...

2019 ప్రారంభమై అప్పడే రెండు వారాలు గడిచిపోయాయి. కొత్త ఏడాదిలో కొత్త ఊహలు... ఎన్నో ఆలోచనలు... కానీ వాటిని అందుకోవాలంటే లక్ష్యాలు నిర్దేశించుకోవాలి. ప్రణాళిక సిద్ధం చేసుకోవాలి. రొటీన్ లైఫ్‌లో ఎంత అనుకున్నా అది ఆచరణ సాధ్యమేనా అనే అనుమానం కచ్చితంగా వస్తుంది. కానీ అలా వదిలేస్తే ఇక మార్పు ఎప్పడు? మన గమ్యం చేరేదెప్పడు. అందుకే ఈ కొత్త సంవత్సరంలో కొన్ని లక్ష్యాలకు గురి పెట్టండి. చిన్న చిన్నగా మొదలుపెట్టి చూడండి. అవే మీ నవజీవన యానానికి సోపానాలవుతాయి. అలాంటి కొన్ని ఆలోచనలు ఈ కొత్త సంవత్సరంలో మీ కోసం...

కొత్త సంవత్సరం అనగానే పెద్ద పెద్ద నిర్ణయాలు తీసుకుని ఏదో సాధించేద్దామనుకుంటారు చాలా మంది. అక్కడే మనం పప్పులే కాలేస్తాం. బిజీ షెడ్యూల్‌లో చివరకు దాన్ని చేరుకోలేక నిరాశతో నిట్టూరుస్తాం. అలా కాకుండా చిన్న చిన్న లక్ష్యాలను నిర్దేశించుకోండి. వాటిపైనే దృష్టి పెట్టండి.

చిన్న చిన్న పనులే

రోజూ ఉదయాన్నే లేవగానే గ్లాసుడు నీళ్లు తాగండి. బ్రేక్ ఫాస్ట్ తీసుకోండి. ఇక మధ్యాహ్న భోజనంలో కూరగాయలు ఉండేలా చూసుకోండి. స్నాక్స్‌గా ఆయిల్ ఫుడ్ కాకుండా పండ్ల ముక్కలు తీసుకోండి. ఒత్తిడిగా అనిపిస్తే మూడు సార్లు దీర్ఘశ్వాస తీసుకోండి. ఆఫీసు టైమ్‌లో ఖాళీ దొరికినప్పుడు మీ పరిధిలోనే అటూ ఇటూ నడవండి. ఇంటికి వచ్చి అన్ని పనులనూ ముగించుకొని నిద్రపోయే సరికి లేట్ అవుతోందా? అయితే నెమ్మదిగా ఆ అలవాటు నుంచి దూరం కావడం మంచిది. లేటుగా నిద్రపోయే అలవాటు ఉంటే, ఆ రొటీన్ షెడ్యూల్‌ను కొద్దిగా ముందుకు జరపండి. ఇటువంటి చిన్న చిన్న పనులే మీ జీవితంలో పెద్ద మార్పు తీసుకొస్తాయి.

కాస్త కొత్తగా

జీవితమన్నాక ఆనందంగా ఆస్వాదించాలి. ఎప్పుడూ కెరీర్, ఆరోగ్యం వంటి వాటి గురించే ఆలోచిస్తే బోర్ కొడుతుంది. చికాకు పెరుగుతుంది. అందుకే కాస్త కొత్తగా ఆలోచించండి. సరదాగా డ్యాన్స్ క్లాసులు, హార్స్ రైడింగ్, అవుట్‌డోర్ ఎడ్వెంచర్స్ ఇలా శారీరక వ్యాయామాలతో పాటు మెదడుకు పదును పెట్టేవి, నైపుణ్యాన్ని పెంచే పజిల్స్ కూడా అలవాటు చేసుకోండి. ప్రతి దానికీ నో చెప్పకుండా జీవితానికి కొత్త విలాసాన్ని జోడించండి.



ఆన్‌లైన్‌లో ఫుడ్ ఆర్డర్ ఇచ్చి కొత్త తరహా వంటలను రుచి చూడండి. కిచెన్ ఎక్విప్‌మెంట్ ఏదైనా తెచ్చుకుంటే కొత్త ప్రయోగాలు చేయండి.

క్రమంగా తగ్గించండి

మనం ఒక్కసారిగా మారిపోవాలని కొన్ని సార్లు పెద్ద నిర్ణయాలు తీసుకుంటాం. ఆ తర్వాత వాటిని నెరవేర్చుకోలేక తంటాలు పడతాం. దాంతో కొంత నిరాసక్తత కూడా ఆవహిస్తుంది. కనుక ఆలస్యమైన ఫర్వాలేదు అలాంటి మార్పులను మొదలు పెట్టండి. ఉదాహరణకు మద్యం సేవించే అలవాటు ఉన్నవారు క్రమంగా తగ్గించండి. స్వీట్లు, సోడాలు, పిజ్జాలు, ఫ్రైడ్‌రైస్ వంటివి మద్యం బదులుగా తీసుకోండి. మెడిటేషన్ చేయండి. వెజిటెబుల్స్ సలాడ్స్‌తో పాటు ఆరోగ్యకరమైనవి ట్రై చేయండి. జనవరి నెలలో వీటిని కచ్చితంగా పాటించండి. తర్వాత ఏడాదంతా ఆరోగ్యకరమైన ఈ అలవాట్లను ఎందుకు పాటించకూడదో ఒక్కసారి ఆలోచించండి.

మీకు నచ్చినదే...

ఈ జనవరిలో మీరేం చేయాలనుకుంటున్నారో అదే చేయండి. వ్యామోహాలు, ధోరణుల గురించి మర్చిపోండి. డ్రైవింగ్ ఇష్టమా? నడిపేయండి. ఫ్రెండ్స్‌తో నడిస్తే అలసట తెలియడం లేదా? అయితే నడిచేయండి. జిమ్‌కు వెళ్లి కండలు పెంచాలనుకుంటున్నారా! గో ఎ హెడ్. మీకు ఇష్టమైన పని ఏదైనా సరే చేయండి. అప్పుడు మీకు అర్థమవుతుంది. ఏ ఏ విషయాలు మీకు ప్రేరణనిస్తున్నాయో, ఏ ఏ లక్ష్యాలను మీరింకా చేరువ కావాలనుకుంటున్నారో! మిమ్మల్ని మీరు మార్చుకోవడానికి, భవిష్యత్తును బంగారంలా మలుచుకోవడానికి మీకో స్పష్టత వస్తుంది.



ఫేవరేట్‌కు ఝలక్. కోహ్లిసేనకు సిడ్నీలో చురక!. హిట్‌మ్యాన్ రోహిత్ శర్మ (133) శతకబాదినా, ధనాధన్ ధోని (51) మెరిసినా తొలి వన్డేలో భారత్‌కు ఓటమి తప్పలేదు. కోహ్లి, ధావన్, రాయుడులు తొలి నాలుగు పరుగులకే పెవిలియన్ చేరగా.. రోహిత్, ధోని శతక భాగస్వామ్యం కోహ్లిసేనకు విజయాన్ని ఇవ్వలేకపోయింది. భారత్‌పై పద్దతిగా ఒత్తిడి పెంచిన ఆస్ట్రేలియా 34 పరుగుల తేడాతో సిడ్నీలో గెలుపొందింది. సిరీస్‌లో 1-0 ఆధిక్యం సాధించింది.

సిడ్నీ చురక!

రోహిత్ శతకబాదినా ఓటమే

- 34 పరుగుల తేడాతో ఆసీస్ గెలుపు
- ధావన్, కోహ్లి, రాయుడు విఫలం

టర్నింగ్ పాయింట్!

ఛేదనలో 4 పరుగులకే తొలి మూడు వికెట్లు కోల్పోవటం టీమ్ ఇండియా ఛేదన గురి తప్పేందుకు కారణమైంది. రోహిత్, ధోనిలు 137 పరుగుల భాగస్వామ్యం నమోదు చేసి ఆశలు రేపినా.. లోయర్ ఆర్డర్ అంచనాలను అందుకోలేదు. రోహిత్ శర్మ ఒక్కడే 133 పరుగులు చేయగా, మిగతా జట్టంతా 106 పరుగులే చేసింది. ఇక ఆసీస్ చివరి పది ఓవర్లలో ఆస్ట్రేలియా 93 పరుగులు పిండుకున్నది. చివరగా బంతితో చివరి ఓవర్లలో, బ్యాట్‌తో తొలి ఓవర్లలో పేలవ ప్రదర్శన సిడ్నీ వన్డేను భారత్ నుంచి దూరం చేసింది.

సిడ్నీ (ఆస్ట్రేలియా)



విరాట్ కోహ్లి (3)

10000 వన్డేల్లో ఎం.ఎస్ ధోని భారత్ తరఫున పది వేల పరుగులు సాధించాడు. సచిన్, గంగూలీ, ద్రవిడ్, కోహ్లి తర్వాత ఈ ఘనత సాధించిన ఐదో భారత క్రికెటర్ ధోని. ఓవరాల్‌గా వన్డేల్లో పది వేల క్లబ్‌లో చేరిన 12వ ఆటగాడు.

22 వన్డేల్లో రోహిత్ శర్మ శతకాలు. గంగూలీ 331 వన్డేల్లో 22 శతకాలు బాదగా, రోహిత్ తన 194వ వన్డేలోనే ఈ ఘనత సాధించాడు.

తొలి వన్డేలో ఆతిథ్య ఆస్ట్రేలియా గెలుపొందింది. భారత బ్యాట్స్‌మెన్‌కు ముకుతాడు వేసిన కంగారూ బౌలర్లు ఆ జట్టుకు ఆధిక్యం కట్టబెట్టారు. సీమర్ రిచర్డ్‌సన్ (4/26), జేసన్ బెహ్రెన్‌డార్ఫ్ (2/39) నిప్పులు చెరగటంతో 289 పరుగుల ఛేదనలో భారత్ 254 పరుగులకే పరిమితమైంది. శిఖర్ ధావన్ (0), విరాట్ కోహ్లి (3), అంబటి రాయుడు (0)లు తొలి నాలుగు ఓవర్లలోపే పెవిలియన్‌కు చేరటం భారత్ విజయావకాశాలపై ప్రభావం చూపింది. ఓపెనర్ రోహిత్ శర్మ (133, 129 బంతుల్లో 10 ఫోర్లు, 6 సిక్స్‌లు), ఎం.ఎస్ ధోని (51, 96 బంతుల్లో 3 ఫోర్లు, 1 సిక్స్) రాణించినా ఫలితం లేకపోయింది. పీటర్ హ్యాండ్స్‌కాంబ్ (73, 61 బంతుల్లో 6 ఫోర్లు, 2 సిక్స్‌లు), ఉస్మాన్ ఖవాజ (59, 81 బంతుల్లో 6 ఫోర్లు), షాన్ మార్ష్ (54, 70 బంతుల్లో 4 ఫోర్లు), మార్కస్ స్టోయినిస్ (47 నాటౌట్, 43 బంతుల్లో 2 ఫోర్లు, 2 సిక్స్‌లు) రాణించటంతో తొలుత బ్యాటింగ్ చేసిన ఆస్ట్రేలియా 288 పరుగులు సాధించింది. రిచర్డ్‌సన్ 'మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్'గా నిలిచాడు. సిరీస్‌లో రెండో వన్డే ఆడిలైడ్‌లో జనవరి 15న జరుగనున్నది.



ధోని (51) రోహిత్ (133)

రోహిత్ రాణించినా.. : కొత్త బౌలర్లు ఆసీస్‌కు జీవ కళ తీసుకొచ్చారు. బెహ్రెన్‌డార్ఫ్, రిచర్డ్‌సన్‌లు తొలి నాలుగు ఓవర్లలోపే కోహ్లిసేన ఛేదనను నాశనం చేశారు!. ఫామ్‌లో ఉన్న ముగ్గురు బ్యాట్స్‌మెన్‌ను 4 పరుగులకే కోల్పోయిన భారత్, ఛేదనలో వెనుకంజ వేసింది. ధావన్‌ను బెహ్రెన్‌డార్ఫ్ ఎల్బీ చేయగా.. రిచర్డ్‌సన్ ఒకే ఓవర్లో కోహ్లి (3), రాయుడు (0)లను సాగనంపాడు. దీంతో ఎం.ఎస్ ధోని తొలి ఐదు ఓవర్లోనే క్రీజులోకి రావాల్సి వచ్చింది. ఆసీస్ బౌలర్లు రెచ్చిపోయి బంతులేస్తోన్న తరుణంలో రోహిత్, ధోనిలు సంయమనం పాటించారు. దీంతో పది ఓవర్లు ముగిసే సరికి భారత్ 21/3తో నిలిచింది.

ఆరంభంలో ఇబ్బంది పడినా.. రోహిత్, ధోని జోడీ గెలుపు దిశగా పయనించింది. నాల్గో వికెట్‌కు 137 పరుగుల భారీ భాగస్వామ్యం నిర్మించింది. రోహిత్ 62 బంతుల్లో అర్థ సెంచరీ పూర్తి చేసి బౌండరీలపై విరుచుకుపడ్డాడు. నాలుగు సిక్సర్లు, ఏడు ఫోర్లతో రోహిత్ కెరీర్ 22వ శతకం పూర్తి చేశాడు. మరో ఎండ్‌లో ధోని మ్యాచ్ పరిస్థితులకు అనుగుణంగా ఆడాడు. స్ట్రయిక్‌రేట్ తక్కువే అయినా, ఇన్నింగ్స్ పునఃనిర్మాణంలో మరో మార్గం లేదు!. రోహిత్, ధోని జోడీ జోరుతో భారత్ లక్ష్యం దిశగా సాగింది. కానీ అర్థ సెంచరీ ముగిసిన వెంటనే మహి ఎల్బీగా అవుటయ్యాడు. సమీక్షకు వెళితే ధోని నాటౌట్ అని తేలేది, కానీ అప్పటికే రాయుడు రెండో రివ్యూను వాడేశాడు. ధోని నిష్క్రమణతో రోహిత్‌పై ఒత్తిడి పెరిగింది. సాధించాల్సిన రన్‌రేట్ పెరిగిపోవటం, మరో ఎండ్ నుంచి సహకారం లేకపోవటం ప్రతికూలమైంది. దినేశ్ కార్తీక్ (12), జడేజా (8)లు విఫలమయ్యారు. టెయిలెండర్లలో భువనేశ్వర్ కుమార్ (29) ఓటమి అంతరాన్ని తగ్గించాడు. నిర్ణీత ఓవర్లలో 254 పరుగులే చేయగల్గిన భారత్, తొలి వన్డేలో ఓటమి పాలైంది.

సమష్టిగా ఆడారు : టాస్ నెగ్గి తొలుత బ్యాటింగ్ ఎంచుకున్న ఆస్ట్రేలియా 288 పరుగులు చేసింది. భారత బౌలర్లు రాణించటంతో ఆసీస్ సైతం పరుగుల వేటలో ఇబ్బంది పడింది. అరోన్ ఫించ్ (2)ను ఆరంభంలోనే అవుట్ చేసిన భువనేశ్వర్ భారత్‌కు బ్రేకిచ్చాడు. మరో ఓపెనర్ అలెక్స్ (24) ఎంతోసేపు క్రీజులో నిలువలేదు. పవర్‌ప్లే ముగిసే సమయానికి 41/2తో నిలిచిన ఆసీస్ ఇన్నింగ్స్ నెమ్మదిగా ఆరంభమైంది. కానీ మిడిల్ ఆర్డర్ ప్రదర్శన, ఆఖరి పది ఓవర్లలో మెరుపులు ఆస్ట్రేలియాను పటిష్టమైన స్థితిలో నిలిపాయి. ఉస్మాన్ ఖవాజ (59), షాన్ మార్ష్ (54), పీటర్ హ్యాండ్స్‌కాంబ్ (73), స్టోయినిస్ (47)లు వరుసగా రాణించారు. కుల్దీప్, భువనేశ్వర్ రెండేసి వికెట్లు కూల్చినా.. కంగారూ స్కోరు తగ్గలేదు.

ఆస్ట్రేలియా ఇన్నింగ్స్ : అలెక్స్ (సి) రోహిత్ (బి) కుల్దీప్ 24, అరోన్ ఫించ్ (బి) భువనేశ్వర్ 6, ఉస్మాన్ ఖవాజ (ఎల్బీ) రవీంద్ర జడేజా 59, షాన్ మార్ష్ (సి) షమి (బి) కుల్దీప్ 54, హ్యాండ్స్‌కాంబ్ (సి) ధావన్ (బి) భువనేశ్వర్ 73, స్టోయినిస్ నాటౌట్ 47, మాక్స్‌వెల్ నాటౌట్ 11, ఎక్స్‌ట్రాలు : 14, మొత్తం : (50 ఓవర్లలో 5 వికెట్లకు) 288.

వికెట్ల పతనం : 1-8, 2-41, 3-133, 4-186, 5-254.

బౌలింగ్ : భువనేశ్వర్ 10-0-66-2, ఖలీల్ అహ్మద్ 8-0-55-0, మహ్మద్ షమి 10-0-46-0, కుల్దీప్ యాదవ్ 10-0-54-2, రవీంద్ర జడేజా 10-0-48-1, రాయుడు 2-0-13-0.

భారత్ ఇన్నింగ్స్ : రోహిత్ శర్మ (సి) మాక్స్‌వెల్ (బి) స్టోయినిస్ 133, శిఖర్ ధావన్ (ఎల్బీ) బెహ్రెన్‌డార్ఫ్ 0, విరాట్ కోహ్లి (సి) స్టోయినిస్ (బి) రిచర్డ్‌సన్ 3, అంబటి రాయుడు (ఎల్బీ) రిచర్డ్‌సన్ 0, ఎం.ఎస్ ధోని (ఎల్బీ) బెహ్రెన్‌డార్ఫ్ 51, దినేశ్ కార్తీక్ (సి) రిచర్డ్‌సన్ 12, జడేజా (సి) షాన్ మార్ష్ (బి) రిచర్డ్‌సన్ 8, భువనేశ్వర్ నాటౌట్ 29, కుల్దీప్ యాదవ్ (సి) ఖవాజ (బి) సిడిల్ 3, మహ్మద్ షమి (సి) మాక్స్‌వెల్ (బి) స్టోయినిస్ 1, ఎక్స్‌ట్రాలు : 14, మొత్తం : (50 ఓవర్లలో 9 వికెట్లకు) 254.

వికెట్ల పతనం : 1-1, 2-4, 3-4, 4-141, 5-176, 6-213, 7-221, 8-247, 9-254.

బౌలింగ్ : బెహ్రెన్‌డార్ఫ్ 10-2-39-2, రిచర్డ్‌సన్ 10-2-26-4, పీటర్ సిడిల్ 8-0-48-1, నాథన్ లైయాన్ 10-1-50-0, స్టోయినిస్ 10-0-66-2, మాక్స్‌వెల్ 2-0-18-0.



అవునంటే..కాదు!

- పాలకుల కమిటీ విభేదాల పర్వం
- పాండ్య, రాహుల్ అంశంలోనూ అదే తీరు

ముంబయి : పాలకుల కమిటీ (సీవోఏ) సభ్యుల మధ్య అభిప్రాయభేదాలు కొనసాగుతూనే ఉన్నాయి. తాజాగా హార్దిక్ పాండ్య, కెఎల్ రాహుల్‌లు ఓ టీవీ షోలో మహిళల పట్ల అనుచిత వ్యాఖ్యలు చేసిన నేపథ్యంలో సెస్పెన్షన్‌కు గురైన సంగతి తెలిసిందే. ప్రపంచకప్ ప్రణాళిక కీలక దశకు చేరుకున్న క్రమంలో జట్టు సమతూకం దెబ్బతినకుండా.. హార్దిక్ పాండ్య, కెఎల్ రాహుల్‌పై వేగంగా విచారణ పూర్తి చేయాలని సీవోఏ చైర్మన్ వినోద్ రాయ్ భావించారు. సీఈవో రాహుల్ జోహ్రి చేత ప్రాథమిక విచారణ చేయించాలని ఉపక్రమించగా, అందుకు డయాన ఎదుల్జీ వ్యతిరేకించారు. విచారణ సీవోఏ, బీసీసీఐ ఆఫీస్ బేరర్లు చేపట్టాలని అడ్డు చెప్పింది. జట్టు బలహీన పడకుండా సెలక్టర్లు ఇతర ఆటగాళ్లను ఆస్ట్రేలియాకు పంపిస్తారని వాదించింది. దీంతో వినోద్ రాయ్ తొలుత సూచించిన రెండు వన్డేల నిషేధం అమల్లోకి రాలేదు. విచారణ పేరిట పాండ్య, రాహుల్‌పై సస్పెన్షన్ విధించి, ఇప్పుడు విచారణ మొదలెట్టారు. తాజా షోకాజ్ నోటీసులకు బదులిచ్చేందుకు వీరికి బోర్డు రెండు వారాల సమయం ఇచ్చింది. లైంగిక ఆరోపణలు ఎదుర్కొన్న రాహుల్ జోహ్రి.. క్రికెటర్ల లైంగిక పరమైన వ్యాఖ్యలపై విచారణ చేపట్టేందుకు అర్హుడు కాదని ఎదుల్జీ వాదన. దీంతో పాండ్య, రాహుల్‌లు డ్రెస్సింగ్‌రూమ్‌ను వీడి స్వదేశానికి పయనం కాక తప్పలేదు.



హంటర్స్‌వేట ముగిసింది

- సెమీస్‌లో ఓడిన హైదరాబాద్
- ఫైనల్లో ముంబయి రాకెట్స్
- సింధు పోరాటం వృథా

బెంగళూర్ : డిఫెండింగ్ చాంపియన్ కథ ముగిసింది. హంటర్స్ టైటిల్ వేటకు సెమీస్‌లోనే తెరపడింది. తొలిసారి సొంత నగరానికి ప్రాతినిథ్యం వహిస్తోన్న స్టార్ షట్లర్ పి.వి సింధు హైదరాబాద్ హంటర్స్‌ను ఫైనల్లోకి తీసుకెళ్లలేకపోయింది. శనివారం ముంబయి రాకెట్స్‌తో జరిగిన సెమీస్ పోరులో కీలక ట్రంప్ మ్యాచ్‌లో సింధు గెలుపొందినా.. మిగతా మ్యాచుల్లో సహచర షటర్లు నిరాశపరిచారు. ముంబయి రాకెట్స్ 4-2తో హైదరాబాద్‌పై నెగ్గి ఫైనల్లోకి దూసుకెళ్లింది. నేడు లోకల్ జట్టు బెంగళూర్ రాప్టర్స్‌తో అంతిమ పోరులో టైటిల్ కోసం అమీతుమీ తేల్చుకోనున్నది.

తొలి రెండు మ్యాచుల్లోనే ముంబయి ఆధిక్యం సాధించింది. మెన్స్ డబుల్స్‌లో హంటర్స్ జోడీ కిమ్ సారంగ్, బోదిన్ ఇసార నిరాశపరిచారు. 14-15, 12-15తో లీ యంగ్, కిమ్ జంగ్ చేతిలో ఓడిపోయారు. తొలి మెన్స్ సింగిల్స్‌లో మార్క్ కాల్జోవ్ 8-15, 7-15తో సమీర్ వర్మ చేతిలో చిత్తయ్యాడు. ట్రంప్ కావటంతో ముంబయికి రెండు పాయింట్లు దక్కాయి. కీలక మహిళల సింగిల్స్‌లో పి.వి సింధు 15-6, 15-5తో పరదేశిపై ట్రంప్ విజయం సాధించి హంటర్స్‌ను 2-3తో రేసులోకి తీసుకొచ్చింది. కానీ నిర్ణయాత్మక రెండో మెన్స్ సింగిల్స్‌లో లీ హ్యూన్ 13-15, 6-15తో ఆంటోన్సెన్ ముందు తేలిపోయాడు. తొలి గేమ్‌లో 9-13తో వెనుకంజలో నిలిచినా వరుసగా ఆరు పాయింట్లతో ఆంటోన్సెన్ హంటర్స్‌కు షాకిచ్చాడు. దీంతో ముంబయి ఫైనల్లో చోటు ఖాయం చేసుకోగా, హంటర్స్ వేటకు తెరపడింది.

వైఫల్యాలపై బీజేపీ పరదా..?

నెరవేరని ఏటా 2 కోట్ల ఉద్యోగాల హామీ

- దిగజారిన దేశ ఆర్థిక వ్యవస్థ
- చేజారిన మూడు రాష్ట్రాలు..ముందస్తు వ్యూహం
- తెరపైకి ఈబీసీ రిజర్వేషన్ల అస్త్రం
- ఓటర్ల దృష్టి మళ్లించడం మోడీకి సాధ్యమా..?



న్యూఢిల్లీ: ఇటీవల జరిగిన ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల్లో ఎదురైన చేదు అనుభవాలతోనే ప్రధాని మోడీ నేతృత్వంలోని బీజేపీ ప్రభుత్వం ఈబీసీ రిజర్వేషన్ అంశాన్ని తెరమీదికి తెచ్చినట్టుగా రాజకీయ పరిశీలకులు విశ్లేషిస్తున్నారు. 2014 ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో వైఫల్యం చెందిన ప్రధాని మోడీ అగ్రకులాల్లోని పేదలకు రిజర్వేషన్ అంటూ దృష్టి మళ్లించేందుకు యత్నిస్తున్నారన్న వాదన వినిపిస్తున్నది.



ఏటా రెండు కోట్ల ఉద్యోగాలు కల్పిస్తానన్న ప్రధాని మోడీ నాలుగున్నరేండ్లలో 50 లక్షల ఉద్యోగాలను కూడా కొత్తగా సృష్టించలేకపోయారని పలు సర్వేలు వెల్లడించాయి. మరోవైపు రాఫెల్ యుద్ధ విమానాల ఒప్పందం విషయంలో రోజుకో అబద్ధం చెబుతూ పార్లమెంట్‌నే పక్కదారి పట్టించారన్న విమర్శలు వెల్లువెత్తాయి. 36 యుద్ధ విమానాలను రూ.58,000 కోట్లకు కొనుగోలు చేయడం ద్వారా దేశ ఖజానాకు కనీసం రూ.20 వేల కోట్లు నష్టం కలిగించారని ఆరోపణలున్నాయి. పెద్దనోట్ల రద్దు, హడావుడిగా జీఎస్టీని అమలులోకి తేవడంలాంటి అనాలోచిత నిర్ణయాలతో దేశ ఆర్థిక వ్యవస్థను దిగజార్చారన్న విమర్శలున్నాయి. ఎల్లెడలా ప్రజా వ్యతిరేకతను మూట కట్టుకున్న మోడీ ఎలాగైనా 2019 ఎన్నికల్లో గట్టెక్కాలన్న వ్యూహంతోనే ఈబీసీ రిజర్వేషన్ల నిర్ణయానికి సాహసించినట్టుగా రాజకీయ పరిశీలకులు భావిస్తున్నారు. మోడీ ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయాన్ని అమలులోకి తేవాలంటే రాజ్యాంగ సవరణ తప్పదని బీజేపీ పెద్దలకు తెలియనిదేమీకాదు. అందుకు లోక్‌సభతోపాటు రాజ్యసభలోనూ సంపూర్ణ మద్దతు అవసరం. లేనిపక్షంలో ఈబీసీలకు 10 శాతం రిజర్వేషన్లను అమలు చేయడం రాజ్యాంగపరంగా సాధ్యంకాదు. రాజ్యాంగం ప్రకారం రిజర్వేషన్లు 50 శాతం దాటరాదని గతంలో సుప్రీంకోర్టు ఆదేశించింది. ఇప్పటికే ఎస్సీ,ఎస్టీ,ఓబీసీ,ఇతర రిజర్వేషన్లు 50 శాతం అమలవుతున్నాయి.

అగ్రకులాల్లోని పేదలకు రిజర్వేషన్ కల్పించడమనేది ఆర్‌ఎస్‌ఎస్ ఆలోచనగా పరిశీలకులు చెబుతున్నారు. గుజరాత్‌లో హార్దిక్ పటేల్ నేతృత్వంలో పటీదార్లు తమను ఓబీసీల్లో చేర్చాలని డిమాండ్ చేస్తూ పెద్దఎత్తున ఆందోళనలు నిర్వహించిన విషయం తెలిసిందే. పలు రాష్ట్రాల్లో తమకు రిజర్వేషన్లు కల్పించాలని అగ్ర కులాల్లోని కొన్ని సామాజిక వర్గాలు డిమాండ్ చేస్తున్నాయి. ఈ నేపథ్యంలోనే తమకంటూ ఓ నమ్మకమైన ఓటుబ్యాంక్‌ను ఏర్పాటు చేసుకోవాలన్న వ్యూహంతోనే సంఘ్‌పరివార్, బీజేపీలు ఈబీసీల రిజర్వేషన్‌కు తెర తీశాయని భావిస్తున్నారు. అసలు ఉద్యోగాలే లేవు. కోటా వల్ల ఉపయోగమేమిటని దళిత నేత జిగ్నేశ్ మేవానీ ట్వీట్ చేశారు. ఈబీసీలకు 10 శాతం రిజర్వేషన్లు లీగల్‌గా పలు ఇబ్బందులతో కూడినదని బీజేపీ మాజీ సీనియర్ నేత, కేంద్ర మాజీమంత్రి యశ్వంత్‌సిన్హా అన్నారు. పార్లమెంట్ ఉభయసభల్లో బిల్లు పాస్ చేయడానికి కూడా తగినంత సమయంలేదని ఆయన అన్నారు. కేంద్ర ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం ఓ జిమ్మిక్కుగా తేలిపోతుందని ఆయన విమర్శించారు. కాగా బీజేపీ అధిష్టానం మాత్రం ఆ మూడు రాష్ట్రాల్లో కీలకమైన ఓట్లు,సీట్లు సాధించేందుకే ఓబీసీ రిజర్వేషన్లు అంశాన్ని తెరపైకి తెచ్చిందని రాజకీయపరిశీలకులు అంటున్నారు.

Printed and Published by Nandayala Narsimha Reddy On behalf Of Navatelangna Printers Private Limited, Printed At M.H Bhavan, 1st Floor, Plot No. 21/1, Azamabad Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020,Telangana State, Published at Navatelangana Printers Private Limited, M.H Bhavan,1st Floor No.21/1, Azamabad, Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020, Telangana State Editor : S.Veeraiah.Tel Tel/2014/59462.